జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | శుక్రవారం 24 ఏప్రిల్ 2026 | సంపుటి: 19 | సంచిక: 47 | పేజీలు: 12 | వెల: రూ.5 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , వైశాఖ మాసము , తిథి: షష్టి - 19:05:09 వరకు నక్షత్రంమూల - నిండా రాత్రి వరకు కరణంవణిజ - 19:05:09 వరకు పక్షంకృష్ణ యోగంవరీయన - 17:09:13 వరకు వారం

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

## కాళేశ్వరంపై సుప్రీం కోర్టులో అప్పీల్

తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు తీర్పు నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ అంశంపై

మిగతా1 2లో..

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

తిరిగి జూన్ 12న పాఠశాలలు ప్రారంభం

ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లలేని పరిస్థితి

హైదరాబాద్,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): తెలంగాణలోని పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవుల సందడి మొదలైంది. పెరుగుతున్న ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని విద్యాశాఖ

మిగతా 2లో..

## రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

### ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్

- భారీగా పోలింగ్ శాతం నమోదు
- ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- ఓటేసిన సినీనటులు రజనీ, కమల్, అజిత్
- ఓటేసిన చిదంబరం, స్టాలిన్ , ఉదయనిధి
- తమిళనాట, బెంగాల్లోనూ పోటెత్తిన ఓటరు
- దాదాపు 83శాతం పోలింగ్ నమోదు
- దాదాపు 90శాతం వరకు పోలింగ్ నమోదు



న్యూఢిల్లీ,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): దేశంలో కీలక రాష్ట్రాలైన తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల తొలి దశ పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పించారు. ఈ దశలో రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదు కావడం విశేషంగా మారింది. రెండు రాష్ట్రాల్లోనూ రికార్డు స్థాయిలో పోలింగ్ నమోదైంది. ఈ సాయంత్రం 5గంటల వరకు తమిళనాడులో 82.24శాతం పోలింగ్ నమోదు కాగా, పశ్చిమ బెంగాల్ తొలి విడత ఎన్నికల్లో 89.93శాతం నమోదైనట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. చెన్నైలో 81.34శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. అలాగే, బెంగాల్‌లోని దక్షిణ్ దినాజ్‌పుర్‌లో అత్యధికంగా 93.12శాతం పోలింగ్ నమోదైనట్లు వెల్లడించారు. సాయంత్రం 6గంటలతో పోలింగ్ సమయం ముగియగా.. ఇప్పటికే క్యూలైన్లలో ఉన్న వారికి ఓటు వేసేందుకు అనుమతించారు. ప్రజలు భారీ సంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తాజా సమాచారం ప్రకారం, తమిళనాడులో సాయంత్రం 5 గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైంది. అదే సమయంలో పశ్చిమ బెంగాల్‌లో 89.93 శాతం పోలింగ్ నమోదు కావడం గమనార్హం. మొత్తం 294 స్థానాలు

మిగతా 2లో..




# చర్చలకు సిద్ధం

## ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు

- కార్మికులు ఎలాంటి ఉద్రేకపూరిత చర్యలకు దిగొద్దు
- కాళేశ్వరం తీర్పు పరిశీలించాక తదుపరి చర్యలు
- తదుపరి కార్యాచరణపై సబ్‌కమిటీలో నిర్ణయం
- సిబిఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయం
- మంత్రుల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయల చెల్లింపు
- వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు
- సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం
- తెలంగాణ కేబినేట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- వివరాలు వెల్లడించిన మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి
- కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు
- ఆర్టీసీ సమ్మెపై కేబినేట్ భేటీలో ప్రస్తావన
- నేడు చర్చలు జరపాలని డిప్యూటి సిఎంకు ఆదేశం
- అనాలోచిత చర్యలకు పాల్పడవద్దని శ్రీధర్ బాబు వినతి

హైదరాబాద్,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులతో నేడు మంత్రుల బృందం చర్చలు జరుపనుంది. కార్మికులు ఎలాంటి ఉద్రేకపూరిత చర్యలకు దిగొద్దని కేబినేట్ విజ్ఞప్తి చేసింది. కాళేశ్వరం తీర్పు పరిశీలించాక తదుపరిచర్యలు తీసుకోవాలని, న్యాయనిపుణులతో సంప్రదించాలని, సిబిఐ విచారణ కోసం ఒత్తిడి పెంచాలని నిర్ణయం

మిగతా 2లో..



## రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

- ఎక్కడిక్కడే నిలిచిపోయిన బస్సులు
- బలవంతంగా నడిపేందుకు యత్నాలు
- పలుచోట్ల కార్మికులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అద్దె బస్సులను నడిపేందుకు యత్నం
- సమ్మెను విచ్ఛిన్నం చేయవద్దని వేడుకున్న కార్మికుడు
- పెట్రోల్ పోసుకుని డ్రైవర్ ఆత్మహత్యాయత్నం

హైదరాబాద్,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె గురువారం కూడా కొనసాగింది. ఆర్టీసీ బస్సులు డిపోలకే పరిమితం కావడంతో ప్రయాణికులు నానా యాతన పడుతున్నారు. తమ న్యాయమైన హక్కుల కోసం ఉద్యమిస్తున్న ఆర్టీసీ కార్మికులపై కాంగ్రెస్ ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్నది. పోలీసుల పహారాలో బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి బలవంతంగా బస్సులను నడుపాలని చూస్తున్నది. అయినప్పటికీ ఆర్టీసీ కార్మికులు తెల్లవారుజాము నుంచే బస్సుల వద్దకు చేరి ఒక్క బస్సును కూడా కదలనీయలేదు. పోలీసులు బలవంతంగా ఆర్టీసీ కార్మికులను అరెస్ట్

మిగతా 2లో..




## ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్

### ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు

గజ్వేల్,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): సిద్దిపేట జిల్లా ములుగు మండలం తునికి బొల్లారం టీజీఐఐసీ ఇండస్ట్రియల్ పార్క్ లోని 'ఆజాద్ - సెంటర్ ఆఫ్ ఎక్స్ లెన్స్,ఇన్నోవేషన్ సెంటర్'లో 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన 'ది ఎక్స్ క్లూజివ్ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఫర్ బేకర్ హ్యూస్'ను గురువారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు లాంఛనంగా ప్రారంభించారు. అమెరికాకు చెందిన గ్లోబల్ ఎనర్జీ టెక్నాలజీ కంపెనీ 'బేకర్ హ్యూస్'...ఆయిల్ ఫీల్డ్ సర్వీసెస్/ ఎక్విప్ మెంట్(వోఎఫ్ సీఈ), ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ(ఐఈటీ), టెక్నాలజీ / డిజిటల్ సొల్యూషన్స్ తదితర రంగాల్లో ప్రపంచవ్యాప్తంగా 120 దేశాల్లో కార్యకలాపాలను నిర్వహిస్తోంది. తాజాగా ప్రారంభమైన ఈ యూనిట్ లో బేకర్ హ్యూస్.... ఇండస్ట్రియల్ / ఎనర్జీ టెక్నాలజీ విభాగానికి అవసరమైన హై ప్రెసిషన్ ఉత్పత్తులు తయారవుతాయి.¯త్తగా 230 హై స్కిల్డ్ వర్క్ ఫోర్స్ కి ఉపాధి లభిస్తుంది. తయారీ రంగంలో 'మేడ్ ఇన్ తెలంగాణ' మరింత విశ్వవ్యాప్తం అవుతుంది.

## ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

అదుపుతప్పి ముందున్న వాహనాలను ఢీకొన్న ట్రక్కు

మంటలు చెలరేగి 11మంది సజీవ దహనం

లక్నో,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): ఉత్తర్‌ప్రదేశ్ లో ఘోర ప్రమాదం జరిగింది. ఒక ట్రక్కు అదుపు తప్పి పలు వాహనాలను ఢీకొట్టడంతో 11 మంది సజీవ దహనమయ్యారు. పోలీసులు తెలిపిన

మిగతా 12లో..

## హైదరాబాద్‌లో ఒక్కసారిగా మారిన వాతావరణ

మేఘావృతమై ఉరుములతో చిరుజల్లులు

హైదరాబాద్,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో గురువారం మధ్యాహ్నం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు తీవ్రమైన ఎండలు దంచి కొట్టగా.. ఆ తర్వాత ఉన్నట్టుండి వాతావరణం

మిగతా 12లో..

ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు

# కారిడార్

### డబుల్ డెక్కర్ కారిడార్‌తో ట్రాఫిక్‌కు చెక్

### ప్రాజెక్ట్‌పై అధికారులతో చర్చించిన మంత్రి కోమటిరెడ్డి



హైదరాబాద్,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ ఆల్ ఇండియా రేడియో స్టేషన్ వరకు నిర్మించతలపెట్టిన 7.1 కి.మీ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పురోగతిపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గురువారం డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. సుదీర్ఘంగా సుమారు 4గంటల పాటు జరిగిన ఈ సమీక్ష సమావేశంలో ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాస రాజు,ఆర్ అండ్ బి స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద మోహన్,ఆర్ అండ్ బి సి.ఈ ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

మిగతా 12లో..

# సంపాదకీయం

## ప్రగతి చక్రంపై నిర్లక్ష్యపు చీడ !

అధికారంలోకి రావడానికి అనేక హామీలు గుప్పించడం, తరవాత వాటిని విస్మరించడం పరిపాటిగా మారింది. అలవికాని హామీలు ఇవ్వడం, ప్రజలను మోసం చేయడం అలవాటు చేసుకున్నారు. బిఆర్ఎస్ బాటలోనే ఇప్పుడు కాంగ్రెస్ కూడా మోసాల దారిలో నడుస్తోంది. ఇచ్చిన హామీలను అమలు చేయలేక చతికిల పడింది.రాష్ట్ర ఆదాయం మొత్తాన్ని వడ్డీలు కట్టడానికే అన్నట్లుగా అప్పులు చేసి చూపారు. అప్పులతో తెలంగాణ చితికి పోతోంది. ఇందులో అన్ని పార్టీలతది ఒకటే దారిగా ఉంది. తెలంగాణ ఏర్పడ్డాక కెసిఆర్ ప్రభుత్వ హాయంలో ఆర్టీసి దాదాపు రెండునెలల పాటు సమ్మెకు దిగింది. వారిని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఆర్టీసిని ప్రభుత్వంలో విలీనం చేస్తామన్న హామీని ఆనాడు కెసిఆర్, ఈనాడు రేవంత్ రెడ్డి ఇద్దరూ నిలబెట్టుకోలేక పోయారు. దూరదృష్టి లేక రవాణా శాఖ.. సమ్మెకు కారణమయ్యారు. ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం, వేతన సవరణ, బకాయిల చెల్లింపు సహా మొత్తం 32 అంశాలపై కార్మిక సంఘాల జేఏసీ ఏడాది కాలంగా ప్రభుత్వ పెద్దలకు, ఆర్టీసీ యాజమాన్యానికి వినతిపత్రాలు ఇచ్చింది.. విజ్ఞాపనలు చేసింది. సమ్మెకు వేళయిన తరుణంలో మంగళవారం ఆగమేఘాలపై అధికారుల కమిటీ పేరుతో ప్రభుత్వం ఓ కంటి తుడుపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది. ఏడాదిగా పట్టింపులేనితనం ప్రదర్శించి, ఇప్పుడు నాలుగు వారాల గడువు కోరటం విడ్డూరం.ఇలాంటి కాలయాపన కమిటీతో ఒరిగేదేమీ లేదని భావించిన కార్మికులు, సమస్యలు పరిష్కరించే వరకు వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని తేల్చిచెప్పి, మంగళవారం అర్ధరాత్రి నుంచే సమ్మెకు వెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్సు చక్రాలు ఆగిపోయాయి. 6,000 బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. ప్రతి రోజూ 60 లక్షల మంది ప్రయాణించే ఆర్టీసీలో సమ్మెతో ప్రజానీకం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు ఎండలు మండిపోతుంటే ప్రైవేటు వాహనాలు అందుబాటులో లేక ప్రయాణాలు ప్రయాసగా మారాయి. విద్యార్థులు, రోజువారీ, కూలీలు, ఉద్యోగులు, తక్కువ ఖర్చుతో కూడిన ప్రజా రవాణాను ఆశ్రయించే ఇతర ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. డిపోల వద్ద కార్మికుల ధర్నాలు, పోలీసులు అడ్డుకోవడంతో పలుచోట్ల ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీ నష్టాల్లో సాగుతోంది. ఆర్టీసీ కార్మికులను ఒప్పించలేక, మెప్పించలేక చతికిలపడిన తీరు రేవంత్ సర్కార్ అసమర్థతకు నిదర్శనంగా చూడాలి. మాటలు, ఆవేశంతో కూడిన ప్రసంగాలతో ప్రజలను ఎల్లకాలం బురిడీ కొట్టించలేమని అధికార కాంగ్రెస్ నేతలు గుర్తించాలి. నిత్యం అరకోటి మందికి పైగా ప్రయాణించే ప్రజారవాణా వ్యవస్థలో సమస్యల పరిష్కారం చూపడంలో రెండున్నరేళ్లుగా నిర్లక్ష్యం వహించారు. ప్రభుత్వం ఇంకా దాటవేత ధోరణి అవలంబించి సమస్యను జటిలం చేయకుండా సమ్మెకు కారణాలను గుర్తించి పరిష్కరించాలి. ఆర్టీసీ కార్మికుల,రాష్ట్ర ప్రజల విస్తృత ప్రయోజనాల దృష్ట్యా సమ్మెకు సత్వరమే పరిష్కారం కనుగొనాలి. ఈ దిశగా సర్కార్ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఎన్నికల్లో డిక్లరేషన్లు, మ్యానిఫెస్టోలో హామీలు గుప్పించి, ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన హస్తం నేతలు పాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని అల్లకల్లోలం చేస్తున్నారు. ఇప్పుడు ప్రజా రవాణా వ్యవస్థ కూడా ఆ జాబితాలో చేరిపోయింది. హామీల అమలు, సమస్యల పరిష్కారంలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ కార్మిక సంఘాలు సమ్మెబాట పట్టాయి. అధికారంలోకి రావటానికి కాంగ్రెస్ నేతలు ఇచ్చిన హామీలను ఇప్పుడు మరచిపోయి మాట్లాడుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం కోసం ప్రణాళికను ప్రకటించినా ఆచరణలో పెట్టలేకపోయింది. తాము అధికారంలోకి వస్తే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో పాటు పీఆర్సీ పరిధిలోకి తీసుకొస్తామని, ఉద్యోగాలను క్రమబద్ధీకరిస్తామని, ఖాళీలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ హామీల మీద హామీలు గుప్పించింది. దీంతో ఆర్టీసీ కార్మికులు కాంగ్రెస్ మాటలనునమ్మారు. రెండున్నరేండ్లు గడిచినా కాంగ్రెస్ సర్కార్ ఆర్టీసీ గురించి పట్టించుకోవట్లేదు. ఆరు గ్యారెంటీల్లోని ఒక గ్యారెంటీ అయిన మహాలక్ష్మి పథకంలో ఒక భాగమైన 'మహిళలకు ఆర్టీసీలో బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం' తీసుకొచ్చింది. కానీ ఆర్టీసీకి ప్రభుత్వం నిధులు ఇవ్వటంలేదు. ఇప్పుడు కార్మిక సంఘాల జేఏసీ అడుగుతున్న డిమాండ్లలో ఫ్రీ బస్ పథకం నిధుల విడుదల అంశం కీలకమైనది కావడం గమనార్హం. మహిళలకు ఉచిత ప్రయాణంతో ఆర్టీసీ లాభాల్లోకి దూసుకెళ్లిందని చెప్పుకొంటున్న ప్రభుత్వ పెద్దలు.. కార్మికుల సమస్యలు ఎందుకు పరిష్కరించటంలేదో చెప్పాలి. ఇకపోతే ఎన్నికల ముందు కాంగ్రెస్ నిరుద్యోగ మ్యానిఫెస్టోను ప్రకటించింది. తమ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోగా 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామని ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని చిక్కడపల్లి లైబ్రరీకి తీసుకువచ్చి నిరుద్యోగుల్లో ఆశలు పెంచింది. ప్రియాంక గాంధీతో సరూర్‌నగర్ స్టేడియంలో యూత్ డిక్లరేషన్ ప్రకటించి నిరుద్యోగులను తమ వైపు తిప్పుకున్నది. 2 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని నిరుద్యోగుల్లో ఆశలు కల్పించారు. అది నిజమని నమ్మిన ఎంతోమంది బస్సు యాత్రలు నిర్వహించి ఆ పార్టీకి అనుకూలంగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓటు వేయడమే కాదు, ఏకంగా పత్తి చేలు, వ్యవసాయ బావుల వద్ద కూలీలు, రైతులను కలిసి, కాళ్లు మొక్కి కాంగ్రెస్‌కు ఓట్లు వేయించేలా తమ వంతు ప్రయత్నించారు. పదేండ్లపాటు అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నాయకులకు ఉద్యోగాలు వచ్చాయి తప్ప నిరుద్యోగులకు ఒక్క ఉద్యోగమూ రాలేదు. ఇలా అనేక హామీలను ఇచ్చి, వాటిని మరిచారు. ఇప్పుడు గత ప్రభుత్వాన్ని తిట్టడం తప్ప రెండున్నరేళ్లుగా గట్టిగా చేసిన కార్యక్రమం ఒక్కటీ లేదు. హామీల అమలులో నిజాయితీ లేకుంటా గత బిఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్‌కు పడుతుంది. పదేళ్లపాటు అధికారంలో ఉంటామన్న భరోసాకు ప్రజలు చెల్లచీటీ పలుకుతారని గుర్తించాలి.

# చర్చలకు సిద్ధం

మొదటిపేజీ తరువాయి..

తీసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల జీతాల్లో 50శాతం రిటైర్డ్ ఉద్యోగుల బకాయల చెల్లింపునకు ఉపయోగించాలని నిర్ణయించారు. వందరోజుల్లోగా బకాయిలు పూర్తిగా చెల్లింపు చేయనున్నారు. సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. తెలంగాణ కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాల వివరాలు మంత్రులు పొంగులేటి, ఉత్తమ్, వాకిటి శ్రీహరిలు వెల్లడించారు. ఆర్టీసీ కార్మికుల సమ్మెపై తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో కీలకంగా చర్చ జరిగింది. సమస్య పరిష్కారం దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తూ, తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సమస్యకు పరిష్కారం కాదని స్పష్టం చేసిన ఆయన.. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో నేడు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని ప్రభుత్వం నిర్ణయించింది. మంత్రుల కమిటీతో చర్చలకు రావాలని కార్మిక సంఘాలకు పిలుపునిచ్చింది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రుల బృందం కార్మిక సంఘాలతో భేటీ కానుంది. ఈ క్రమంలోనే తెలంగాణ కేబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరాలు వెల్లడించారు. మీడియా సమావేశంలో ఉత్తమ్ కుమార్ రెడ్డి, వాకిటి శ్రీహరి కూడా పాల్గొన్నారు. ఇకపోతే మంత్రులు, ఎమ్మెల్యేల వేతనాల్లో 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాలని కేబినెట్ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. అలాగే, సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించాలని కూడా నిర్ణయించినట్లు చెప్పారు. ఆర్టీసీ సమ్మెపై కేబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. సమస్య పరిష్కారానికి ఐదుగురు మంత్రులతో కార్మిక సంఘాలతో చర్చలు జరపనున్నట్లు వెల్లడించారు. కార్మికులు క్షణికావేశానికి లోనుకావొద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్మికుల సమస్యల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, చర్చల ద్వారా పరిష్కారం సాధించేందుకు కృషి చేస్తామని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. అలాగే, రెవెన్యూ రిసోర్సెస్ కమిటీని ఏర్పాటు చేసినట్లు కూడా కేబినెట్ నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, కార్మికులు తొందరపడొద్దని, డిమాండ్ల పరిష్కారానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. కార్మికులు ప్రాణాలు తీసుకోవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ క్రమంలోనే, కార్మికులు సంయమనం పాటించాలని మంత్రి శ్రీధర్‌బాబు సూచించారు. ప్రాణాలు తీసుకోవడం సరైంది కాదని, ఆర్టీసీ కార్మికుల పాత్ర రాష్ట్ర సాధనలో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వంపై నమ్మకం ఉంచాలని ఆయన కోరారు. అలాగే, కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపైనా కూడా చర్చ జరిగింది. ఈ కేసులో సిబిఐ విచారణకు ఒత్తిడి తేవాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇకపోతే గతంలో పదేండ్లు అధికారంలో ఉన్న ప్రభుత్వం ఉద్యోగులకు సంబంధించి వేల కోట్ల బిల్లులు పెండింగ్ లో పెట్టింది. తెలంగాణ ఏర్పడే నాటికి ఒక్క రూపాయి కూడా బకాయి లేదు. రిటైర్మెంట్ ఏజ్ పెంచటంతో పాటు రిటైరైన ఉద్యోగులకు ఇవ్వాల్సిన బెనిఫిట్స్ ఇవ్వకపోవటంతో రిటైర్డ్ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి. రాష్ట్ర మంత్రివర్గం ఈ సమస్యపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. రిటైర్డ్ ఉద్యోగులు ఆఫీసుల చుట్టూ, సచివాలయం చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా వెంటనే వారికి ఇచ్చే బకాయిల చెల్లింపులకు తగిన చర్యలు చేపట్టాలని నిర్ణయం తీసుకుంది. రెగ్యులర్ ఉద్యోగులకు సంబంధించి రూ.6,200 కోట్లు, రిటైర్డ్ ఉద్యోగులకు ఇవ్వాల్సినవి రూ.8 వేల కోట్లు పెండింగ్ లో ఉన్నాయి. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా వీటిని వెంటనే ఇవ్వలేని పరిస్థితి ఉన్నప్పటికీ వెంటనే ప్రత్యామ్నాయ మార్గాలన్నీ అన్వేషించి, అవసరమైన నిధులు సర్దుబాటు చేయాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. అవసరమైతే తమ జీతాలు, ప్రజా ప్రతినిధులకు ఇచ్చే జీతాల నుంచి 50 శాతం రిటైర్డ్ ఉద్యోగులకు వెంటనే సర్దుబాటు చేయాలని మంత్రులందరూ ఉదారంగా ముందుకువచ్చారు. రిసోర్స్ మొబిలైజేషన్ సబ్ కమిటీ వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలు, రిటైర్డ్ ఉద్యోగుల సంఘాలు, బాధ్యులైన వారందరినీ పిలిచి చర్చలు జరపాలని, వీలైనంత తొందరగా ఈ సమస్యను పరిష్కరించాలని మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. వంద రోజుల్లోగా రిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపు దిశగా తగిన ఏర్పాట్లు చేయాలని నిర్ణయించింది. పీఏసీఎస్ ఛైర్మన్లను రాబోయే రోజుల్లో నామినేటెడ్ పద్ధతిలో భర్తీ చేస్తాం. గచ్చిబౌలి స్టేడియాన్ని అభివృద్ధి చేసేందుకు టాటా సంస్థ అంగీకరించింది. ఈ స్టేడియంలోని 76 ఎకరాలను రూ.700 కోట్లతో అభివృద్ధి చేయనుందని తెలిపారు.

ఆర్టీసీ కార్మికులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఈమేరకు ఆయన కేబినెట్ భేటీలో మాట్లాడారు. ప్రాణాలు తీసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు తాము చిత్తశుద్ధితో ఉన్నామని.. ఈ అంశంపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు. శుక్రవారం కార్మిక సంఘాలతో చర్చించాలని మంత్రులకు సీఎం సూచించారు. ఈక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో మంత్రులు.. కార్మిక సంఘాలతో సమావేశం కానున్నారు. నర్సంపేటలో ఓ డ్రైవర్ ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన నేపథ్యంలో సిఎం ఈ వ్యాఖ్యలు చేసినట్లుగా తెలుస్తోంది. ఇదిలావుంటే ఆర్టీసీ కార్మికులు సంయమనం పాటించి... సమ్మె విరమించాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తప్పకుండా చర్చలు జరుపుతుందని గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికులు ఎలాంటి తొందర పాటు నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రాణాలు తీసుకునే అనాలోచిత చర్యలకు పాల్పడి మీ కుటుంబాలకు అన్యాయం చేయొద్దని విజ్ఞప్తి చేశారు. క్షణికావేశంతో కొత్త సమస్యలు వస్తాయని, ప్రేరేపిత శక్తుల ఒత్తిడికి బలి కావొద్దని కోరారు. కార్మికుల సమస్యల్ని పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, వెంటనే చర్చలకు ముందుకు రావాలని కార్మిక సంఘాల నేతలకు పిలుపునిచ్చారు. కార్మికులు ఆత్మనిబ్బరంతో ఉండాలని... ప్రభుత్వం తో చర్చల ద్వారా తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. మరోవైపు.. ఈయూ ఆఫీసులో ఆర్టీసీ జేఏసీ అత్యవసర సమావేశం నిర్వహించింది. ఈ సందర్భంగా జేఏసీ ఛైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్‌రెడ్డి తదుపరి కార్యాచరణ ప్రకటించారు. ఈ నెల 24న అన్ని డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల మౌన ప్రదర్శన, 25న అన్ని డిపోల్లో వంటవార్పు, 26న జిల్లాల్లో ఆర్టీసీ సంఘాల కార్మిక కవాతు, 27న ప్రజాప్రతినిధులకు వినతిపత్రాల అందజేత, అన్ని డిపోల్లో బతుకమ్మలతో మహిళా ఉద్యోగుల నిరసన, 29న డిపోల ముందు ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శనలు ఉంటాయన్నారు.

## రెండోరోజూ కొనసాగిన ఆర్టీసీ సమ్మె

మొదటిపేజీ తరువాయి..

చేసినా ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. బస్సులు లేకపోవడంతో ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలను ఇష్టారాజ్యంగా దోచుకుంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణికులు అధిక ధరలు చెల్లించ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. మెదక్ ఆర్టీసీ డిపో నుంచి ఈరోజు తెల్లవారుజామున బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ప్రయత్నం చేయగా కార్మికులు అడ్డుకోవడంతో పోలీసులు వారిని అరెస్టు చేశారు. గురువారం తెల్లవారుజామున ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తు మధ్య బస్సులు నడిపేందుకు డిపో నుంచి బస్టాండ్ వరకు బస్సులు తీసుకురాగా కార్మికులు సమాచారం తెలుసుకొని భారీ సంఖ్యలో చేరుకొని అడ్డుకున్నారు. ఆర్టీసీ బస్సులను అడ్డుకోవడంతో పోలీసులు కార్మికులను బలవంతంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో 9డిపోల్లో 600 వందల బస్సులు నిలిచి పోయాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా సమ్మె కొనసాగుతున్నది. కామరెడ్డి జిల్లాలో ఆర్టీసీ కార్మికుల టెంట్‌ను పోలీసులు తొలగించడంతో వివాదం చోటు చేసుకుంది. ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా రెండో రోజు బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. సిద్దిపేట జిల్లాలోని సిద్దిపేట, హుస్నాబాద్, దుబ్బాక, గజ్వేల్ డిపోల ఎదుట ఆర్టీసీ కార్మికులు డిపోల ఎదుట ధర్నా చేపట్టారు. నల్లగొండ, సూర్యాపేట జిల్లాలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో బస్సులు నడుపాలని చూడగా ఆర్టీసీ కార్మికులు అడ్డుకున్నారు. మహబూబా బాద్ జిల్లాలో ఆర్టీసీ కార్మికులపై పోలీసుల అత్యుత్సాహం ప్రదర్శించారు. రెండో రోజు సమ్మె కొనసాగుతుండగా తొర్రూరు డిపో వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించారు. విధులకు రాని 21 మంది కార్మికులపై కేసు నమోదు చేశారు. సమ్మెలో పాల్గొనేందుకు డిపో వద్దకు వస్తున్న కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. ఆర్టీసీ ఉద్యోగులను అరెస్ట్ చేసి కేసులు నమోదు చేయడంపై ఉద్యోగ సంఘాల నేతలు మండిపడుతున్నారు. తక్షణమే వారిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండో రోజు ఆర్టీసీ కార్మికుల సమ్మె కొనసాగుతున్నది. పోలీసుల పహారా మధ్య బలవంతంగా అద్దె బస్సులను నడిపేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుండగా ఆర్టీసీ కార్మికులు ఎక్కడి కక్కడ అడ్డుకుంటున్నారు. తాజాగా జనగామ జిల్లాలో నిరసనకు దిగిన ఆర్టీసీ కార్మికులను అడ్డుకోవద్దంటు ఓ ఆర్టీసీ కార్మికుడు పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకున్న సంఘటన ప్రతి ఒక్కరిని కదలించింది. జనగామ ఆర్టీసీ డిపో ఎదుట సీఐ సత్యనారాయణ రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు నడుమ జనగామ డిపో నుండి వివిధ ప్రాంతాలకు బస్ కు ఒక కానిస్టేబుల్‌ను పెట్టి పంపిస్తున్నారు. ఈ క్రమంలో న్యాయమైన తమ డిమాండ్ల కోసం రోడ్డెకిన తమను అడ్డుకోవద్దంటూ పోలీసుల కాళ్లు మొక్కి వేడుకున్నాడు. కాగా, డిమాండ్స్ నెరవేర్చే వరకు సమ్మె ఆపేదే లేదని ఆర్టీసీ కార్మికులు స్పష్టం చేస్తున్నారు. ఆర్టీసీ డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం అవలంభిస్తున్న మొండి వైఖరికి నిరసనగా వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆర్టీసీ డ్రైవర్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడడం తీవ్ర సంచలనం కలిగించింది. రాష్ట్రవ్యాప్తంగా సమ్మెలో దిగిన ఆర్టీసీ కార్మికులు రెండోరోజు అన్ని ఆర్టీసీ డిపోల ఎదుట మహాధర్నాకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా గురువారం నర్సంపేట డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్న డ్రైవర్ కోలా రమేశ్‌గౌడ్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. సహచర కార్మికులు వెంటనే అప్రమత్తమై మంటలను ఆర్పివేసి తీవ్రంగా గాయపడ్డ డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉండడంతో చికిత్స నిమిత్తం వరంగల్ ఆసుపత్రికి తరలించారు.

## కాళేశ్వరంపై సుప్రీం కోర్టులో అప్పీల్

మొదటిపేజీ తరువాయి..

సుప్రీంకోర్టును ఆశ్రయించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. కాళేశ్వరం తీర్పును సవాలు చేస్తూ స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని టీజీ సర్కార్ నిర్ణయించింది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తయ్యాయని, తదుపరి చర్యలకు సిద్ధమవుతున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. ప్రాజెక్టుకు సంబంధించిన వివిధ అంశాలపై న్యాయస్థానంలో పూర్తి వివరాలు సమర్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాల్లోనూ, పాలనా వర్గాల్లోనూ చర్చనీయాంశంగా మారింది. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్‌పై దాఖలైన పిటిషన్లపై తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. కమిషన్ సమర్పించిన నివేదిక ఆధారంగా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావు, ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్, మాజీ ఐఏఎస్ ఎస్కే జోషిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని ప్రభుత్వాన్ని ఆదేశించింది. అంతేకాకుండా, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణలో పలు నిబంధనలు పాటించలేదని హైకోర్టు అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కమిషన్ నివేదిక ఆధారంగా ముందస్తు చర్యలు చేపట్టరాదని స్పష్టం చేసింది.

## నేటినుంచి స్కూళ్లకు వేసవి సెలవులు

మొదటిపేజీ తరువాయి..

కీలక నిర్ణయం తీసుకుంది. గురువారం 23తో ప్రస్తుత విద్యా సంవత్సరం అధికారికంగా ముగిసింది. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వేసవి విరామం ప్రారంభం కానుంది. ప్రభుత్వ క్యాలెండర్ ప్రకారం, ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు సెలవులు కొనసాగుతాయి. దాదాపు 50 రోజుల సుదీర్ఘ విరామం తర్వాత, జూన్ 12న పాఠశాలలు తిరిగి ప్రారంభమవుతాయి. సాధారణంగా ఏప్రిల్ నెలాఖరు వరకు తరగతులు నిర్వహించేవారు, కానీ ఈసారి ఎండలు తీవ్రమవుతుండటంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగానే సెలవులు ప్రకటించారు. విద్యా సంవత్సరం చివరి రోజైన గురువారంతో తరగతులు



ముగియనుండటంతో, స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టరేట్ ఒక ముఖ్యమైన ఆదేశాన్ని జారీ చేసింది. అన్ని ప్రభుత్వ స్కూళ్లు, మోడల్ స్కూళ్లు , కేజీబీవీలలో 'తల్లిదండ్రుల-ఉపాధ్యాయుల సమావేశం' నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశాల్లో విద్యార్థుల ప్రగతి నివేదికలను అందజేయడమే కాకుండా.. వేసవి కాలాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో చర్చించారు. వరుస పరీక్షల ఒత్తిడి తర్వాత విద్యార్థులకు ఈ 50 రోజుల సెలవులు గొప్ప ఉపశమనాన్ని ఇస్తాయి. అయితే ఎండలు ఎక్కువగా ఉన్నందున, పిల్లలు బయట తిరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు. మొత్తానికి సందడి, కేరింతల మధ్య పిల్లల వేసవి విడిది రేపటి నుంచే ప్రారంభం కాబోతోంది. అయితే ఆర్టీసీ సమ్మెతో గ్రామాలకు వెళ్లాలనుకున్న వారికి తీవ్రనిరాశ ఎదురయ్యింది. సమ్మెతో ఊళ్లకి వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. సమ్మె ముగిస్తేనే ఎక్కడికైనా వెళ్లడానికి అవకాశం ఉంటుంది.

# రెండు రాష్ట్రాల్లో ముగిసిన పోలింగ్

మొదటిపేజీ తరువాయి..

ఉండగా తొలి విడతలో 152 సీట్లకు ఎన్నికలు జరిగాయి. తమిళనాడులోని మొత్తం 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో పోలింగ్ జరిగింది. ఎన్నికల అధికారులు పోలింగ్ పక్రియను సజావుగా నిర్వహించారు. రెండు రాష్ట్రాల్లోని ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన మే 4 సోమవారం వెల్లడిస్తారు. ఆయా రాష్ట్రాల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని ఖచ్చితంగా ఇసి వెల్లడించనుంది. తమిళనాట మొత్తం 234 స్థానాలు, పశ్చిమ బెంగాల్‌లో తొలివిడతలో భాగంగా 152 స్థానాలకు పోలింగ్ జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ ఉదయం 7గంటలకే ప్రారంభమైన పోలింగ్ ప్రారంభం కాగా.. ఎండను సైతం లెక్క చేయకుండా భారీ సంఖ్యలో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి గంటల్లోనే పలువురు ప్రముఖులు పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పలువురు ప్ముఖులు ముందుగానే వచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పలువురు హీరోలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సూపర్ స్టార్ రజనీకాంత్ చెన్నైలోని స్టెల్లా మారిస్ కాలేజీలో పోలింగ్ బూత్ నెంబర్ 237లో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక మక్కల్ నీది మయ్యమ్ (ఎంఎన్ఎం) చీఫ్, ప్రముఖ నటుడు కమల్ హాసన్, ఆయన కుమార్తె శృతిహాసన్ ఆళ్వార్ పేట స్కూల్ కు చేరుకుని తమ ఓటు హక్కుని వినియోగించుకున్నారు. మరో ప్రముఖ నటుడు ఎస్. అజిత్ కుమార్ చెన్నైలోని తిరువాన్మియూర్ లో ఓటు వేశారు. కాగా, ప్రముఖ నటుడు ప్రభు, విక్రమ్ ప్రభు, శివకార్తికేయన్ లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 'ఓటు వేయడం అనేది భారత పౌరుల హక్కు. దయచేసి ఆ ఓటుహక్కును వినియోగించుకోండి' అని ఈ సందర్భంగా హీరో ప్రభు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో మొత్తం 234 స్థానాల్లో ఓటింగ్ జరుగుతోంది. తొలి గంటల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఉదయం 11 గంటల వరకు తమిళనాడులో 37.56 శాతం ఓటింగ్ నమోదైంది.

శివగంగ ప్రాంతంలోని పోలింగ్ కేంద్రంలో కేంద్ర మాజీ మంత్రి పి. చిదంబరం ఓటేశారు. భాజపా నేత ఖుష్బూ, నటి త్రిష ఓటు హక్కు వినియోగించుకున్నారు. టీవీకే చీఫ్ విజయ్ చెన్నైలో ఓటేశారు. ఆయన తిరుచిరాపల్లి ఈస్ట్, పెరంబూర్ నుంచి పోటీలో ఉన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్, ఆయన భార్య దుర్గా స్టాలిన్, వారి కుమారుడు ఉదయనిధి స్టాలిన్ చెన్నైలో ఓటేశారు.

తమిళనాడు ఓటర్లు చరిత్రలో సరికొత్త రికార్డు సృష్టించారు.. తమిళనాడులో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాయంత్రం ఐదు గంటల వరకు 82.24 శాతం పోలింగ్ నమోదైనట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. సాయంత్రం 6 గంటలకు పోలింగ్ ముగియగా.. క్యూలైన్లలో నిల్చున్న వారికి మాత్రమే ఓటు వేయడానికి అనుమతి ఉంటుందని ఈసీ స్పష్టం చేసింది. రాష్ట్ర చరిత్రలోనే ఇదే అత్యధిక పోలింగ్ శాతంగా నిలిచింది. తమిళనాడులో మొత్తం 4,71,60,321 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గతంలో రాష్ట్ర చరిత్రలో అత్యధిక పోలింగ్ 2011 ఎన్నికల్లో 78 శాతంగా నమోదైంది. 2021 ఎన్నికల్లో 73.63 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది. అయితే, ఈసారి ఆ రికార్డులన్నింటినీ అధిగమిస్తూ ఓటర్లు భారీగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చారు. ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ పోటీ చేస్తున్న కొలత్తూరు నియోజకవర్గంలో 83.58 శాతం పోలింగ్ నమోదైంది. మాజీ సీఎం పళనిస్వామి పోటీ చేస్తున్న ఎడప్పాడి నియోజకవర్గంలో 89.09 శాతం పోలింగ్ నమోదవడం విశేషం. నటుడు విజయ్ పోటీ చేస్తున్న పెరంబూర్‌లో 86.72 శాతం పోలింగ్ నమోదైంది. తిరుచిరాపల్లి ఈస్ట్‌లో 79.32 శాతం పోలింగ్ నమోదైంది. ఎండలను సైత లెక్కచేయకుండా ఓటర్లు ఓటేసేందుకు క్యూ కట్టారు.

ఇక, కొంగునాడు ప్రాంత జిల్లాల్లో కూడా రికార్డు స్థాయిలో ఓటింగ్ జరిగింది. కోయంబత్తూరు, తిరుప్పూర్, ఈరోడ్, సేలం, నమక్కల్, కరూర్, నీలగిరి, ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో 80 శాతానికి పైగా పోలింగ్ నమోదైంది. ఈసారి తమిళనాడు ఓటర్లు ప్రజాస్వామ్యంపై తమ నిబద్ధతను చాటారు. భారీ ఎత్తున పోలింగ్ జరగడంతో రాజకీయ పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది. అధిక ఓటింగ్ శాతం ఫలితాలపై ఎలా ప్రభావం చూపుతుందన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఎన్నికల బరిలోకి తొలిసారిగా దిగిన విజయ్ పార్టీ ఏ మేరకు ప్రభావం చూపుతుందో చూడాలి. తమిళనాడులో అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకేతో పాటు విజయ్ టీవీకే పార్టీల మధ్య త్రిముఖ పోరు నెలకొంది. ఎండల్ని లెక్క చేయకుండా తమిళ ప్రజలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పశ్చిమ బెంగాల్‌లో తొలి విడత పోలింగ్ భారీ రికార్డుల్ని క్రియేట్ చేస్తోంది. చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా ఓటర్లు పోలింగ్ సెంటర్ల ముందు బారులు తీరారు. సాయంత్రం 5 గంటల వరకు బెంగాల్‌లో 90 శాతం మేర ఓటింగ్ నమోదైంది. చాలా మంది ఇంకా క్యూ లైన్లలో నిలిచి ఉండటంతో ఈ పోలింగ్ శాతం మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# వడ్డూర్‌లో ఉపాధి హామీ పనుల పరిశీలన



**నేరడిగొండ ఏప్రిల్ 23 ప్రజాజ్యోతి :** నేరడిగొండ మండలంలోని వడ్డూర్ గ్రామంలో జరుగుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వడ్డూర్ గ్రామ సర్పంచ్ ఆడెపు శ్రీకాంత్ బుధవారం పరిశీలించారు. ప్రస్తుతం ఎండల తీవ్రత విపరీతంగా పెరుగుతున్న నేపథ్యంలో కూలీల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఉపాధి పనుల వద్ద ఎండ దెబ్బ తగలకుండా కూలీల కోసం షెడ్ నెట్ స్వచ్ఛమైన త్రాగునీరు మరియు తక్షణ శక్తి కోసం ఓఆర్ఎస్ ప్యాకెట్లను సర్పంచ్ స్వయంగా పంపిణీ చేశారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

ఎండ తీవ్రత నుండి ఉపశమనం పొందేందుకు పనుల నిర్వహణలో మార్పులు చేయాలని సర్పంచ్ సూచించారు. ఉదయం 6 గంటలకే పని ప్రదేశానికి చేరుకుని మొదటి ఫోటో (మొదటి క్యాప్షన్) తీసుకోవాలని, ఆ తర్వాత ఉదయం 10 గంటల వరకు పని పూర్తి చేసి రెండో ఫోటో (సెకండ్ క్యాప్షన్) దిగి ఇంటికి వెళ్లాలని ఆయన సూచించారు. దీనివల్ల మధ్యాహ్నం వేళ ఎండ బారిన పడకుండా ఉండొచ్చని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు నాయకులు చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ రజిత,ఫీల్డ్ అసిస్టెంట్ నర్సయ్య మరియు పెద్ద సంఖ్యలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు. సర్పంచ్ తీసుకున్న చొరవపై కూలీలు హర్షం వ్యక్తం చేశారు.

# ఆర్.టి.సి కార్మికుల సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు

## జిల్లా అధ్యక్షులు తాళ్ల రవీందర్



**అదిలాబాద్ టౌన్, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) :** తెలంగాణలో తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్‌టిసి కార్మికులు చేపట్టిన సమ్మెకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు తాళ్ల రవీందర్ పూర్తిస్థాయిలో మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికుల కష్టాలను ప్రభుత్వం గాలికొదిలేయడం సరికాదని, వారి డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు మరియు ఆర్టీసీని వెంటనే ప్రభుత్వంలో విలీనం చేసి, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ముఖ్యంగా సమ్మెలో ఉన్న కండక్టర్ల పేరు మీద టికెట్లు ఇష్యూ చేస్తున్నట్లు వస్తున్న వార్తలపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఇలాంటి అక్రమ చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, ఇది కార్మికులను మోసం చేయడమేనని మండిపడ్డారు, అలాగే కార్మికులు చేస్తున్న పోరాటం కేవలం వారి హక్కుల కోసమే కాదని, ఆర్టీసీ మనుగడ కోసమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎల్లప్పుడూ కార్మికుల పక్షాన ఉంటుందని, వారి పోరాటం విజయవంతం అయ్యే వరకు తమ మద్దతు కొనసాగుతుందని హామీ ఇచ్చారు. జిల్లా అధ్యక్షుడు తాళ్ల రవీందర్ తెలంగాణ రాజ్యాధికార పార్టీ తరపున సమ్మెలో తమకు మద్దతు పలికినందుకు ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తూ, ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు.

# బెండరా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం

– విద్యార్థులకు మంచి అవకాశమని ప్రిన్సిపాల్ పిలుపు



**కొమురం భీం జిల్లా ప్రజా జ్యోతి క్రైమ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 :** వాంకిడి మండలం బెండరా గ్రామపంచాయతీ పరిధిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. కనకయ్య వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దోస్త్ (ఋూు) ఆన్‌లైన్ విధానం ద్వారా అడ్మిషన్లు జరుగుతున్నాయని తెలిపారు. ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉన్నత విద్యను కొనసాగించడానికి ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన విద్యార్థులు తమ సమీపంలోనే ఉన్న ఈ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరి, తక్కువ ఖర్చుతో నాణ్యమైన విద్యను పొందవచ్చని ఆయన వివరించారు. విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు దోస్తు అడ్మిషన్ ప్రక్రియపై పూర్తి అవగాహన కలిగి, సమయానికి నమోదు చేసుకుని తమకు నచ్చిన కోర్సులను ఎంపిక చేసుకోవాలని సూచించారు. ఈ కళాశాలలో అందుబాటులో ఉన్న వివిధ డిగ్రీ కోర్సులు, అనుభవజ్ఞులైన అధ్యాపకులు, సదుపాయాలు విద్యార్థుల భవిష్యత్తును మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అన్నారు. అడ్మిషన్లపై అవగాహన పెంచేందుకు కళాశాల యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈరోజు అడ్మిషన్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేసి, పరిసర గ్రామాల్లో ప్రచారం ప్రారంభించారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యలో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలేజీ దోస్త్ కన్వీనర్ పి. స్వామి, అసిస్టెంట్ ప్రొఫెసర్ దేవేందర్, బోటనీ విభాగాధిపతి సంధ్య రాణి, ఇతర అధ్యాపకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

మొత్తానికి, బెండరా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల ప్రారంభం ప్రాంతీయ విద్యార్థులకు ఒక మంచి అవకాశం కాగా, దీనిని అందరూ ఉపయోగించుకోవాలని కళాశాల యాజమాన్యం కోరింది.

# కూతురి కళ్ళెదుటే తండ్రి మృతి

## ఆరేపల్లిలో మిన్నంటిన రోదనలు



**నేరడిగొండ ఏప్రిల్ 23 ప్రజాజ్యోతి :** నేరడిగొండ మండలం లోని బుగ్గారం 'బి' హాస్టల్ నుండి ఆరేపల్లికి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు ప్రాణాలు కోల్పోయారు. ఎస్సై ఇమ్రాన్ ఖాన్ తెలిపిన వివరాల ప్రకారం ఆరేపల్లి గ్రామానికి చెందిన గోడం జోతిరామ్, తన కుమార్తె శారులత తో కలిసి మోటార్ సైకిల్‌పై ప్రయాణిస్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. నేడు ఉదయం సుమారు 11:00 గంటల సమయంలో, వారు రోల్ మామడ వద్ద ఉన్న వంతెనను దాటుతుండగా బైక్ అదుపు తప్పి హైవే రెయిలింగ్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీకూతుళ్లిద్దరూ వాహనం పైనుంచి కింద పడిపోయారు. జోతిరామ్ రెయిలింగ్‌కు బలంగా తగలడంతో ఆయనకు తీవ్రమైన అంతర్గత గాయాలయ్యాయి. వెంటనే ఆయన్ని చికిత్స నిమిత్తం నిర్మల్ సిహెచ్‌సి ఆసుపత్రికి తరలించారు. అయితే, పరిస్థితి విషమించడంతో చికిత్స పొందుతూ మరణించాడు ఈ ఘటనతో ఆరేపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# సరదా ఈత ప్రమాదంగా మారొద్దు

## జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ హెచ్చరిక



**కొమురం భీం జిల్లా ప్రజా జ్యోతి క్రైమ్ రిపోర్టర్ ఏప్రిల్ 23 :** జిల్లాలో రేపటి నుంచి వేసవి సెలవులు ప్రారంభమవుతున్న నేపథ్యంలో పిల్లల భద్రతపై జిల్లా ఎస్పీ నితిక పంత్ ఐపీఎస్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. సరదా కోసం ఈతకు వెళ్లే పిల్లలు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాలు సంభవించే అవకాశముందని హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీటి లోతు తెలియక చెరువులు, బావులు, కాలువల్లోకి వెళ్లడం వల్ల జారి పడే ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని తెలిపారు. పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని, ఈత నేర్పించాలనుకుంటే తప్పనిసరిగా పెద్దల పర్యవేక్షణలోనే నేర్పించాలని సూచించారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో ముఖ్యమని ఎస్పీ పేర్కొన్నారు. గ్రామాల్లోని బావులు, చెరువుల వద్ద భద్రతా నియమాలు పాటించడం ద్వారా ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. అదేవిధంగా, పిల్లల భద్రత విషయంలో తల్లిదండ్రులు, గ్రామస్తులు సమష్టిగా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. వీలైనంత వరకు పిల్లలను ఇంట్లోనే ఉంచి చదువు, ఇతర సానుకూల కార్యకలాపాలపై దృష్టి పెట్టేలా చూడాలని సూచించారు. ఇక అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో వివిధ పనుల నిమిత్తం బయటికి వెళ్లే ప్రజలు కూడా జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతేనే బయటకు వెళ్లాలని ఎస్పీ నితిక పంత్ సూచించారు.

# ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ హామీలు నెరవేర్చాలి





## రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు

**మంచిర్యాల, 23, ఏప్రిల్ (ప్రజాజ్యోతి) :** ఆర్టీసీ కార్మికులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మికులు గత రెండు రోజులుగా చేపట్టిన ఆందోళనకు మద్దతుగా గురువారం మంచిర్యాల డిపోలో ఆయన సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు బీజేపీ కార్మికుల పక్షాన పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఆర్టీసీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను వెంటనే అమలు చేయాలని, అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన ఇతర హామీలను కూడా ప్రభుత్వం నిలబెట్టుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్‌కుమార్, కార్పొరేటర్ కస్తూరి నాగరాజు, కర్రె లచ్చన్న, మెరెడికొండ శ్రీనివాస్, అశోక్, పవన్, మణికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా జ్యోతి'తో మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి.అన్వేష్ ఇంటర్వ్యూ విశేషాలు






**ఎర్లీ బర్డ్ స్కీమ్‌కు స్పందన పెరుగుతోంది... ఆదాయంపై ఆశలు, అభివృద్ధిపై కమిషనర్ స్పష్టత**

**మంచిర్యాల,23, ఏప్రిల్ (ప్రజా జ్యోతి) :** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నుపై అమలు చేస్తున్న 'ఎర్లీ బర్డ్ స్కీమ్'కు గడువు ముగియ దానికి ఇంకా కొద్ది రోజులు మాత్రమే మిగిలి ఉంది. ఈ నేపథ్యంలో పన్ను వసూళ్లు, బడ్జెట్ లక్ష్యాలు, అభివృద్ధి పనులపై మున్సిపల్ కమిషనర్ జి. అన్వేష్‌ను 'ప్రజా జ్యోతి' ఇంటర్వ్యూ చేయగా పలు కీలక అంశాలు వెల్లడించారు.

**ప్రజాజ్యోతి :** ఆస్తి పన్ను చెల్లింపుదారులకు ఎర్లీ బర్డ్ స్కీమ్‌పై పౌరుల స్పందన ఎలా ఉంది? ఏమైనా పురోగతి ఉన్నదా? కమిషనర్ జి. అన్వేష్: రాష్ట్రవ్యాప్తంగా 163 మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు ఉన్నప్పటికీ అభివృద్ధి తదితర అంశాల్లో మంచిర్యాల టాప్ టెన్‌లో నిలిచింది. ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద ఈ నెలలోనే రూ.2 కోట్ల 30 లక్షల వసూళ్లు సాధించాం. ఈ స్కీమ్ కింద పాత బకాయిలు ఉండవు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పన్నుల వసూళ్లే జరుగుతున్నాయి.

**ప్రజా జ్యోతి :** 2026-27 బడ్జెట్ రూ.77 కోట్లుగా అంచనా వేశారు. అందులో ఆస్తి పన్నుతో పాటు ఇతర వనరుల నుంచి వసూళ్లు ఎలా ఉన్నాయి?

**కమిషనర్ జి.అన్వేష్ :** ఆస్తి పన్ను లక్ష్యం రూ.30 కోట్లుగా ఉండగా, ఇప్పటివరకు రూ.19 కోట్ల వసూళ్లు సాధించాం.

**ప్రజా జ్యోతి :** నీటి పన్నుల పరిస్థితి ఏమిటి?ఎంత మేర వసూళ్లు అయ్యాయి? కమిషనర్ జి. అన్వేష్: గత నెల వరకు సుమారు 40 శాతం నీటి పన్నులు వసూలయ్యాయి. ఈసారి ఎర్లీ బర్డ్ స్కీమ్ కింద ఆస్తిపన్ను చెల్లించే వారు నీటి పన్నులు కూడా చెల్లిస్తున్నారు. అయితే నీటి పన్నుకు ఎలాంటి రాయితీ ఉండదు.

**ప్రజా జ్యోతి :** ఆస్తి పన్ను చెల్లించేందుకు ఆన్‌లైన్ సౌకర్యం ఉంది. నీటి పన్నులకు కూడా ఆన్‌లైన్ సౌకర్యం ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది? మొత్తం కనెక్షన్లు ఎన్ని ఉన్నాయి?

**కమిషనర్ జి.అన్వేష్ :** ఇప్పటివరకు 5 వేల నీటి పన్నుదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. మొత్తం 40 వేల కనెక్షన్లు ఉన్నాయి. మిగతా వాటిని కూడా దశలవారీగా ఆన్‌లైన్‌లోకి తీసుకువచ్చి, పౌరులు నీటి పన్నులు కూడా ఆన్‌లైన్‌లో చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నాం.

**ప్రజాజ్యోతి :** పట్టణంలో కొన్ని వెంచర్ల విషయంలో ఆరోపణలు వస్తున్నాయి. మీరు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

**కమిషనర్ జి.అన్వేష్ :** లేఅవుట్లు ఎప్పుడు ఆమోదం పొందాయో పరిశీలిస్తున్నాం. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా వాటిని సమగ్రంగా పరిశీలించి తప్పకుండా తగిన చర్యలు తీసుకుంటాం.

**ప్రజా జ్యోతి :** 58వ డివిజన్‌లో మార్కెట్ ఏరియాలో చేపట్టిన సుందరీకరణ పనులపై వ్యాపారస్తులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని విమర్శలు వస్తున్నాయి. పనులు ఎప్పటికి పూర్తవుతాయి?

**కమిషనర్ జి.అన్వేష్ :** అలాంటి సమస్యలు లేవు. వ్యాపారస్తులు, ప్రజలు కూడా అభివృద్ధి పనులకు సహకరిస్తున్నారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేదు. పూర్తి స్థాయిలో పనులు ముగియ దానికి సుమారు 5 నుంచి 6 నెలలు పట్టవచ్చు. నగరాన్ని ఆధునికంగా తీర్చిదిద్దే క్రమంలో విద్యుత్, డ్రైనేజీ, నీటి సరఫరా వ్యవస్థలను అండర్‌గ్రౌండ్‌లో ఏర్పాటు చేస్తున్నాం. మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పడిన తర్వాత ఎమ్మెల్యే, మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల సహకారంతో మంచిర్యాల కార్పొరేషన్‌ను మరింత అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నామని కమిషనర్ జి. అన్వేష్ తెలిపారు.

# డాక్టర్ సెల్ జిల్లా చైర్మన్‌గా డా. చందన సుధాకర్ నియామకం

**మంచిర్యాల, 23, ఏప్రిల్ (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** డాక్టర్ సెల్, మెడికల్ అండ్ హెల్త్ విభాగం, డీసీసీ మంచిర్యాల జిల్లా చైర్మన్‌గా డా. ఆర్. చందన సుధాకర్ నియమితులయ్యారు. రాష్ట్ర డాక్టర్ సెల్ చైర్మన్ డా. ఎం. రాజీవ్, వైస్ చైర్మన్ డా. అభిషేక్ చేతుల మీదుగా ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా డా. చందన సుధాకర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నరసింహ, గౌరవ టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, టీపీసీసీ డాక్టర్ సెల్ రాష్ట్ర చైర్మన్ డా. ఎం. రాజీవ్, మంత్రి చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమసాగర్ రావు, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, మంచిర్యాల డీసీసీ అధ్యక్షుడు పిన్నింటి రఘునాథ్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ బాధ్యతను గౌరవంగా భావిస్తూ జిల్లాలో ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి, అందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా పేదలకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని చెప్పారు. అలాగే ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజల ఆరోగ్య స్థితిని మెరుగుపరచడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానన్నారు. ప్రజా సేవలో ముందుండి పనిచేస్తానని ఆమె తెలిపారు.



# ఉదారత చాటుకున్న ఉపాధ్యాయురాలు




**ఆదిలాబాద్ టౌన్, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బేలలో విధులు నిర్వహిస్తున్న సాంఘిక ఉపాధ్యాయురాలు స్వరూప ఈ నెల 30వ తేదీన ఉద్యోగ విరమణ పొందనున్న సందర్భంగా, పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల పట్ల తమ మమకారాన్ని చాటుకున్నారు. విద్యార్థులకు భోజనం చేసే ప్లేట్లు పాతవి అయినందున, ఆమె స్వంత ఖర్చుతో రూ.20,000 విలువైన మధ్యాహ్న భోజన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు 500 ప్లేట్లను విరాళంగా అందజేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం చేసిన ఈ సేవ అందరికీ ఆదర్శప్రాయంగా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొమ్ము కృష్ణ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సంజయ్, ఏలియా, ఆరె భాస్కర్, స్వామి నితిన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రూపపూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశానికి హాజరైన అధికారులు





**ఆదిలాబాద్ ఏప్రిల్ 23, (ప్రజాజ్యోతి) :** అదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలం రూపాపూర్ గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశానికి డిఈ భగవంత్ రావు, ఎంపీడీవో శ్రీనివాస్, ఎం పి ఓ గంగాధర్, సర్పంచ్ మడావి కేశవ్ రావు, సెక్రటరీ వన్కదే సచిన్, ఎ.ఇ గణేష్ , రాకేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ మడావి కేశవ్ రావు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కాంగ్రెస్ హయాంలో ఇల్లు లేని ప్రతి నిరుపేదలకు, ఇల్లు ఇచ్చిన ఘనత ఇందిరమ్మ ప్రభుత్వం దేనని, ఇల్లు ప్రతి పేదవారి కల అని అన్నారు. 10 ఏళ్ల టిఆర్ఎస్ పాలనలో ఒక్క ఇల్లు కూడా రాలేదని, కాంగ్రెస్ హయాంలో ప్రతి నిరుపేదలకు విడుతలవారీగా ఇల్లు వస్తాయని, అభివృద్ధి జరగాలంటే కాంగ్రెస్ హయాంలోనే సాధ్యమవుతుందని, నిరుపేదలకు ఇండ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు

## ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్





**బజారత్నూర్ ఏప్రిల్ 23,(ప్రజా జ్యోతి) :** ఆదిలాబాద్ జిల్లా బజార్ హత్నూర్ పట్టణ కేంద్రంలో నిర్మితమైన 7 ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమంలో, లబ్ధిదారుల కోరిక మేరకు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ఆడే గజేందర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు ఎత్తరి పోసాని, పిట్ల లక్ష్మి, శివరాత్రి లక్ష్మి, షెల్కల్ మొగలి, బాచిన్ వార్ విజయ, కుప్స్ భోజబాయ్ తమ కొత్త ఇళ్లలో గృహ ప్రవేశం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆడే గజేందర్ మాట్లాడుతూ, "ఇందిరమ్మ ఇళ్లు పథకం పేదల సొంతింటి కలను నెరవేర్చే గొప్ప కార్యక్రమం. ప్రతి కుటుంబం ఆనందంగా జీవించేలా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ప్రజల సంక్షేమం కోసం ఇలాంటి పథకాలు అమలు చేస్తుంది" అన్నారు. ప్రతి ఇంటికి అభివృద్ధి చేరే వరకు నిరంతరం కృషి చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**జన్నారం, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) :** జన్నారం మండలంలోని దేవుని గూడ రైతు వేదిక వద్ద ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని గురువారం గ్రామ సర్పంచ్ రామ్ టెంకి రాజేష్, జన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గశీ లక్ష్మీనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధాన్యాన్ని దళారులకు అమ్మకుండా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ముజాఫర్ అలీ ఖాన్, జిల్లా ఉపాధ్యక్షులు గుర్రం మోహన్ రెడ్డి, ఐకెపి సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# “రోబోటిక్ సర్జరీతో నొప్పులకు చెక్ – సికింద్రాబాద్ యశోద హాస్పిటల్స్ లో ఆధునాతన ఆర్థోపెడిక్ సేవలు”

– మహబూబ్ నగర్ ధన్వంతరి హాస్పటల్ లో అందుబాటులో సేవలు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి బ్యూరో ):
కీళ్ల నొప్పులు, క్రీడా గాయాలతో బాధపడుతున్న వారికి ఆధునిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జరీలు (మోకాలు, తుంటి) మరియు స్పోర్ట్స్ మెడిసిన్‌లో విశేష అనుభవం కలిగిన డాక్టర్ జయకృష్ణ రెడ్డి, అత్యాధునిక సాంకేతికతతో ఖచ్చితమైన, రోగి అవసరా




లకు అనుగుణమైన ఆర్థోపెడిక్ చికిత్సలను అందిస్తున్నారు. రోబోటిక్ సహాయంతో చేసే మోకాలు, తుంటి మార్పిడి శస్త్రచికిత్సలు రోగులకు మెరుగైన కచ్చితత్వం, సరైన అమరిక, వేగవంతమైన కోలుకునే అవకాశం మరియు దీర్ఘకాలిక ఫలితాలను అందిస్తున్నాయి. అలాగే ఆర్థ్రోస్కోపిక్ (కీహోల్) సర్జరీలు, క్రీడా గాయాల నిర్వహణ (లిగమెంట్, మెనిస్కస్, భుజం గాయాలు), సంక్లిష్ట ట్రామా మరియు జాయింట్ ప్రిజర్వేషన్ విధానాల్లో ఆయన నైపుణ్యం ప్రత్యేకంగా నిలుస్తోంది.
మహబూబ్‌నగర్ మరియు పరిసర ప్రాంతాల ప్రజలకు ఈ సేవలను చేరువ చేసేందుకు ప్రతి నెల 4వ గురువారం మహబూబ్‌నగర్ టౌన్‌లో ఔట్‌పేషెంట్ కన్సల్టేషన్లు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కీళ్ల సమస్యలతో బాధపడుతున్నవారు ముందస్తు అపాయింట్‌మెంట్ ద్వారా వ్యక్తిగతీకరించిన చికిత్సా ప్రణాళికలను పొందవచ్చని సూచించారు. అపాయింట్‌మెంట్లు, మరిన్ని వివరాల కోసం 9247579400 నంబర్‌ను సంప్రదించాలని ధన్వంతరి హాస్పిటల్ నిర్వాహకులు కోరారు.

## ఆర్టీసీ సమ్మెకు కార్మికులు దూరంగా ఉండాలి

చర్చల ద్వారానే పరిష్కారం

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి బ్యూరో )
మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వద్ద ఆర్టీసీ సమ్మెపై టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి మాట్లాడుతూ, ఆర్టీసీ కార్మికులను నష్టపరచే విధంగా ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆరోపించారు. ఇటువంటి కుట్రలను కార్మికులు నమ్మవద్దని, ఆర్టీసీ సంస్థను కాపాడింది కాంగ్రెస్ పార్టీనే అని ఆయన స్పష్టం చేశారు. గతంలో ఆర్టీసీని ప్రైవేట్ పరంగా మార్చాలని కేసీఆర్ అండ్ కో యత్నించిందని, ఇప్పుడు కూడా కొందరు అదే దిశగా సమ్మెలను ప్రోత్సహిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ కోసం కొందరు చేసే సమ్మెలకు కార్మికులు సహకరించవద్దని ఆయన పిలుపునిచ్చారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ కార్మికులకు అండగా నిలుస్తున్నారని పేర్కొన్న ఆయన, కార్మికులు కోరిన 32 అంశాలలో 29



అంశాలకు ప్రభుత్వం ఇప్పటికే సానుకూలంగా స్పందించి ఆమోదం తెలిపిందని తెలిపారు. గత పాలకులు ఆర్టీసీని నిర్వీర్యం చేసి కార్మికులను ఇబ్బందులకు గురిచేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం సంస్థను బలోపేతం చేస్తోందని చెప్పారు. మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం వంటి సంక్షేమ చర్యలను చూసి ఓర్వలేక కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. కార్మిక సోదరులు సమ్మెకు దూరంగా ఉండి, చర్చల ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవాలని ఆయన కోరారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్, జిల్లా మత్స్య శాఖ సంఘం అధ్యక్షులు గోనెల శ్రీనివాస్, కార్పొరేటర్ ఉమర్ కొత్వాల్, నాయకులు చందు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## సమ్మె నేపథ్యంలో బస్టాండ్ వద్ద కట్టుదిట్టమైన భద్రత

అవాంఛనీయ ఘటనలకు తావులేదు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :
టీజీఎస్ఆర్టీసీ జేఏసీ సమ్మె నేపథ్యంలో మహబూబ్‌నగర్ పట్టణంలోని నూతన ఆర్టీసీ బస్టాండ్ వద్ద పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. జిల్లా ఎస్పీ దరా వత్ జానకి బస్టాండ్‌ను సందర్శించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలిస్తూ, భద్రతా చర్యలపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులతో మాట్లాడిన ఎస్పీ, సమ్మె



పరిస్థితుల్లో కూడా ప్రజా రవాణా సేవలు నిరంతరంగా కొనసాగేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ప్రైవేట్ డ్రైవర్లు, సిబ్బంది ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని, వారికి పూర్తి స్థాయి పోలీసు రక్షణ అందిస్తామని స్పష్టం చేశారు. ప్రజా రవాణా వ్యవస్థకు అంతరాయం కలిగించే చర్యలు, బస్సులకు నష్టం కలిగించడం, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసం వంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్శనలో అదనపు ఎస్పీ ఎన్. బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సంతోష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మొతిరాం, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.
జిల్లా పోలీస్ శాఖ ప్రజలకు విజ్ఞప్తి చేస్తూ, శాంతి భద్రతలను కాపాడేందుకు అందరూ సహకరించాలని, అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరింది.

# వేసవి సెలవుల్లో పిల్లల పట్ల తల్లిదండ్రులు జాగ్రత్తగా ఉండాలి

సర్పంచ్ రాజేందర్ గౌడ్, ఎంఈఓ అమీరుద్దీన్

మఖ్తల్ నియోజకవర్గ ప్రతినిధి, ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి):
వేసవి సెలవుల్లో పిల్లలను ఆటపాటలు, కథల పుస్తకాలు చదవడం లేదా వేసవి శిక్షణ శిబిరాల వైపు మళ్లించడం ద్వారా వారి



సమయాన్ని సురక్షితంగా మరియు ఉపయోగకరంగా మార్చుకోవచ్చని మండల విద్యాశాఖ అధికారి అమీరుద్దీన్ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా మఖ్తల్ మండలం మంథన్ గోడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి సెలవులు ప్రారంభం సందర్భంగా విద్యాశాఖ ఆదేశాల మేరకు విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులతో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాశాఖ అధికారి అమీరుద్దీన్, గ్రామ సర్పంచ్ రాజేందర్ గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజేందర్ గౌడ్ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునేందుకు విద్యార్థులు ప్రతిరోజూ పునశ్చరణ చేయడం, పుస్తక పఠనం అలవాటు చేసుకోవడం, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అవసరమని, చిన్నారి విద్యార్థులు సెలవుల్లో సమయాన్ని వృధా చేయకుండా దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన ఎందరో మహనీయుల చరిత్ర పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువ ఉండడం వల్ల చిన్నారులు ఎక్కువ శాతం ఇంట్లో ఉండేందుకే ప్రయత్నం చేయాలని, అరుగుమీది ఆటలు ఆడేందుకు ఎక్కువ సమయాన్ని కేటాయిస్తూ తల్లిదండ్రులతో గడపాలని ఆయన కోరారు. ఉపాధ్యాయులు చెప్పిన ప్రతి ఒక్కటి పాటించి ఉన్నత చదువులు చదివేందుకు ఒక లక్ష్యాన్ని ఎంచుకోవాలని అదే దీక్షగా చదివి మన గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని



విద్యార్థులను కోరారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి అమీరుద్దీన్ మాట్లాడుతూ పరీక్షలు ముగిసి వేసవి సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో, విద్యార్థులు మరియు చిన్న పిల్లల భద్రతపై తల్లిదండ్రులు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆయన విజ్ఞప్తి చేశారు. తగిన ఆహారం, నీరు తీసుకోవడం,అధిక వేడి సమయంలో జాగ్రత్తలు పాటించడం ముఖ్యమని ఎంఈవో అన్నారు. పిల్లల చదువు, ఆరోగ్యం, క్రమశిక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. సెలవుల్లో పిల్లలు సరదాగా ఈత కొట్టడానికి లేదా స్నానాల కోసం సమీపంలోని చెరువులు, బావులు, కాలువలు మరియు నీటి కుంటల వద్దకు వెళ్లే అవకాశం ఉంటుంది. నీటి లోతు తెలియక, ప్రవాహ వేగానికి లోనై ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయే ముప్పు ఉంది. కాబట్టి తల్లిదండ్రులు పిల్లలను ఒంటరిగా అటువైపు వెళ్లనివ్వకూడదు. పిల్లలు ఇంటి వద్ద ఉన్న సమయంలో వారు ఎక్కడికి వెళ్తున్నారు, ఎవరితో ఉంటున్నారు అనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. ముఖ్యంగా మధ్యాహ్నం వేళల్లో పిల్లలు బయటకు వెళ్లకుండా ఇళ్లలోనే ఉండేలా జాగ్రత్త పడాలి ఆయన పేర్కొన్నారు. సెలవుల్లో పిల్లలను ఆటపాటలు, కథల పుస్తకాలు చదవడం లేదా వేసవి శిక్షణ శిబిరాల వైపు మళ్లించడం ద్వారా వారి సమయాన్ని సురక్షితంగా మరియు ఉపయోగకరంగా మార్చవచ్చు అని అన్నారు.
అనంతరం పాఠశాల అటెండెన్స్ శాతంలో మొదటి రెండో స్థానంలో ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడంతో పాటు విద్యార్థినీ విద్యార్థులకు ప్రోగ్రెస్ కార్డులను ఎంఈఓ అమిరుద్దీన్, గ్రామ సర్పంచ్ రాజేందర్ గౌడ్ అందజేశారు.
ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృష్ణా ముదిరాజ్, విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థిని విద్యార్థులు ప్రతి సంఖ్యలో పాల్గొన్నారు.

## కఠోర దీక్షకు ప్రతిరూపం భగీరథుడు: ఎంపీ మల్లు రవి

– పరోపకారం, దీక్షకు ప్రతిరూపం భగీరథుడు: ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి):
కఠోరమైన దీక్షతో దివి నుంచి భువికి గంగను రప్పించిన మహనీయుడు భగీరథ మహర్షి అని నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లు రవి కొనియాడారు. గురువారం





భగీరథ మహర్షి జయంతిని పురస్కరించుకొని స్థానిక భగీరథ చౌరస్తాలో నిర్వహించిన వేడుకలకు ఎంపీ మల్లు రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయనతో పాటు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా భగీరథ మహర్షి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐడీఓసీ ఆవరణలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి కార్యక్రమంలోనూ పాల్గొని మహర్షికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ కష్టపడి పట్టుదలతో సాధించిన విజయాలను ‘భగీరథ ప్రయత్నం’గా అభివర్ణిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ భగీరథ మహర్షి పరోపకారం, దీక్ష, సహనానికి ప్రతిరూపమని అన్నారు. భగీరథ జయంతి సందర్భంగా సగరులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సగర సంఘం అధ్యక్షుడు మోడల తిరుపతయ్య సాగర్ మాట్లాడుతూ కఠోర శ్రమతో లక్ష్య సాధన చేసిన వారిని భగీరథునితో పోలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రుడు సాగర్, జిల్లా కోశాధికారి గుంటి సత్యం సాగర్, కౌన్సిలర్ మురళి సాగర్, పల్లె సత్యనారాయణ సాగర్, పెద్ద నాగులు సాగర్, విష్ణు సాగర్, ఆర్కే రవి సాగర్, ప్రజా సంఘాల నాయకులు, సగర సంఘం ప్రతినిధులు, కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి: ఎంపీ మల్లు రవి

ప్రతి గ్రామానికి పంచాయతీ భవనం లక్ష్యం: ఎంపీ డీకే అరుణ

అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలి: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి):
ప్రభుత్వ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత అధికారులపై ఉందని నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు




రవి పేర్కొన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి మరియు సమన్వయ పర్యవేక్షణ కమిటీ (దిశా) సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి మహబూబ్నగర్ ఎంపీ డీకే అరుణ, వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి హాజరయ్యారు. జిల్లాలోని విద్య, వైద్య, రహదారులు, సంక్షేమం, పంచాయతీ రాజ్ తదితర శాఖల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎంపీ ఆదేశించారు. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాలని, పశుసంవర్ధక శాఖ జీవాలకు సకాలంలో టీకాలు అందించాలని సూచించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో పెండింగ్ పనులను త్వరగా ప్రారంభించాలని, ఆర్థికంగా వెనుకబడిన లబ్ధిదారులకు రుణ సదుపాయాలు కల్పించాలని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లలో స్కాలర్‌షిప్‌లు పెండింగ్ లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్ పరిధిలో మంజూరైన సీసీ రోడ్లు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని, ఉపాధి హామీ కూలీలకు సకాలంలో చెల్లింపులు చేయాలని సూచించారు. బ్యాంకులు ఉపాధి పథకాల కింద రుణాలను త్వరగా మంజూరు చేసి యువతకు సహకరించాలని కోరారు. ఎంపీ డీకే అరుణ మాట్లాడుతూ కేంద్ర పథకాలను గ్రామస్థాయికి చేర్చాలని, ప్రతి గ్రామానికి పంచాయతీ భవనం ఏర్పాటు చేయాలని సూచించారు. వ్యవసాయంలో మట్టి పరీక్షల ఆధారంగా పంటల సాగు చేయాలని, పీఎం కిసాన్ పథక లబ్ధి అందరికీ చేరేలా చూడాలని అన్నారు. ఎమ్మెల్యే మేఘారెడ్డి మాట్లాడుతూ పెండింగ్ రోడ్ల పనులు, ఆసుపత్రి నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## భగీరథుడి తపస్సు స్ఫూర్తి

**యువత సమాజ మార్పుకు ముందుకు రావాలి**

**భగీరథుడి జయంతి వేడుకల్లో కలెక్టర్ పిలుపు**

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి బ్యూరో)
మహర్షి భగీరథ జయంతి సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఘనంగా నివాళులు అర్పించారు. వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం పద్మావతి కాలనీ గ్రీన్ బెల్ట్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కలిసి భగీరథ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భగీరథ మహర్షి గొప్ప తపస్వి అని పేర్కొన్నారు. ఆయన కఠోర తపస్సుకు ప్రసన్నమైన శివుడు



గంగాదేవిని భూమికి పంపించాడని, అందుకే గంగానదిని ‘భగీరథి’ అని పిలుస్తారని వివరించారు. గంగాను భూమికి తీసుకువచ్చి మానవాళి పాప విమోచనకు కృషి చేసిన ఆయన తపస్సు భారతీయ సంస్కృతిలో విశిష్ట స్థానాన్ని సంపాదించిందన్నారు. భగీరథ మహర్షి చూపిన దీక్ష, సంకల్పం, నిస్వార్థ సేవా భావం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని కలెక్టర్ పేర్కొన్నారు. సమాజంలో ఉన్న అసమానతలు, అన్యాయాలను తొలగించేందుకు ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఉందని, ముఖ్యంగా యువత భగీరథుడి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జయంతి సందర్భంగా శ్రద్ధాంజలి ఘటించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ గుమ్మాల మమత, బి.సి సంక్షేమ శాఖ అధికారి ఇందిరా, స్థానిక ప్రజాప్రతినిధులు, బి.సి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ మరమ్మతుల సమయంలో ప్రమాదం - లైన్మెన్ శ్రవణ్ మృతి

ఐజ (ప్రజా జ్యోతి) ఫిబ్రవరి 23:
జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండలం చిన్న తాండ్రపాడు గ్రామంలో విద్యుత్ మరమ్మతులు నిర్వహిస్తున్న సమయంలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. విధి నిర్వహణలో భాగంగా పనులు చేస్తుండగా, ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి లైన్మెన్ శ్రవణ్ మృతి చెందారు.స్థానికంగా అందిన సమాచారం ప్రకారం, శ్రవణ్ గతంలో కూడా అయిజలో లైన్మెన్‌గా సేవలు అందించారు. విధి నిర్వహణలో నిబద్ధతతో పనిచేస్తూ ఇలాంటి దుర్ఘటనకు గురికావడం అందరినీ తీవ్ర విషాదంలో ముంచేసింది.



ఈ ఘటన పట్ల గ్రామస్థులు, సహచర సిబ్బంది, ప్రజా ప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. మృతుడి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం మరియు సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు కుటుంబానికి తగిన ఆర్థిక సాయం, న్యాయం చేయాలని స్థానికులు కోరుతున్నారు.అలాగే, భవిష్యత్తులో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా విద్యుత్ మరమ్మతుల సమయంలో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో ఇంపాక్ట్ కార్యక్రమం.. అడ్మిషన్ బ్రోచర్ ఆవిష్కరణ

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి బ్యూరో)
తెలంగాణ ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ వారోత్సవాల్లో మూడవ రోజు గురువారం తెలంగాణ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాల (మహిళ)లో ఇంపాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థినుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి మహబూబ్‌నగర్ సమీపంలోని పోచమ్మగడ్డ తండాకు చెందిన గ్రామ సర్పంచ్ శ్రీకాంత్, ఉపసర్పంచ్ రాజేష్, పంచాయతీ బోర్డు కార్యదర్శి ఆనంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కూడా



పాల్గొన్నారు. ఈ సందర్భంగా 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన అడ్మిషన్ బ్రోచర్, పోస్టర్‌ను ఆవిష్కరించారు. కళాశాల ప్రగతి, విద్యార్థినులు సాధించిన విజయాలు, ఫలితాలను తల్లిదండ్రులకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి ఆనంద్ మాట్లాడుతూ డిగ్రీ విద్య ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థినులు ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ముఖ్య అతిథులను సన్మానించారు.

## కలెక్టర్‌ను కలిసిన జిల్లా రెడ్ క్రాస్ పాలకవర్గం



**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23, (ప్రజాజ్యోతి) :** హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు చాహత్ బాజపాయిని గురువారం కలెక్టర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ మరియు పాలకవర్గం కలిసి రెడ్ క్రాస్ కార్యక్రమాల గురించి వివరించి అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ ప్రారంభం, డైనింగ్ హాల్ భూమి పూజ, రెడ్ క్రాస్ డే కార్యక్రమాలకు పాల్గొనవలసిందిగా ఆహ్వానించినారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డా.పి.విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఇ.వి.శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ళ రమణ రెడ్డి పాల్గొన్నారు.

## మండల పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయ,తల్లిదండ్రుల సమావేశం




**పర్వతగిరి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) :** మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ,తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ. వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ వేసవి కాలంలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రతపై తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు విద్యార్థుల ప్రగతి పత్రములను తల్లిదండ్రులకు అందజేశారు. తల్లిదండ్రులు విద్యార్థుల చదువు, ప్రవర్తనపై ఉన్న సందేహాలను ఉపాధ్యాయులతో చర్చించి నివృత్తి చేసుకున్నారు. సమావేశానికి తల్లిదండ్రులు అధిక సంఖ్యలో హాజరై పాఠశాల అభివృద్ధిపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిపిసి చైర్‌పర్సన్ నీరటి జ్యోతి, ఉపాధ్యాయులు లలితాదేవి, సుభాషిని, రామస్వామి, నవీన్ కుమార్, ప్రసాద్, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

## భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

– సాదాబైనామా పరిష్కారంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి

– జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) :** భూ భారతి పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, సాదాబైనామా పరిష్కారంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని, జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులకు సూచించారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో భూ భారతి, సాదాబైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల వారీగా పెండింగ్ దరఖాస్తుల ప్రక్రియపై క్షుణ్ణంగా సమీక్షించి, పలు సూచనలు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కలెక్టర్ సంబంధిత అధికారులకు కీలక సూచనలు జారీ చేశారు. సాదాబైనామా కేసులను ప్రత్యేక దృష్టితో పరిశీలించి, ప్రతి దరఖాస్తును సమగ్రంగా ధృవీకరించాలన్నారు. భూ సంబంధిత పత్రాలు, పాత రికార్డులు, ఆదాయ పత్రాలు, తదితర వివరాలను ఖచ్చితంగా పరిశీలించాలన్నారు. దరఖాస్తు దారులకు పారదర్శకంగా సమాచారం అందించి, ఎటువంటి పొరపాట్లు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీల్డ్ స్థాయిలో తహసీల్దార్లు స్వయంగా పర్యవేక్షణలు నిర్వహించి, నివేదికలు సమర్పించాలన్నారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు సమస్యాత్మక కేసులను జిల్లా స్థాయికి పంపించి, తక్షణ పరిష్కారానికి చర్యలు చేపట్టాలన్నారు. సాదాబైనామా ద్వారా భూములు కొనుగోలు చేసిన రైతులకు న్యాయం చేయడం, వారి హక్కులను రక్షించడం, భూ రికార్డులను సక్రమంగా నమోదు చేయడం ముఖ్య ఉద్దేశ్యం అని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## రెడ్ క్రాస్ సొసైటీ అద్వర్యంలో చలివేంద్రం







**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23, (ప్రజా జ్యోతి) :** హనుమకొండ జిల్లా కలెక్టర్ మరియు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షురాలు చాహత్ బాజపాయి ఆదేశాలమేరకు హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ మండుటెండల్లో ప్రజలకు తాగునీరు అందించాలనే ఉదాత్త లక్ష్యంతో హనుమకొండ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 23న (గురువారం) రెడ్ క్రాస్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్ మరియు రెడ్ క్రాస్ సొసైటీ ఉపాధ్యక్షులు యన్. రవి ప్రారంభించారు. అదనపు కలెక్టర్ యన్. రవి మాట్లాడుతూ, "మండుటెండల్లో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చేపట్టిన ఈ చలివేంద్రం సేవా దృక్పథానికి ప్రతిరూపం. నా పరిమితుల్లో నేనున్న సహాయం రెడ్ క్రాస్ కు అందించేందుకు సిద్ధంగా ఉన్నాను" అని అన్నారు. తలసీమియా బాధితుల కోసం రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను ప్రశంసిస్తూ, పాలకవర్గానికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్ క్రాస్ పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ, "పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలు, ఎండలో కష్టపడే కూలీలు, వ్యాపారాలు, పనుల నిమిత్తం బయటకు వచ్చే సందర్భంలో తాగునీటి కొరత ఎదుర్కొనకుండా ఉండేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశాం" అని తెలిపారు. తర్వాత అదనపు కలెక్టర్ యన్. రవిని రెడ్ క్రాస్ సభ్యులు శాలువాతో సత్కరించి షీల్డ్ అందచేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ డా. పి. విజయ్ చందర్ రెడ్డి, కోశాధికారి బొమ్మినేని పాపిరెడ్డి, రాష్ట్ర మేనేజింగ్ కమిటీ సభ్యులు ఈ. వి. శ్రీనివాస్ రావు, జిల్లా పాలకవర్గ సభ్యులు పుల్లూరి వేణుగోపాల్, పొట్లపల్లి శ్రీనివాస్ రావు, బిళ్ళ రమణ రెడ్డి మరియు రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్టీసీ కార్మికుల సమ్మెకు సంఘీభావం తెలిపిన చల్లా





### కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు

**పరకాల, ఏప్రిల్ 23, (ప్రజాజ్యోతి) :** ఆర్టీసీ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సంఘీభావం తెలిపారు. గురువారం పరకాల ఆర్టీసీ డిపోవద్ద సమ్మె నిర్వహిస్తున్న కార్మికులను పరామ ర్శించి, వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ, కార్మికుల న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకుండా కాంగ్రెస్ ప్రభు త్వం నిర్లక్ష్య వైఖరి అవలంబిస్తోందని తీవ్రంగా విమర్శించారు. కార్మికుల కష్టాలను అర్థం చేసుకోకుండా ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, వెంటనే చర్చలు జరిపి సమస్యలకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికులు రాష్ట్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని, అలాంటి కార్మికు లను ఇబ్బందులకు గురిచేయడం దురదృష్టకరమని పేర్కొన్నారు. కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ ఎంతకాలం కార్మికులను మభ్యపెడుతారని ప్రశ్నించారు. రాష్ట్ర సాధనలో అగ్రభాగాన ఉన్న ఆర్టీసీ కార్మికులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేస్తున్నదని విమర్శించారు. ఆర్టీసీని ప్రైవేటుపరం చేయడా నికి ఈ ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని అన్నారు. మండే ఎండల్లో తమ డిమాండ్ల నెరవేర్చాలని శాంతియుతంగా నిరసన తెలిపే కార్మికుల స్వేచ్ఛ హక్కులను కూడా ఈ ప్రభుత్వం కాలరాస్తున్నదని ధ్వజమెత్తారు. నీడ కోసం టెంట్లు కూడా వేసుకొనివ్వకుండా పోలీసులు ఆపడం దారుణమన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి కార్మికుల న్యాయమైన డిమాండ్లను,సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేసే పరిస్థితులు తలెత్తుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కార్మికులు పాల్గొన్నారు.

## గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి





### – జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

**హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23, (ప్రజా జ్యోతి) :** గర్భిణీలు, బాలింతలు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ పౌష్టికాహారం తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి సూచించారు. గురువారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న సంక్షేమ పథకాల వారోత్సవాల సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా గర్భిణీలకు సామూహిక సీమంతం కార్యక్రమం, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం, గ్రాడ్యుయేషన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గర్భధారణ ప్రారంభం నుండి పిల్లలకు రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లి ఆరోగ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ కాలంలో గర్భిణీలు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత వంటి సమస్యలను నివారించవచ్చని తెలిపారు. సరైన ఆహారం తీసుకోకపోతే అనారోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. మానసిక ఒత్తిడికి లోనుకాకుండా ఆరోగ్యంపై దృష్టి సారించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాలకు చెందిన చిన్నారులకు చిన్న వయస్సులోనే గ్రాడ్యుయేషన్ డే వేడుకలు నిర్వహించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించగా, గర్భిణీలకు సీమంతం నిర్వహించి అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సంక్షేమ అధికారి విశ్వజ మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న వివిధ సేవల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జీసీడీఓ సునీత, పోషణ్ అభియాన్ జిల్లా కోఆర్డినేటర్ సుమలత, ఆయుష్ జిల్లా ఇంచార్జ్ డాక్టర్ మహేందర్ కుమార్, డీపీఎం డాక్టర్ భాను ప్రకాష్, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రుబీనా, డెమో అశోక్ రెడ్డి, మెప్మా డీఎంసీ రజిత రాణి, ఎఫ్ఆర్ఓ రవికృష్ణ, అంగన్వాడీ సూపర్వైజర్లు, టీచర్లు, గర్భిణీలు, చిన్నారులు మరియు వారి తల్లులు పాల్గొన్నారు.

## హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదు

– ఉద్యమ కారుల ఆత్మకూర్ గ్రామ కమిటీ ఎన్నిక



**ఆత్మకూరు, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) :** కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు పోరాటం ఆగదని జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం తెలిపారు. గురువారం ఆత్మకూరు తెలంగాణ ఉద్యమ కారుల నూతన గ్రామ కమిటీ ఎన్నికున్నారు. ఆత్మకూరు మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఫోరం గ్రామ కమిటీ ఎన్నిక ఎండి బాబు మియా అధ్యక్షతన తెలంగాణ ఉద్యమకారుల ఫోరం సమావేశం జరిగింది. ఈ సమావేశం లో పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉద్యమకారులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఉద్యమకారులను ఏకం చేసి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం పోరాటం చేస్తామని అన్నారు. అనంతరం ఆత్మకూర్ గ్రామ నూతన కమిటీలను ఎన్నుకున్నామని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఆత్మకూరు గ్రామ కమిటీ అధ్యక్షులుగా భాష బోయిన సాగర్, ఉపాధ్యక్షులుగా పులిచేరు పైడి, పెరుమండ్ల స్వామి, మోతే రాజేందర్, గౌని రాజు గౌడ్, ప్రధాన కార్యదర్శిగా మంద రవి, కార్యదర్శులుగా తనుగుల సాంబయ్య, పెరుమాండ్ల ఇమ్మానియేల్, నాగెల్లి స్వామి, సంయుక్త కార్యదర్శిగా పెరుమాండ్ల అనిల్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా జాగిలపు లక్ష్మీనారాయణ, నత్తి దేవేందర్, పెరుమండ్ల కొర్నెల్ ను ఎన్నుకున్నట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇర్సడ్ల సదానందం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు మండల అధ్యక్షులు ఎండి బాబుమియా (చిరు) జిల్లా నాయకులు వంగేటి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు

– నిరంతర కృషి పట్టుదలకు ప్రతీక : జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



**జనగామ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) :** నిరంతర కృషి పట్టుదలకు ప్రతీక భగీరథ మహర్షి అని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. గురువారం భగీరథ మహర్షి జయంతి సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ రెవెన్యూ బెన్షాలోమ్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సగర వంశీయులైన భగీరథ మహర్షి గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి అని కొనియాడారు. భగీరథుడు పట్టుదలకు ప్రతీక అని, ఏదైనా సాధించాలనే సంకల్పానికి, నిరంతర కృషికి "భగీరథ ప్రయత్నం" ఒక గొప్ప స్ఫూర్తి అని తెలిపారు. భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. అనంతరం అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఎన్. ఎల్. నరసింహ రావు, ఏబీసీడీఓ రవీందర్, కుల సంఘాల నాయకులు, పెద్దలు, ఐడిఓసి సిబ్బంది, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది, పెంబర్తి స్వర్ణకారుల సంఘం సోమేశ్వర చారి, దిశ కమిటీ సభ్యులు బక్క శ్రీనివాస్, ఆర్డీఓలు గోపీరాం, వెంకన్న, అన్ని మండలాల తహసీల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.

## స్వీయ గణనకు శ్రీకారం.. ఏప్రిల్ 26 నుంచి ఆన్‌లైన్ నమోదు ప్రారంభం..




- ఆన్‌లైన్‌లోనే కుటుంబ వివరాల నమోదు
- మే 10 వరకు స్వీయ గణనకు అవకాశం
- ప్రతి కుటుంబం తప్పనిసరిగా నమోదు చేయాలి
- ఎస్ఈ ఐడి తో భవిష్యత్తులో వివరాల సవరణ సులభం
- డిజిటల్ మ్యాప్‌లో గృహ గుర్తింపు తప్పనిసరి
- స్వీయ గణనతో ఖచ్చితత్వం, వేగం పెరుగుతుంది
- ఆన్‌లైన్ నమోదు చేయలేని వారికి గణనకర్తల సహాయం
- ప్రజలు అవకాశాన్ని వినియోగించుకోవాలి
- సెన్సస్ చార్జ్ అధికారి, పర్వతగిరి మండల తహసీల్దార్ వెంకటస్వామి విజ్ఞప్తి

**పర్వతగిరి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) :** భారత జనాభా గణన 2027లో భాగంగా ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు ప్రభుత్వం స్వీయ-గణన (సెల్ఫ్ ఏనుమెరాషన్ - ఎస్ ఈ) విధానాన్ని అమలులోకి తీసుకొచ్చిందని సెన్సస్ చార్జ్ అధికారి ఒ పర్వతగిరి మండల తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. ఈ విధానం ద్వారా ప్రతి కుటుంబం తమ ఇంటి, కుటుంబ సభ్యుల వివరాలను స్వయంగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునే వీలుందని చెప్పారు. ఈ స్వీయ-గణన కార్యక్రమం ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు నిర్వహించబడుతుందని, ప్రతి రోజు ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ప్రజలు ఈ సేవను వినియోగించుకోవచ్చని వెల్లడించారు. ఇందుకోసం ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన అధికారిక వెబ్‌సైట్ ట్ర్జూం://ఒవ.ఎవఅంబం.స్రశీజ.అఆ? అందుబాటులో ఉందన్నారు. ప్రతి కుటుంబానికి 15 రోజుల గడువు మాత్రమే ఉండటంతో ఈ కాలంలోనే వివరాలను నమోదు చేయడం అత్యంత ముఖ్యమని సూచించారు. నమోదు పూర్తయ్యాక ప్రతి కుటుంబానికి ప్రత్యేకమైన ఎస్ఈ ఐడి కేటాయించబడుతుందని, ఈ ఐడీ ద్వారా భవిష్యత్తులో వివరాలను పరిశీలించడం, అవసరమైతే సవరించుకోవడం సులభమవుతుందని వివరించారు. నమోదు సమయంలో రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామం లేదా పట్టణం, పిన్ కోడ్ వంటి వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఏవైనా తప్పులు ఉంటే గణనలో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. అదేవిధంగా, డిజిటల్ మ్యాప్‌లో తమ నివాస గృహాన్ని తప్పనిసరిగా గుర్తించాల్సి ఉంటుందని తెలిపారు. దీని వల్ల గృహ స్థానం ఖచ్చితంగా నమోదు కావడం ద్వారా గణన ప్రక్రియలో నాణ్యత, విశ్వసనీయత పెరుగుతుందని చెప్పారు. స్వీయ-గణన విధానం అమలుతో గణన ప్రక్రియ వేగవంతమవడమే కాకుండా పారదర్శకత పెరుగుతుందని, ప్రభుత్వానికి ఖచ్చితమైన డేటా లభించడం ద్వారా భవిష్యత్ సంక్షేమ పథకాల రూపకల్పనకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేయలేని వారు లేదా సాంకేతిక పరిజ్ఞానం లేని వారు గణనకర్తల సహాయం పొందవచ్చని తెలిపారు. గ్రామ, వార్డు స్థాయిలో సిబ్బంది సహకారం అందుబాటులో ఉంటుందని చెప్పారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని నిర్దేశిత గడువులోపు తమ కుటుంబ వివరాలను నమోదు చేసి దేశ అభివృద్ధికి తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

## సూర్యప్రభ, హంస వాహనాలపై అమ్మవారి వైభవ ఊరేగింపు







**హనుమకొండ ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి) :** శ్రీ భద్రకాళీ దేవస్థానంలో జరుగుతున్న శ్రీ భద్రకాళీ భద్రేశ్వరుల కళ్యాణ బ్రహ్మోత్సవాలు ఐదవ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా గురువారం ఉదయం అమ్మవారికి నిత్యాహ్నిక కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం చతుస్థానార్చన చేశారు. అనంతరం ఉదయం అమ్మవారిని సూర్యప్రభ వాహనంపై, సాయంకాలం హంస వాహనంపై భక్తుల మధ్య ఘనంగా ఊరేగించారు. శాస్త్రాలలో "జయచంద్ర దివాకర నేత్రధలే" అని అమ్మవారిని స్తుతించగా, సూర్య చంద్రులు అమ్మవారి నేత్రాలుగా భావించబడతారని పురాణాలు వివరిస్తున్నాయి. సూర్యుడు ప్రకాశానికి ప్రతీక కాగా, "ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్" అనే వాక్యం ప్రకారం సూర్యప్రభ వాహనంపై దర్శనం చేసిన భక్తులకు ఆరోగ్యం, కీర్తి, ప్రతిష్టలు కలుగుతాయని విశ్వాసం. నేత్ర సంబంధిత వ్యాధులు తొలగి, అంతరదృష్టి, బాహ్యదృష్టి మెరుగుపడతాయని ఆలయ ప్రధానార్చకులు తెలిపారు. అలాగే హంస జ్ఞానానికి ప్రతీకగా నిలుస్తుంది. పాలు-నీరు వేరు చేసే లక్షణం ద్వారా ధర్మాధర్మ విచక్షణను సూచిస్తుంది. హంస వాహనంపై అమ్మవారిని సేవించిన భక్తులకు వివేకం, ఆధ్యాత్మిక జ్ఞానం పెరిగి, సత్ప్రవర్తన కలుగుతుందని పేర్కొన్నారు. ఈ రోజు కార్యక్రమాలకు తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఉభయదాతలుగా వ్యవహరించగా, రాష్ట్ర అధ్యక్షులు మరియు శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డా. బండా ప్రకాశ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె అశోక్, వరంగల్ మహానగర నాయకులు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. సాయంకాలం హంస వాహన సేవలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య అధ్యక్షులు మోతుకూరి రామేశ్వరరావు-మయూరి, చైర్మన్ వెన్నంపెల్లి జగన్మోహన్ శర్మ తదితరులు పాల్గొన్నారు. ఈ విషయాన్ని కార్యనిర్వహణాధికారి ఒ సహాయ కమిషనర్ రామల సునీత వెల్లడించారు.

## ఘనంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక

- మొక్కలు నాటిన ఎస్పీఎఫ్ బలగాలు
- డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా ఆదేశాలతో కార్యక్రమం
- పాల్గొన్న అసిస్టెంట్ కమాండెంట్ విజయ భాస్కరరావు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 23(ప్రజాజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నాగార్జునసాగర్ ప్రత్యేక రక్షణ దళం గురువారం హరితహారం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ స్వాతి లక్రా జోన్ ఐజి మాధవరావు ఆదేశాల మేరకు నాగార్జునసాగర్ ఎస్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ విజయ భాస్కరరావు, నేతృత్వంలో ఇన్స్పెక్టర్లు శ్రీనివాసరావు, ప్రతాప్ నాయుడు,ఆధ్వర్యంలో పైలాన్ కాలనీలోని జెన్కో చీఫ్ ఇంజనీర్






కార్యాలయం,అసిస్టెంట్ కమాండెంట్ కార్యాలయం,జెన్కో ఇన్స్పెక్టర్ కార్యాలయం,సాగర్ ప్రాజెక్ట్ ఎస్ పి ఎఫ్ ఇన్స్పెక్టర్ కార్యాలయం,లో హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటినట్లుగా తెలిపారు.ఈ సందర్భంగా అసిస్టెంట్ కమాండెంట్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలి,సామాజిక బాధ్యతలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు.సాగర్ పరిసర ప్రాంతాల అభివృద్ధి,క్రమశిక్షణ మరియు సేవా భావంతో ఎస్పీఎఫ్ ఎల్లప్పుడూ ముందుంటుందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్పీఎఫ్ ఇన్స్పెక్టర్లు శ్రీనివాస రావు,ప్రతాప్ నాయుడు,ఎస్సై రఘుబాబు,ఏఎస్ఐలు పుల్లయ్య, మహమ్మద్,సిబ్బంది పాల్గొన్నారు.

## మహిళలు స్వయంకృషితో ఎదగాలి

### మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ బాబు

కోదాడ టౌన్, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి): మహిళలు స్వయంకృషితో ఎదగాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఎర్నేని కుసుమ వెంకటరత్నం బాబు వైస్ చైర్మన్ దేవరపల్లి మల్లేశ్వరి స్థానిక





వార్డు కౌన్సిలర్ చలపాటి శివ అన్నారు గురువారం స్థానిక గోల్డ్ షాప్ బజార్లో విజయ గణపతి దేవాలయం సమీపాన నూతనంగా ఏర్పాటు చేసిన జ్యోతి ప్రొఫెషనల్ బ్యూటీ పార్లర్ ను ఆమె ప్రారంభించి మాట్లాడారు మహిళలు విద్యతోపాటు ఆర్థికంగా వ్యాపార రంగాలలో అభివృద్ధి చెందాలని అన్నారు తక్కువ ధరలకు సేవలు అందించి మంచి పేరు సంపాదించుకోవాలి కోరారు అదేవిధంగా జ్యోతి ప్రొఫెషనల్ బ్యూటీ పార్లర్ నిర్వాహకులు మీసాల జ్యోతిని వారు అభినందించారు ఈ కార్యక్రమంలో కొక్కు లక్ష్మీనారాయణ నెమ్మాది దేవమని ,చింత కెజ్జమ్మ ,శాంతి వర్ధన్, జేమ్స్, ప్రజ్ఞ, ప్రమోద్ ,విశ్వ, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాటం

### కామ్రేడ్ డాక్టర్ చిలుకు స్వామి

ఆలేరు ఏప్రిల్ 23 ప్రజా జ్యోతి: రైల్వే కార్మికులకు కనీస వేతనం తక్షణమే అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం షారాజీపేట గ్రామానికి చెందిన చిలుకు స్వామి అన్నారు. గురువారం వారు మాట్లాడుతూ సికింద్రాబాద్ డివిజన్ మంజూరు యూనియన్ ప్రతినిధులు కార్మికుల సమస్యలను జాతీయస్థాయిలో ప్రస్తావించారు. ప్రస్తుతం కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక పని పరిస్థితుల సమస్యలను పరిష్కరించడం అత్యవసరమని పేర్కొన్నారు. కార్మికుల హక్కుల సాధన కోసం తమ పోరాటం కొనసాగుతుందని సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు వెనకడుగు వేయబమని యూనియన్ నాయకులు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు



# ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్

**తనిఖీ సమయంలో అందుబాటులో లేని డాక్టర్లు**

**డాక్టర్ల గైర్హాజరు పట్ల కలెక్టర్ ఆగ్రహం**

**వైద్యులు రోగులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలి**

**జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్**

హుజూర్ నగర్ ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రిలలో వైద్యులు రోగులకు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండాలని, లేదంటే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ హెచ్చరించారు. గురువారం హుజుర్ నగర్ (ప్రాంతీయ వైద్యశాల) ఏరియా ఆసుపత్రికి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కలెక్టర్ ఆసుపత్రిని తనిఖీ చేసిన సమయంలో డాక్టర్లు అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొంత మంది సమయం కాకముందే విధుల నుంచి వెళ్లిపోవడంపై కలెక్టర్ వివరాలను ఆరా తీశారు. అనంతరం డయాలసిస్ కేంద్రం, బ్లడ్ బాంక్ కేంద్రలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు విధి నిర్వహణలో సమయానికి రోగులకు




అందుబాటులో ఉండాలని రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. ఓపి విభాగంలో సమయపాలన పాటించని డాక్టర్లను, కాంట్రాక్టు డాక్టర్లపై చర్యలు తీసుకో వాలని సంబంధిత సూపరెండేంట్ ని ఆదేశించారు. ఇందుకు సంబంధించి పూర్తి నివేదికను అందించాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని. గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని. సాధారణ ప్రసవాలు అధికంగా జరిగేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఆసుపత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈసందర్భంగా ఆసుపత్రి పారిశుధ్య నిర్వహణపై శానిటేషన్ సిబ్బందిని, నర్సింగ్ ఆఫీసర్లను అభినందించారు. కాయకల్పలో అవార్డ్ పొందాలని ఆకాక్షించారు.మెరుగ్గా పారిశుధ్య పనులను నిర్వహించి ఆసుపత్రి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆసుపత్రి లోని అత్యవసర విభాగం, ఓపి విభాగం, బ్లడ్ స్టోరేజి విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. నూతనంగా నిర్మిస్తున్న ఓపి బ్లాక్ నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం సిటీ స్కాన్ మిషన్ పని తీరును పర్యవేక్షించారు. టి హబ్



నిర్వహణలో ఉన్న లోపాలను అధికారులతో మాట్లాడి తక్షణమే సమస్యను పరిష్కరించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసులు, సూపరెండేంట్ డాక్టర్ శ్రవణ్ కుమార్, ఆర్ఎంఓ డాక్టర్ రవి కుమార్, గైనకాలజిస్ట్ డాక్టర్ వనజ, వైద్యులు, నర్సింగ్ ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పన కు కృషి చేస్తా

హుజూర్ నగర్ ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి): హుజూర్ నగర్ న్యాయస్థానాలలో మౌలిక వసతుల కొరతతో పాటుగా సిబ్బంది కొరత కూడా ఉన్నట్లుగా తన దృష్టికి వచ్చిందని ఆ సమస్యలను స్టేట్ బార్ కౌన్సిల్ మెంబర్ సాముల రాంరెడ్డి సహకారంతో పరిష్కరించడానికి కృషి చేస్తానని బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారపరాజు శ్రీనివాస రావు తెలిపారు. గురువారం బార్ అసోసియేషన్ హాల్ నందు జరిగిన పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ న్యాయ పీఠానికి న్యాయవాదులకు మధ్య సత్సంబంధాలు కొనసాగించాలని అప్పుడే న్యాయస్థానాలలో అన్ని పనులు సజావుగా సాగుతాయని ఆయన అన్నారు. కోర్టు సిబ్బందికి న్యాయవాదులకు మధ్య ఏదైనా సమస్య ఉత్పన్నమైతే దాన్ని సామరస్య పూర్వకంగా పరిష్కరిస్తానని ఆయన న్యాయవాదులకు హామీ ఇచ్చారు. న్యాయవాదులు కూడా విషయ పరిజ్ఞానం లేకుండా ఇతరుల పట్ల దురుసు గా ప్రవర్తించవద్దని ఆయన హితవు పలికారు. మొదటగా సీనియర్ న్యాయవాది కాల్వ శ్రీనివాసరావును ప్రోటీన్ స్పీకర్ గా ఎన్నుకోవడంతో ఆయన బార్ అసోసియేషన్ కార్యవర్గము చేత పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. ఎన్నికల అధికారులు ఎంఎస్ రాఘవరావు, వట్టికూటి అంజయ్య లు ఎన్నికలలో గెలిచిన కార్యవర్గానికి ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అధ్యక్షులుగా నారపరాజు శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా జక్కుల వీరయ్య, ప్రధాన కార్యదర్శిగా ఆర్ వి రమణారెడ్డి, సంయుక్త కార్యదర్శిగా కోలా రమాదేవి, గ్రంథాలయ కార్యదర్శిగా ధూళిపాల శ్రీనివాసరావు, కోశాధికారిగా గొట్టే ప్రశాంత్, క్రీడల మరియు సాంస్కృతిక కార్యదర్శిగా రామావత్ అదవి రాముడు, కార్యవర్గ సభ్యులుగా షేక్ మౌలాభి, చిట్టిపోతుల రమేష్, షేక్ నాగపాష, బుడిగ నరేష్, జక్కుల నవీన్, భూక్య నాగరాజు నాయక్, నర్సింగ్ సతీష్, ల చేత ప్రోటెమ్ స్పీకర్ కాల్వ శ్రీనివాసరావు పదవీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పెద్ద ఎత్తున




న్యాయవాదులు, వివిధ రంగాలకు చెందిన పుర ప్రముఖులు నూతన కార్యవర్గాన్ని శాలువా, గజమాలలు, పూలదండలు, బొకే ల తో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు కార్యక్రమానికి హాజరైన వారికి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏజీపీ లు, పీపీ లు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

# తుంగతుర్తి మైనారిటీ గురుకులంలో ఘనంగా మైనారిటీ వారోత్సవాలు

తుంగతుర్తి, ఏప్రిల్ 23, (ప్రజా జ్యోతి): ఇంటర్ ప్రథమ మరియు ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో మైనారిటీ విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించడం విద్యార్థుల అధ్యాపకుల కృషి ఫలితమేనని మైనార్టీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఉమా అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మైనారిటీ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించిన మైనారిటీ వారోత్సవాలలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను కళాశాల సిబ్బంది సన్మానించారు. వారోత్సవాల్లో భాగంగా కళాశాలలో ఉన్న



మరుగుదొడ్లు, స్నానపు గదులను, వంట గదులను తనిఖీ చేసి పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విద్యార్థుల లో ఉన్న ప్రతిభను గుర్తించేందుకు క్విజ్, వకృత్వ, వ్యాసరచన, పోటీలతోపాటు సంస్కృతి ప్రదర్శన కార్యక్రమాలను నిర్వహించారు.ఈ మేరకు విద్యార్థుల తల్లిదండ్రుల తో సమావేశం నిర్వహించి పాఠశాల యొక్క అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఉపాధ్యాయులు విద్యార్థుల అభివృద్ధి పట్ల చేస్తున్న కృషిని వివరించారు.వచ్చే విద్యా సంవత్సరంలో మైనారిటీ విద్యార్థులు అడ్మిషన్లు పొందే విధంగా విద్యార్థులు మరియు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా కార్యక్రమం నిర్వహించాలి: సీఐ నవీన్ కుమార్

కొండమల్లేపల్లి,ఏప్రిల్ 23,(ప్రజాజ్యోతి): పట్టణంలో ఏప్రిల్ 26 ఆదివారం సాయంత్రం నిర్వహించనున్న హిందూ సమ్మేళన కార్యక్రమానికి సీఐ నవీన్ కుమార్, ఎస్ఐ అజ్మీరా రమేష్‌లను హిందూ సమ్మేళన సమితి సభ్యులు కరపత్రం అందజేసి ఆహ్వానించారు.ఈ సందర్భంగా సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ, ఇటువంటి కార్యక్రమాలను ఎలాంటి అవాంఛనీయ



సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు ఏరుకొండ రాము, బత్తుల పరమేష్, చనగోని శివ గౌడ్, దాచేపల్లి నరేందర్, నూతనగంటి ఈశ్వర్, గుమ్మడవెల్లి జనార్ధన్, మురళి, నీల విజయ్, తోటపల్లి కిరణ్, కృష్ణ, కూన బాను చందర్, ముత్యం, భవండ్ల సాయి, బోడా అశోక్, రాకేష్, గోపి, అంజన్ కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాల కీర్తి ప్రతిష్టలు పెంచాలి

నడిగూడెం, ఏప్రిల్ 23, ప్రజా జ్యోతి: స్థానిక సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. సర్పంచ్ దున్న శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పాఠశాల కీర్తి




ప్రతిష్టలను పెంపొందించేందుకు విద్యార్థులను చదువులో ప్రోత్సహించేందుకు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. నడిగూడెం గురుకుల పాఠశాలకు రాష్ట్రస్థాయిలో మంచి గుర్తింపు ఉందని అన్నారు. గత రెండు విద్యాసంవత్సరాలుగా ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల్లో 100 శాతం ఫలితాలను సాధించడం పట్ల ప్రిన్సిపాల్, లెక్చరర్స్ ను ఆయన అభినందించారు. జేఈఈ మెయిన్స్ లో కూడా ఇద్దరు విద్యార్థులు సెలెక్ట్ కావడం పట్ల సర్పంచ్ హర్షం వ్యక్తం చేశారు. పేద పిల్లలకు గురుకులాలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయని వారి అభివృద్ధికి బాటలు వేస్తున్నాయని అన్నారు. నడిగూడెంలో గురుకుల డిగ్రీ కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు ఈ మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి కి విన్నవించినట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారానే నడిగూడెం గురుకుల పాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలను సాధిస్తూ పాఠశాలకు మంచి పేరు తెస్తున్నారని అన్నారు. వేసవి సెలవులు అనంతరము పాఠశాలలు పున ప్రారంభం రోజునే తమ పిల్లలను పాఠశాలకు పంపాలని తల్లిదండ్రులకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. ఇంటర్మీడియట్ లో మండల స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను జూన్ లో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో భారీ సన్మాన సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ చింతలపాటి వాణి మాట్లాడుతూ వేసవి సెలవుల్లో పిల్లలు సమయాన్ని వృధా చేయకుండా ఉండేలా తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు హోంవర్క్ ఇచ్చినందున సెలవుల్లో పూర్తి చేసేలా తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలన్నారు. పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తల్లిదండ్రులకు ఈ సందర్భంగా పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఎలక్ట్రిక్ వాహనాలతో జాగ్రత్త!.. ఎలక్ట్రిక్ వాహనాల ఫైర్ సేఫ్టీ

నిడమానూరు,ఏప్రిల్ 23(ప్రజాజ్యోతి): అపార్ట్మెంట్లు, ఇళ్లు, వీధుల్లో ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) సంఖ్య వేగంగా పెరుగుతోంది.సాధారణ పెట్రోల్, డీజిల్ వాహన ప్రమాదాలకు ఈవీ ప్రమాదాలకు మధ్య చాలా తేడా ఉంటుంది. లిథియం అయాన్ బ్యాటరీల స్వభావాన్ని అర్థం చేసుకోవడం వాహనదారులకే కాదు.. అపార్ట్మెంట్లలో నివసించే ప్రతీఒక్కరికి చాలాముఖ్యం. ఎలక్ట్రిక్ వాహనాల్లో మంటలు ప్రారంభమైతే థర్మల్ రన్ అవే అనే ప్రక్రియ జరుగుతుంది. ఇది ఒకగొలుసుకట్టు చర్య వంటిది. ఇక్కడ ఒక బ్యాటరీ సెల్ మంటలు అంటుకోగానే పక్కనే ఉన్న సెల్స్ ను సెకన్ల వ్యవధిలో వేడి చేస్తుంది. తద్వారా ఉష్ణోగ్రతలు 600 సెంటీగ్రేడ్ నుంచి 1000 సెంటిగ్రేడ్ల వరకు చేరుకుంటుంది. ఇలాంటి మంటలను ఆర్పడానికి సాధారణ పౌడర్ ఆధారిత ఫైర్ ఎక్స్ టింగ్యుషర్లు ఏమాత్రం పని చేయవు.

**–ప్రమాదాలపై అప్రమత్తం**

వాహనం నుంచి పొగ రావడం గమనించిన వెంటనే తొలిప్రాధాన్యతగా అక్కడి నుంచి



పారిపోవడం మాత్రమే అయి ఉండాలి. ఫోన్, బ్యాగ్ వంటి వస్తువుల కోసం సమయం వృథా చేయకండి.కారులో ఉన్నవారు గరిష్టంగా 60 సెకన్లలోపు బయటకు వచ్చి కనీసం 100 నుంచి 200 మీటర్ల దూరం పారిపోవాలి. బ్యాటరీ కాలిపోయేటప్పుడు 'హైడ్రోజన్ ఫ్లోరైడ్' అనే అత్యంత భయంకరమైన విషవాయువు వెలువడుతుంది. ఇది గాలి కన్నా బరువుగా ఉండి, ఊపిరితిత్తులను, చర్మాన్ని క్షణాల్లో దెబ్బతీస్తుంది. పొగను పీల్చడం ప్రాణాంతకం. గాలి వీచే దిశకు ఎదురుగా కాకుండా సురక్షిత ప్రాంతానికి వెళ్లాలి. బకెట్లతో నీళ్లు చల్లడంతో మంటలు ఆరకపోగా, ఆ నీరు విషవాయువులను నేరుగా ముఖంపైకి నెట్టే ప్రమాదం ఉంది. అపార్ట్మెంట్ సెల్లార్లలో, బేస్మెంట్లలో ఈవీ వాహనాలు ఉన్నప్పుడు ప్రమాద తీవ్రత ఇంకా అధికంగా ఉంటుంది. మంటలు అంటుకున్నప్పుడు పొగ సెల్లార్ అంతా నిండిపోయి లిఫ్ట్ షాఫ్టుల ద్వారా పైఅంతస్తులకు వ్యాపిస్తుంది. అందుకే ప్రమాదం జరిగినప్పుడు పొరపాటున కూడా లిఫ్ట్ వాడకూడదు.

**–ముఖ్యమైన విషయాలు**

ఈవీ బ్యాటరీలు మంటలు ఆరిపోయినట్లు కనిపించినా 24 నుంచి 48 గంటల వరకు ఎప్పుడైనా మళ్లీ కాలిపోయే అవకాశం ఉంటుంది. లోపల రసాయన చర్య జరుగుతూనే ఉండటంతో ఇలా సంభవిస్తుంది. అందుకే మంటలు ఆరిపోయాయి కదా అని వాహనం దగ్గరకు వెళ్లకూడదు. ఫైర్ డిపార్ట్ మెంట్ సమాచారం ఇచ్చేటప్పుడు అది 'ఎలక్ట్రిక్ వాహనం'అని ఖచ్చితంగా చెప్పాలి, అప్పుడే వారు ఆక్సిజన్ మాస్కులు, ప్రత్యేక హాజ్మత్ రక్షణ గేర్ తో వస్తారు.

**–ముందస్తు జాగ్రత్తలు ...**

బ్యాటరీని ఎప్పుడూ 100శాతం వరకు చార్జ్ చేయకుండా 20 నుంచి 80శాతం మధ్య ఉంచడం శాస్త్రీ యంగా సురక్షితం. ఎండఎక్కువగా ఉన్నప్పుడు, ఇంజిన్ వేడిగా ఉన్నప్పుడు వెంటనే చార్జింగ్ పెట్టకూడదు. అపార్ట్మెంట్లలో చార్జింగ్ పాయింట్ల వద్ద నాణ్యమైన వైరింగ్, తగిన సర్క్యూట్ బ్రేకర్లు ఉండేలా చూసుకోవాలి.

## ఎండల తీవ్రత దృష్ట్యా
# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే డా ఆర్ భూపతి రెడ్డి కీలక సూచనలు
- అత్యవసరమైతేనే బయటికి రావాలి
- ఉదయం వేళల్లో పనులు చేసుకోవాలి
- వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు పాటించాలి
- తల్లితండ్రులు పిల్లల పట్ల జాగ్రత్త వహించాలి



**నిజామాబాద్ రూరల్ సిరికొండ ( ప్రజా జ్యోతి)** ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఒక పత్రిక ప్రకటన విడుదల చేశారు. రానున్న రోజుల్లో నిజామాబాద్ సహా ఇతరత్రా జిల్లాల్లో ఎండల తీవ్రత పెరిగే అవకాశాలు ఉన్న నేపథ్యంలో నియోజకవర్గ ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరే అవకాశాలున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందని అందులో నిజామాబాద్ జిల్లా సైతం ఉందన్నారు. కావున ప్రజలు ఎండల బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. పనుల్లోకి వెళ్ళే వారంతా ఉదయం పూటే పనులు ముగించుకుని ఇంటికి చేరుకోవాలని అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. ఇక ఎండ నుండి ఉపశమనం కోసం శీతలపానీయాలు, డి హైడ్రేషన్ కు గురికాకుండా ఉండేందుకు ఓఆర్ఎస్ ఉపయోగించాలని సూచించారు. పిల్లలు మరిన్ని జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ నెల 24 నుండి పాఠశాలలకు సెలవులు ప్రారంభం కానున్న నేపథ్యంలో పిల్లల పై తల్లితండ్రులు నిత్యం శ్రద్ధ వహించాలని సూచించారు. వడదెబ్బ బారిన పడకుండా ఉండేందుకు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు

## కమ్మర్‌పల్లిలో జనాభా గణనపై
# ఎన్యూమరేటర్లకు శిక్షణ ప్రారంభం





**కమ్మర్‌పల్లి ( ప్రజాజ్యోతి )ఏప్రిల్ 23:** దేశవ్యాప్త జనాభా గణన - 2027 కార్యక్రమంలో భాగంగా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో గురువారం శిక్షణా తరగతులు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వేదికగా ఎన్యూమరేటర్లు మరియు సూపర్ వైజర్లకు మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణను తహసీల్దార్ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, జనాభా లెక్కల సేకరణలో ఎన్యూమరేటర్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఈసారి జనాభా గణనలో ప్రజలకు తమ వివరాలను తామే నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యూమరేషన్ సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు అందుబాటులో ఉంటుందని వెల్లడించారు. అనంతరం, మే 11 నుండి జూన్ 10 వరకు ఎన్యూమరేటర్లు క్షేత్రస్థాయిలో ఇంటింటికీ తిరిగి ఇండ్ల జాబితా మరియు ఇతర వివరాలను సేకరిస్తారని వివరించారు. ప్రజలందరూ ఈ సర్వేకు సహకరించి, ఖచ్చితమైన వివరాలను నమోదు చేయించుకోవాలని కోరారు. శిక్షణలో ఎన్యూమరేటర్లకు యాప్ వినియోగం మరియు డేటా సేకరణపై నిపుణులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు, శిక్షకులు మరియు సిబ్బంది పాల్గొన్నారు

# కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

**బాన్సువాడ ఆర్ సి ఎప్రిల్ 23 ప్రజా జ్యోతి** బీర్కూర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి మహేష్ (26) అనే యువకుడు కరెంటు షాక్ గురువారం ఉదయం మృతి చెందాడు. తాను కిరాయి ఉన్న ఇంట్లో ఏదో కరెంటు సమస్య రావడంతో సరిచేద్దామనే ప్రయత్నంలో షాక్ కు గురై మహేష్ కింద పడి పోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే యువకుడిని బాన్సువాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మహేష్ మృతి చెందినట్లు వైద్యులు చెబుతున్నారని తెలిపారు ఈ సంఘటనతో గ్రామములో విషాద ఛాయలు అలుముకున్నాయి .పోలీసులు విచారణ చేపట్టారు. వివరాలు తెలియాల్సి ఉంది.



# ఇందిరమ్మ కమిటీల ఇష్టారాజ్యం?

– అర్హులను పక్కనపెట్టి అనర్హులకు ఇళ్ల కేటాయింపు ఆరోపణలు




**రాజంపేట ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి)** పేదవాడి సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఈ పథకం ద్వారా సొంత స్థలం ఉన్న పేదలకు రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ ఇళ్ల నిర్మాణానికి సహకారం అందిస్తున్నారు. లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామ స్థాయిలో కమిటీలను ఏర్పాటు చేసినప్పటికీ, కొన్ని ప్రాంతాల్లో ఇందిరమ్మ కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హులైన పేదలను పక్కనపెట్టి, అనర్హుల పేర్లను జాబితాలో చేర్చి ఫైనల్ చేయాలని అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై కొందరు అధికారులు స్పందిస్తూ, ఎంపిక ప్రక్రియలో తమ చేతుల్లో అధికారం లేదని, నిర్ణయాలు ప్రధానంగా కమిటీ చేతుల్లోనే ఉన్నాయని పేర్కొనడం గమనార్హం. ఇదే సమయంలో అనర్హులకు ఇళ్లు కేటాయించారని కొందరు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ, సమస్య పరిష్కారంలో స్పష్టత లేకపోవడం పై అసంతృప్తి వ్యక్తమవుతోంది. అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు పారదర్శక సర్వే నిర్వహించి, నిజంగా అవసరమైన పేదలకు ఇళ్లను కేటాయించాలని రాజంపేట మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# ఇరువర్గాలను సందయించిన ఆర్డిఓ రాజేందర్







**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 23** ఇందల్వాయి మండల కేంద్రంలోని లోలం గ్రామంలో భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. గ్రామానికి చెందిన సర్వేనెంబర్ 207.208.209. లకు సంబంధించిన భూమిపై రెండు వర్గాల మధ్య తలెత్తిన సమస్యను పరిష్కరించేందుకు ఎమ్మార్వో బాలయ్య ఆర్డీవో గ్రామానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు ఈరు వర్గాల వారితో ప్రత్యేకంగా మాట్లాడి వారి వాదనలు తెలుసుకున్నారు. గతంలో పనిచేసిన ఎమ్మార్వో చేసిన పొరపాటు కారణంగానే ఈ వివాదం ఉత్పన్నమైంద నీ ఆర్డిఓ రాజేందర్ పేర్కొన్నారు సమస్యను సమగ్రంగా పరిశీలించి. దీనిపై కలెక్టర్కు నివేదిక సమర్పించి త్వరగా పరిష్కారం చూపిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ విషయంపై గ్రామస్తులు అధికారులు జోక్యాన్ని స్వాగతిస్తూ సమస్యకు త్వరలోనే న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ ఐ రంజిత్ జి పి ఓ లు సాయన్న ప్రభాకర్ ప్రమోద్ కందరులు బాలగంగారం బాలు రాజు తదితరులు పాల్గొన్నారు.

## మన ఇసుక మన వాహనం ద్వారా
# ప్రజలకు ఇసుక సరఫరా కొనసాగింపు

– బోధన్ మండల తహసీల్దార్ విట్టల్



**ప్రజాజ్యోతి బోధన్ ఏప్రిల్ 23..** నిజామాబాద్ జిల్లా బోధన్ మండలంలో "మన ఇసుక -- మన వాహనం" పథకం ద్వారా ప్రజలకు ఇసుక సరఫరా కొనసాగుతుందని మండల తహసీల్దార్ విట్టల్ తెలిపారు. ప్రజలు యాప్ ద్వారా బుకింగ్ చేసుకుని ఈ సేవను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఫిబ్రవరి నెలలో ఎవరైతే అమలైన వారికి శుక్రవారం శనివారం మన ఇసుక మన వాహనం ద్వారా ఇసుక తీసుకునే అవకాశం ఉందని మండల తహసీల్దార్ తెలిపారు విధానం మాదిరిగానే, ఇప్పుడు కూడా "మన ఇసుక -- మన వాహనం" ద్వారా ఇసుక సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ విధానం ద్వారా మధ్యవర్తుల జోక్యం లేకుండా, పారదర్శకంగా ప్రజలకు ఇసుక అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. ప్రజలు ప్రభుత్వ యాప్‌ను ఉపయోగించి ముందుగానే బుకింగ్ చేసుకుంటే, సమయానికి ఇసుకను తమ ఇళ్ల వద్దకు పొందవచ్చని తెలిపారు. అలాగే ఎలాంటి అవకతవకలు జరిగితే అధికారులకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. "ప్రజల సౌలభ్యం కోసం ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ సేవను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి" అంటూ తహసీల్దార్ విట్టల్ పిలుపునిచ్చారు.

## కలెక్టరేట్‌లో ఘనంగా
# మహర్షి భగీరథ జయంతి వేడుకలు

– భగీరథుని కృషి స్ఫూర్తిదాయకం: జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 23. (ప్రజాజ్యోతి)** జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో గురువారం మహర్షి భగీరథ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ముఖ్య అతిథిగా హాజరై మహర్షి భగీరథ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "మహర్షి భగీరథుడు తన పట్టుదల, అకుంఠిత దీక్షతో గంగానదిని భువికి తెచ్చి లోక కల్యాణం చేశారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసిన ఆయన కృషి నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకం" అని కొనియాడారు."భగీరథుని వలె మనమందరం సమాజ హితం కోసం నిస్వార్థంగా పనిచేయాలి. ముఖ్యంగా ప్రభుత్వ అధికారులు, సిబ్బంది భగీరథుని ఆశయాలను ఆదర్శంగా తీసుకొని ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేయాలి" అని పిలుపునిచ్చారు. జల సంరక్షణ, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ విషయాల్లో భగీరథుని స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. సగర పుత్రులకు ముక్తిని కలిగించడం కోసం తరతరాలుగా చేసిన తపస్సును కొనసాగించి విజయం సాధించిన భగీరథుని సంకల్పం అందరికీ ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్, ఏసిఎల్బి మధు మోహన్. జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి జయరాజ్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి చక్రధర్ , పవన్, సునీత, అశ్వక్, జీవన్,శాంతయ్య తదితరులు, జిల్లా అధికారులు మరియు పలువురు ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## అయ్యర్పల్లి పీపీసీ కేంద్రాన్ని
# తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

– వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్



**కామారెడ్డి ప్రతినిధి ఏప్రిల్ 23. (ప్రజాజ్యోతి)** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ గురువారం లింగంపేట మండలం అయ్యర్పల్లి గ్రామంలోని ఐకేపీ పీపీసీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి, కొనుగోలు కేంద్రంలో వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తూకం, తేమ శాతం పరీక్ష, గన్నీ బ్యాగుల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నంతరం వరి సేకరణకు సంబంధించిన సివిల్ సప్లైస్, మార్కెటింగ్, ఐకేపీ, పీఏసీఎస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలి" అని అధికారులను ఆదేశించారు. "కొనుగోలు చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి. దీని కోసం ప్రతి రోజు జరిగే కొనుగోళ్ల వివరాలను అదే రోజు ఓపిఎంఎస్ ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. నమోదులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు" అని హెచ్చరించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## పోతంగల్ మండలం జల్లాపల్లి ఫారం
# జల్లాపల్లి తాండ గ్రామాలలో పశు వైద్య శిబిరం



**కోటగిరి, ఏప్రిల్ 23, ప్రజా జ్యోతి.** పోతంగల మండలంలోని, జల్లా పల్లె , జిల్లా పల్లి తండా, గ్రామాలలో గురువారం పశు వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆవులకు గేదె జాతి 3 నెలల పైన వయసు గల పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధినిరోధక టీకాల పంపిణీ చేయటం జరిగింది కార్యక్రమంలో పశువులకు టీకాలు ఇవ్వడం జరిగింది. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు షేక్ దస్తగిరి, ధరావత్ రాజు, పశువైద్యులు డాక్టర్ సురేష్ కుమార్, పశు వైద్య సిబ్బంది సుధీర్ గౌడ్ ,అటెండర్లు భూమేష్,, సతీశ్, భాస్కర్ ,గోపాల మిత్ర నగేశ్, ఇంకా పశు పెంపకందార్లు తదితరులు పాల్గొన్నారు.

## సంప్రదాయంగా శ్రీమంతాలు
# నిర్వహించిన గంగారం తండా సర్పంచ్ సంగీత





**ఇందల్వాయి ( ప్రజా జ్యోతి ) ఏప్రిల్. 23** ఇందల్వాయి మండల కేంద్రంలోని గంగారం తాండ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడి కేంద్రంలో గర్భిణీ స్త్రీల కోసం శ్రీమంతల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ సంగీత ఆధ్వర్యంలో నిర్వహించగా గర్భిణీ స్త్రీలకు సంప్రదాయ పద్ధతిలో ఆశీర్వాదాలు అందించారు.ఈ సందర్భంగా ఈ సందర్భంగా పోస్ట్ కి ఆహారం ప్రాముఖ్యత ఆరోగ్య సంరక్షణ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం శారద. అంగన్వాడి టీచర్ శారద. ఆశ వర్కర్ జ్యోతి. గ్రామ సభ్యులు పాల్గొని గర్భిణీ స్త్రీలకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని అభినందిస్తూ ఇలాంటి కార్యక్రమాలు గర్భిణీ స్త్రీలకు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు

## నాగన్‌పల్లి వద్ద ట్రాక్టర్
# ఢీకొని యువకునికి తీవ్ర గాయాలు





**ప్రజాజ్యోతి బోధన్ ఏప్రిల్ 23 :** బోధన్ మండలంలోని నాగన్ పల్లి క్రాస్ రోడ్ వద్ద ట్రాక్టర్ ఢీకొనడంతో యువకునికి తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బోధన్ మండలం కొప్పర్తి క్యాంపు కు చెందిన పొట్లూరి కృష్ణ ప్రసాద్ తన ట్రాక్టర్ పని ముగించుకొని ప్రక్కన నిద్రిస్తుండగా గుర్తుతెలియని వ్యక్తి ట్రాక్టర్ నడిపుతూ కృష్ణ ప్రసాద్ పై ఎక్కించడంతో ఆయన కుడికాలు విరిగింది. స్థానికులు గమనించి బోధన్ 108 సిబ్బందికి సమాచారం అందించగా సకాలంలో అక్కడికి చేరుకున్న బోధన్ 108 సిబ్బంది ఈఎంటి లక్ష్మణ్, పైలెట్ కేశవకుమార్ లు ప్రథమ చికిత్స చేసి మెరుగైన వైద్యం కోసం భాధితున్ని బోధన్ జిల్లా ఆస్పత్రికి తరలించారు.

# భగీరథ మహర్షి త్యాగం ప్రతి ఒక్కరికీ ఆదర్శం

- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్
- ఘనంగా భగీరథ మహర్షి జయంతి వేడుకలు





**మెదక్ (ప్రజాజ్యోతి )ఏప్రిల్ 23 :** భగీరథ మహర్షి త్యాగం, పట్టుదల ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. గురువారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అదనపు కలెక్టర్ నగేష్ తో కలిసి ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, మహర్షి చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సగర వంశీయులైన భగీరథ మహర్షి గంగా నదిని స్వర్గం నుంచి భూమిపైకి తీసుకువచ్చిన గొప్ప తపస్వి అని కొనియాడారు. భగీరథ మహర్షి పట్టుదల, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని కలెక్టర్ పేర్కొన్నారు. అసాధ్యాన్ని సుసాధ్యం చేసి గంగానదిని భూమికి తెచ్చిన మహనీయు డిగా భగీరథుని చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. అందుకే గొప్ప ప్రయత్నాలను 'భగీరథ ప్రయత్నం'గా పిలుస్తారని వివరించారు. అనంతరం అధికారులు, కుల సంఘాల ప్రతినిధులు, కార్యదర్శులు, అధ్యక్షులు, తదితరులు ఆయన చిత్రపటానికి అంజలి ఘటించి, నివాళులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ జోజి, డిపిఓ యాదయ్య, డి ఆర్ డి ఓ శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో యూనస్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి గంగా కిషన్, సంఘ నాయకులు జిల్లా అధ్యక్షుడు సాయిలు ఉప్పల సాగర సంఘ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# పేకాట స్థావరాలపై పోలీసుల మెరుపు దాడులు

- ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 8 సెల్ ఫోన్లు 5 కార్లు 62 490 నగదు స్వాధీనం పరుచుకున్న పోలీసులు
- ఎస్సై సుభాష్ గౌడ్




**మనోహరాబాద్, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి)** మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో కల్లాకల్ గ్రామంలో కొత్త కాపు వెంకటేష్ కు చెందిన అద్దె ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు విశ్వాసనీయ సమాచారం మేరకు పోలీసులు స్థావరంపై మెరుపు దాడులు నిర్వహించారు. గురువారం ఉదయం ఎస్సై సుభాష్ గౌడ్ కు పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ సుభాష్ గౌడ్ తో పాటు తన సిబ్బంది రంగంలోకి దిగి మెరుపు దాడులు నిర్వహించగా 8 మంది పేకాటాడుతున్నట్లు గుర్తించారు. పేకాట రాయుళ్ల నుంచి 62 49 0 నగదు 8 మొబైల్ ఫోన్లు 5 కార్లు పేకాట ముక్కలను మాటకు ఉపయోగపడే సామాగ్రిని స్వాధీనపరచుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సుభాష్ గౌడ్, వీరిని కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. తన పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించామని అన్నారు. మండలంలో ఎక్కడైనా పేకాట ఆడుతున్నట్లు సమాచారం వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ప్రభుత్వ నిర్ణయానికి ఆర్యవైశ్యుల అభినందనలు

**సిద్ధిపేట రూరల్, ఏప్రిల్ 23 , (ప్రజాజ్యోతి):** ఆర్యవైశ్యుల కులదైవమైన లోకమాత శ్రీ వాసవి మాత జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాసవి మాత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వైశ్య కార్పొరేషన్‌కు ఇప్పటివరకు తగిన నిధులు కేటాయించలేదని, త్వరలోనే సరిపడ నిధులు విడుదల చేసి పేద వైశ్యులను ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలనే నిర్ణయానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో కార్యవర్గ సభ్యులు అయిత రత్నాకర్, జిల్లా అధ్యక్షుడు తణుకు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి సముద్రాల హరినాథ్, కోశాధికారి మంకాల నవీన్ కుమార్, మహిళా విభాగం కార్యదర్శి మంకాల నాగమణి, యువజన విభాగం సభ్యులు పోశెట్టి శ్రీకాంత్,వైశ్య భవనం అధ్యక్షులు అయిత బాలరాజేశం, కోశాధికారి గంప కృష్ణమూర్తి, పి ఆర్ ఓ పోకల రాజేశం, గ్రీటింగ్ చైర్మన్ గౌరిశెట్టి దామోదర్, జిల్లా యువజన విభాగం ప్రధాన కార్యదర్శి పుల్లూరి శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్వపల్లి హరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏప్రిల్ 25 న ఉద్యోగ మిత్ర మెగా జాబ్ మేళా



**సిద్ధిపేట, ఏప్రిల్ 23, (ప్రజాజ్యోతి):** సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో సిద్దిపేట పోలీస్ ఉద్యోగ మిత్ర పేరిట మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఈ కార్యక్రమం ఏప్రిల్ 25న ఉదయం 9 గంటల నుంచి సిద్దిపేటలోని పోలీస్ కన్వెన్షన్ సెంటర్లో జరుగనుంది. ఈ జాబ్ మేళాకు 10వ తరగతి, ఐటీఐ, ఇంటర్మీడియట్, డిగ్రీ, డిప్లొమా, బీటెక్ మరియు ఇతర వృత్తి విద్యా కోర్సులు పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు. ఐటి, ఫార్మసీ, ఇండస్ట్రీ తదితర రంగాలకు చెందిన పలు ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు తమ విద్యార్హతల జిరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, కనీసం ఐదు రెజ్యూమ్ కాపీలతో హాజరు కావాలని సూచించారు. ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్నవారికి ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. జిల్లాలోని యువతీ యువకులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేయాలని సీపీ కోరారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు, సామాజిక బాధ్యతగా యువతకు ఉపాధి కల్పించేందుకు పోలీస్ శాఖ ఈ ఉద్యోగ మిత్ర కార్యక్రమాన్ని చేపడుతోందని తెలిపారు.

# రైతును రాజుగా చేయడమే ప్రభుత్వ లక్ష్యం



**సిద్ధిపేట అర్బన్ , ఏప్రిల్ 23 , (ప్రజాజ్యోతి):** రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతును రాజుగా చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పూజల హరికృష్ణ అన్నారు. గురువారం సిద్దిపేట అర్బన్ మండలంలోని వెల్కటూర్ గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఐకేపీ కేంద్రాలలో రైతులకు అవసరమైన నీడ, తాగునీటి సౌకర్యాలు కల్పించి, పారదర్శకంగా వడ్ల కొనుగోలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొల్లు లక్ష్మి, నరేష్, ఏఈఓ రాజేష్, వార్డు సభ్యులు, నాయకులు వెంకటేష్ గౌడ్, మల్లమరి శంకర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు, అర్బన్ మండల అధ్యక్షుడు బిక్షపతి, బొమ్మల యాదగిరి, దాస అంజన్న, మార్క సతీష్, డీసీసీ మహిళ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, పూజాల గోపీకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్లు బస్సా వంశీ, పవన్, వార్డు మెంబర్లు, ఏఎంసీ డైరెక్టర్లు ఎర్ర మహేందర్, వాహబ్, ఎల్లు శ్రీనివాస్ రెడ్డి, ఏరాబోలు రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాదా బైనామా - భూభారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

- పారదర్శకత జనగణనకు లక్ష్యంగా తహాసిల్దార్లు చిత్తశుద్ధితో పని చేయాలి
- జిల్లాలో చెరువులు అన్యక్రాంతం కాకుండా డ్రైలాండ్
- వెట్ ల్యాండ్ సర్వే నిర్వహణలో ముందుచూపు అవసరం.
- ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ప్రయాణానికి అసౌకర్యం కలవకుండా పటిష్ట చర్యలు
- వచ్చే వానాకాలం పంటకు ఎరువులు విత్తనాలు రైతులకు అందుబాటులో బఫర్ స్టాక్ ఉండాలి.
- జిల్లాలో ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహించాలి.
- గృహ అవసరాల గ్యాస్ ప్రజలకు అవసరాలకు తగ్గట్టుగా అందుబాటులో ఉండాలి.
- పక్కా ప్రణాళికతో ఓటర్ మ్యాపింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్






**మెదక్ ( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 23 :** సాధబైనామా పరిష్కారం లో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు. సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ మందిరంలో గూగుల్ మీటి నిర్వహించి సంబంధిత కాసిల్దారులకు జనగణన, డ్రైలాండ్ వెట్ ల్యాండ్ సర్వే, ఆర్టీసీ సమ్మె నేపథ్యంలో ప్రజలకు ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా తీసుకునే చర్యలు వచ్చే ఖరీఫ్ సీజన్లో రైతులకు విత్తనాలు పురుగు మందులు కొరత లేకుండా బఫర్ స్టాక్ ఏర్పాటు చేయడం, జిల్లాలో ధాన్యం కొనుగోలు సమర్థవంతంగా నిర్వహణకు, సమర్థ ఓటర్ మ్యాపింగ్, గృహ అవసరాల గ్యాస్ కొరత లేకుండా చూడటం, భూభారతి సాదా బైనామా పెండింగ్ దరఖాస్తుల పరిష్కారం,సంబంధిత అంశాలపై డీఎఫ్ఓ జోజి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్ , డి ఎం జగదీష్ ,డిపిఓ యాదయ్య, పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, సిపిఓ సురేష్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, డి ఎం ఆర్టీసీ సురేఖ, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్, సంబంధిత తహాసిల్దార్లతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జన గణనకు సంబంధించి తాసిల్దార్లు ప్రతి అంశంలో స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని. క్షేత్రస్థాయిలో జనగణనకు సంబంధించి ప్రత్యక్షంగా ఎదుర్కొనే అంశాలను ప్రశ్నలు సమాధానాల రూపంలో అడిగి తెలుసుకున్నారు. జనగణనకు శిక్షణ అనేది చాలా ముఖ్యమైన అంశమని పేర్కొన్నారు. జిల్లాలో సమర్థ జన గణనే లక్ష్యంగా ముందుకు పోవాలన్నారు. జిల్లాలో 606 చెరువుల సంరక్షణలో భాగంగా. డ్రైలాండ్ వెట్ ల్యాండ్ ఈ సర్వే వేగవంతం చేయాలని. సెంట్రల్ గవర్నమెంట్ నిధులు వచ్చే అవకాశం ఉన్నందున రెవెన్యూ, ఫారెస్ట్ ఇరిగేషన్ సమన్వయంతో కమిటీ ఏర్పాటు చేసి సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ సమ్మె నేపద్యంలో ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. వచ్చే వానాకాలానికి రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలని ఇప్పటివరకు జిల్లాలో 525 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించడం జరిగిందని143 మంది రైతులు నుండి 11 కొనుగోలు కేంద్రాల ద్వారా 887 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు వివరించారు. గన్ని బ్యాగులకు సంబంధించి ఎటువంటి కొరత లేదన్నారు. మిల్లర్లు కూడా సహకరిస్తున్నారని వివరించారు. గృహ అవసరాలకు వినియోగించే గ్యాస్ విషయంలో వినియోగదారు లకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా అవసరానికి తగ్గట్టుగా నిల్వలు ఉంచుకొని తద్వారా చర్యలు చేపట్టాలన్నారు. భూభారతి-సాదా బైనామా పెండింగ్ దరఖాస్తులపై కలెక్టర్ మాట్లాడుతూ భూ భారతిలో గల వివిధ మాడ్యూల్స్ లోని సక్సెషన్, మ్యుటేషన్, ఖాతా సమీకరణ, డేటా కరెక్షన్, అర్బన్ ల్యాండ్, కోర్టు కేసులు, జీపీపీ, పీపీబీ, నాలా తదితరాల పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అలాగే పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంలో వేగం పెంచాలని, త్వరగా పూర్తి చేయాలని సూచించారు..జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాదాబైనామా సాదాబైనామా పరిష్కారంలో ఎంతో జాగ్రత్తగా వ్యవహరించాలి వారికి ఇచ్చిన లక్ష్యాల మేరకు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. పారదర్శకంగా ఎస్ఐఆర్ (ూ×=) మ్యాపింగ్ ప్రక్రియ కొనసాగాలని,జిల్లాలో ఓటర్ల జాబితా మ్యాపింగ్ ప్రక్రియను వేగవంతంగా, ఖచ్చితత్వంతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగా ఓటర్లను చేర్చడం, తప్పుగా నమోదైన వివరాలను సరిచేయడం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సూచించారు. బీఎల్వోలు (దీూం) తమ పరిధిలో ఇంటింటి సందర్శనలు నిర్వహించి, ఓటర్ల వివరాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, పేర్లలో ఉన్న తప్పులను సరి చేయాలని తెలిపారు. ముఖ్యంగా అర్బన్, రూరల్ ప్రాంతాల్లో ఉన్న డేటాను సమగ్రంగా సమీక్షించాలన్నారు. మ్యాపింగ్ ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేసి, జిల్లాలో వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత తహాసిల్దారులు ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు నాణ్యమైన విత్తనాలే లక్ష్యం

- తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి








**మెదక్ ( ప్రజాజ్యోతి ) ఏప్రిల్ 23 :** రైతులకు నమ్మకమైన, అధిక దిగుబడిని ఇచ్చే నాణ్యమైన విత్తనాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి అన్నారు. గురువారం మెదక్ జిల్లా ఐడిఓసీ సమావేశ మందిరంలో విత్తన డీలర్లు, సహకార సంఘాల ప్రతినిధులు, (ఎఫ్‌పీఓ) లు మరియు (ఏఆర్ఎస్‌కే ) కేంద్రాల ప్రతినిధులతో నిర్వహించిన విస్తృత స్థాయి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ నేరుగా రైతులతో అనుసంధానమై, వారి ద్వారానే విత్తన ఉత్పత్తి చేపడుతుందని చైర్మన్ తెలిపారు. సేకరించిన విత్తనాలను కఠినమైన ప్రమాణ పరీక్షల అనంతరం ధృవీకరించి మాత్రమే రైతులకు అందజేస్తున్నామని అన్నారు. దీనివల్ల రైతులకు నాణ్యతపై పూర్తి భరోసా ఉంటుందని వివరించారు.

**వానకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం**

ప్రస్తుత వానకాలం (ఖరీఫ్) సీజన్‌కు సంబంధించి జిల్లాలో విత్తనాల కొరత లేదని ఆయన స్పష్టం చేశారు.

**సన్న రకాలు: బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కెఎన్ఎం 1638.**

దొడ్డు రకాలు: కెఎన్ఎం 118, ఎమ్‌టియు 1010.పై రకాల విత్తనాలు నిల్వలో సమృద్ధిగా ఉన్నాయని, ప్రభుత్వం సూచించిన రకాలను మాత్రమే డీలర్లు విక్రయించాలని ఆదేశించారు. పచ్చిరొట్ట ఎరువులైన జీలుగ, జనుము విత్తనాలను కూడా సకాలంలో రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు. సహకార సంఘాల పాత్రపై సూచనలు సహకార సంఘాలు, ఏఆర్ఎస్‌కే కేంద్రాలు కేవలం రాయితీ ఉన్న పచ్చిరొట్ట విత్తనాలపైనే కాకుండా, ఇతర పంటల విత్తనాలను కూడా రైతులకు అందించడంలో చొరవ చూపాలని కోరారు. లైసెన్స్ కలిగిన ప్రతి విత్తన డీలర్ విత్తనాభివృద్ధి సంస్థ ఉత్పత్తులను తప్పనిసరిగా విక్రయించాలని సూచించారు. మెదక్ జిల్లా సాగు అంచనాలు మెదక్ జిల్లాలో ఈ సీజన్‌లో సుమారు 3.20 లక్షల ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా వేస్తున్నామని, అందుకు 82 వేల క్వింటాళ్ల విత్తనం అవసరమని తెలిపారు. ఇందులో కనీసం 40 వేల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలను ప్రభుత్వం ద్వారా సరఫరా చేసేందుకు అన్ని శాఖలు సమన్వ యంతో పనిచేయాలని పిలుపుని చ్చారు. రాబోయే నూతన విత్తన చట్టం ద్వారా రైతుల హక్కులతో పాటు, డీలర్ల ప్రయోజనాలను కూడా ప్రభుత్వం కాపాడు తుందని అన్నారు. అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ విత్తనాలను రైతులు కొనుగోలు చేసేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నా మని విత్తన సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి నిత్యానంద్ , జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు పి ప్రభాకర్ రెడ్డి ఏడీఏలు, ఎంఏఓలు, జిల్లా సహకార అధికారి (డీసీవో ), విత్తనాభివృద్ధి సంస్థ అధికారులు, విత్తన డీలర్లు మరియు ఎఫ్‌పీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

# మూడున్నర దశాబ్దాల సేవతో ఆదర్శంగా నిలిచిన స్వీపర్ హనుమద్రి మణెమ్మ

- పిఎంశ్రీ జడ్పీ హైస్కూల్‌లో సేవామూర్తి మణెమ్మకు ఘన వీడ్కోలు
- 34 ఏళ్ల సేవతో పాఠశాలకు ఆదర్శంగా సేవలు





**వెల్దుర్తి (ప్రజాజ్యోతి) ఏప్రిల్ 23:** మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలోని పి.ఎం.శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దీర్ఘకాలం సేవలందించిన పార్ట్‌టైం స్వీపర్ హనుమద్రి మణెమ్మ గురువారం పదవీ విరమణ పొందారు. సుమారు 34 సంవత్సరాల పాటు ఆమె పాఠశాలలో శుభ్రత నిర్వహణలో తన సేవలను అందించారు. ప్రతిరోజూ ఉదయం వేళల్లోనే పాఠశాలకు చేరుకుని తరగతి గదులు, ప్రాంగణం పరిశుభ్రంగా ఉంచడంలో మణెమ్మ క్రమశిక్షణతో పనిచేశారు. వర్షం, ఎండ వంటి పరిస్థితులు ఉన్నప్పటికీ తన విధిని నిర్లక్ష్యం చేయకుండా నిరంతరం బాధ్యతతో కొనసాగించారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, అందరితో మమేకమై పనిచేసిన ఆమెను పాఠశాల కుటుంబ సభ్యురాలిగా ఉపాధ్యాయులు అభివర్ణించారు. ఆమె సేవల వల్ల పాఠశాల ఎల్లప్పుడూ పరిశుభ్ర వాతావరణంలో కొనసాగిందని తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సాంబయ్య మాట్లాడుతూ హనుమద్రి మణెమ్మ సేవలను కొనియాడారు. ఏ పని చిన్నది కాదని, నిబద్ధతతో చేసిన పని గొప్పదిగా నిలుస్తుందని ఆమె జీవితం ద్వారా తెలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటస్వామి, శ్రీనివాసరావు, నర్సింహా రెడ్డి, ఖదీర్ పాషా, విజయ్ మోహన్ రాజ్, జయసుధ, అర్చన, అమూల్య, శైలజ, నవనీత, పద్మజ, ప్రశాంతి దేవి, రేణుకా దేవి, రాధిక ప్రియదర్శిని, చార్లెస్, వెంకటరెడ్డి, రాము, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుదాఘాతంతో యువ రైతు మృతి



**నర్సాపూర్, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి)** పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందిన ఘటన మండలంలోని ఎల్లాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన మన్నె శ్రీధర్ (38) గురువారం ఉదయం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోర్ మోటార్ పని చేయకపోవడంతో దానిని బాగు చేసే క్రమంలో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే పడిపోయాడు. సమీప పొలాల్లోని రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా, బాధితుడిని హుటాహుటిన ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించగ అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఉమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

## ఉపాధి కూలీలకు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేస్తాం

– ఉపాధి హామీ పనులతో చెరువు అభివృద్ధి

– గ్రామ సర్పంచ్ డివై నర్సిములు





పెద్దేముల్ ఏప్రిల్ 23 ప్రజాజ్యోతి : జాతీయ ఉపాధి హామీ ద్వారా కొనసాగుతున్న పనులను పెద్దేముల్ సర్పంచ్ డివై నర్సింలు,ఉప సర్పంచ్ డివై ప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెద్దేముల్ పెద్ద చెరువులో జాతీయ ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టిన ముండ్ల పొదల తొలగింపు పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. ప్రస్తుతం వేసవి తీవ్రత అధికంగా ఉండడంతో ఉపాధి కూలీలు ఉదయం 6 గంటల నుండి పనులకు వెళ్ళవచ్చని సూచించారు. రోజు ఉపాధి హామీ కూలీలకు మంచినీటి సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. ఉపాధి హామీ కూలీలకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఫీల్డ్ అసిస్టెంట్ కు సూచించారు. ఇలాంటి ఇబ్బంది ఉన్న కూడ గ్రామ పంచాయతీ కార్యదర్శి లాలప్ప దృష్టికి తీసుకొస్తే సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.గ్రామంలో ఇప్పటి వరకు 211 మంది కూలీలకు ఉపాధి కల్పించినట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటయ్య, గ్రామపంచాయతీ కారోబార్ నర్సిరెడ్డి, కూలీలు ఉన్నారు.

## వికారాబాద్ జిల్లాలో ఘనంగా పీటీఎంలు

– ముఖ్య అతిథుల సమక్షంలో విద్యార్థుల అభివృద్ధిపై చర్చలు






వికారాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 23(ప్రజాజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వ సంక్షేమ వారోత్సవాల సందర్భంగా వికారాబాద్ జిల్లాలో 4వ రోజు భాగంగా ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశాలు (పిటిఎంస్) విజయవంతంగా నిర్వహించబడ్డాయి. జిల్లా వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల, కెజిబివి పాఠశాలల్లో ఈ సమావేశాలు ఘనంగా జరిగాయి. సమావేశాల్లో పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు పాల్గొని విద్యార్థుల విద్యా ప్రగతి, క్రమశిక్షణ, వసతులు, సమగ్ర అభివృద్ధిపై ఉపాధ్యాయులతో చర్చించారు. తల్లిదండ్రులు విలువైన సూచనలు అందించారు. పరిగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశానికి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి, అదనపు కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి జైపాల్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రజిత, కౌన్సిలర్లు హాజరై తల్లిదండ్రులతో మాట్లాడి విద్యలో వారి భాగస్వామ్య ప్రాముఖ్యతను వివరించారు. వికారాబాద్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి జిల్లా పరిషత్ సీఈఓ సుదీర్ బాబు, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్థ సుధాకర్ రెడ్డి పాల్గొని విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాలని ప్రోత్సహించారు. సమస్యలు ఉంటే రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. తాండూర్ గురుకుల పాఠశాలలో జరిగిన సమావేశానికి జిల్లా వెనుకబడిన తరగతుల అధికారి మాధవ రెడ్డి, పంచాయత్ రాజ్ డీఈఈ, మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు, స్థానిక సర్పంచులు హాజరై విద్యార్థుల సంక్షేమం, వసతి గృహాల అభివృద్ధిపై చర్చించారు. కొడంగల్ గురుకుల పాఠశాలలో నిర్వహించిన సమావేశానికి మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. అధికారులు తల్లిదండ్రుల సూచనలను పరిగణలోకి తీసుకుని సంక్షేమ వసతులు విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.

# పరిగిలో ఆర్టీసీ సమ్మె ఉధృతం

– ఉద్రిక్తతల మధ్య అరెస్టులు, ప్రైవేట్ బస్సుల రాకపై వివాదం – ప్రైవేట్ డ్రైవర్ల తో ఐదు ప్రైవేట్ బస్సులు రోడ్డు పై దించిన ఆర్టీసీ

– ప్రైవేట్ డ్రైవర్లకు దండం పెట్టి, బస్సులు నడపవద్దని భావోద్వేగంతో అభ్యర్థనలు

– "మా ఉద్యోగాలను కాపాడండి" అంటూ కార్మికులు కన్నీటి పర్యంతం







పరిగి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) : వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలో ఆర్టీసీ కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజు ఉద్రిక్తతల మధ్య కొనసాగుతుంది. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న కార్మికులకు మద్దతుగా వెళ్లిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ప్రవీణ్ కుమార్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, శశాంక్ లను పోలీసులు అరెస్టు చేయడం స్థానికంగా ఉద్రిక్త పరిస్థితులకు దారితీసింది.

**కార్మికుల ఆవేదన – ప్రధాన డిమాండ్లు :** ఆర్టీసీ కార్మికులు తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా: ప్రభుత్వంలో విలీనం ప్రక్రియ వేగవంతం చేయాలని, పెండింగ్ వేతనాలు, పిఆర్సి బకాయిలు వెంటనే చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పించి పనిభారం తగ్గించి మానవీయ పరిస్థితులు కల్పించాలని కోరుతూ, తమ డిమాండ్లు నెరవేర్చేవరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేస్తున్నారు.

**పరిగి బస్టాండ్ వద్ద ఉద్రిక్తత :** పరిగి బస్టాండ్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సమ్మెకు మద్దతు తెలపడానికి వచ్చిన బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ఉద్రిక్తతను మరింత పెంచింది. దీనిపై బీఆర్ఎస్ నాయకులు తీవ్రంగా ఖండిస్తూ, ప్రజాస్వామ్య హక్కులను అణచివేస్తున్నారని ఆరోపించారు.

**ప్రైవేట్ బస్సుల వ్యవహారం వివాదం :** ఇదిలా ఉండగా, సమ్మె ప్రభావాన్ని తగ్గించేందుకు ఆర్టీసీ అధికారులు ప్రైవేట్ డ్రైవర్ల సాయంతో ఐదు ప్రైవేట్ బస్సులను రోడ్డు మీదకు దించారు. ప్రతి బస్సుకు ఒక కానిస్టేబుల్‌ను భద్రతగా ఉంచి ప్రయాణం ప్రారంభించడం గమనార్హం.

దీనికి వ్యతిరేకంగా ఆర్టీసీ కార్మికులు తీవ్రంగా స్పందించారు. ప్రైవేట్ డ్రైవర్లకు దండం పెట్టి, బస్సులు నడపవద్దని వేడుకుంటూ భావోద్వేగంగా అభ్యర్థించారు. "మా ఉద్యోగాలను కాపాడండి" అంటూ కార్మికులు కన్నీటి పర్యంతమయ్యారు.

**భారీ పోలీస్ బందోబస్తు :** పరిస్థితులు అదుపులో ఉంచేందుకు బస్టాండ్ వద్ద భారీగా పోలీసులను మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు.

ఆర్టీసీ సమ్మె కేవలం కార్మికుల సమస్యగా కాకుండా, రాజకీయ రంగు కూడా ఎక్కుతోంది. ఒకవైపు కార్మికుల డిమాండ్లు, మరోవైపు ప్రభుత్వ యంత్రాంగం తీసుకుంటున్న చర్యలు -- ఇవి ప్రజల్లో చర్చనీయాంశంగా మారాయి. ప్రైవేట్ బస్సులను నడిపించడం తాత్కాలిక పరిష్కారంగా కనిపించినా, ఇది కార్మికుల ఆవేదనను మరింత పెంచే అవకాశం ఉంది. పోలీసుల అరెస్టులు పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చాయి. మొత్తం మీద, పరిగిలో ఆర్టీసీ సమ్మె పరిస్థితి సున్నితంగా మారింది. సమస్యకు శాంతియుత పరిష్కారం కనుగొనేందుకు ప్రభుత్వం, కార్మిక సంఘాలు వెంటనే చర్చలు జరపాల్సిన అవసరం ఉంది.

## ఓఆర్ఎస్‌తో వడదెబ్బ నుండి ఉపశమనం

– ఉపాధి హామీ కూలీలు ఆరోగ్యంపై నిర్లక్ష్యం చేయొద్దు

– గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ హేమలత లాల్ రెడ్డి



పెద్దేముల్ ఏప్రిల్ 23 ప్రజా జ్యోతి : జాతీయ ఉపాధి హామీ పనులు కొనసాగుతున్న ప్పటికీ ఎండల తీవ్రతను తట్టుకునేలా ప్రతి ఒక్కరూ కూడ ఓ ఆర్ ఎస్ పౌడర్ ను నీటిలో కలుపుకుని తాగాలని ఉపాధి హామీ కూలీలకు గాజీపూర్ గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ హేమలత లాల్ రెడ్డి సూచించారు. గురువారం రోజు గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బ నుండి విముక్తి పొందడం కోసం ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లను సరఫరా చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. ప్రస్తుతం ఎండల తీవ్రత అధికంగా ఉందని అందుకోసం ప్రతి ఒక్కరి దగ్గర మంచినీళ్లతో పాటు ఓ ఆర్ ఎస్ పౌడర్ ప్యాకెట్లను వినియోగించుకోనిలా చూడాలని సూచించారు. అదేవిధంగా మంచినీటి సౌకర్యం కల్పించడంతోపాటు ఉపాధి హామీ కూలీలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగిన విధంగా సహాయం అందిస్తామని చెప్పారు. అంతేకాకుండా ఉదయం త్వరగా కూలి పనులకు వెళ్లి సమయాన్ని దృష్టిలో పెట్టుకొని తిరిగి రావాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి కూలికి కూడ ఉపాధి హామీ పని కల్పించేలా చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు పట్లోళ్ళ లాల్ రెడ్డి,ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ అబ్రహం, బుచ్చన్న, ఎల్లప్ప, విష్ణువర్ధన్ రెడ్డి, నర్సింలు, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## భారత్ ముక్తి మోర్చా ఓబీసీ మోర్చా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా






పరిగి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన లో ఓబీసీ కాలంను పొందపార్చాలని కోరుతూ పరిగి పట్టణ కేంద్రంలోని గురువారం అంబేద్కర్ విగ్రహం వద్ద భారత్ బంద్ లో భాగంగా పరిగిలో బస్టాండ్ ఎదురుగా నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జరపనున్న జనగణనలో ఓబీసీ కులాల వారి జనగణన చేపట్టాలని, ఓబీసీ పట్టికను పొందపార్చాలని అన్నారు. 1931 లో బ్రిటిష్ ప్రభుత్వంలో మాత్రమే జరిగిన కులగణనలో ఓబీసీ లను లెక్కించారని, ఓబీసీ కులగణనచెయ్యక అప్పటినుండి సుమారు తొంబై (90) సంవత్సరాలు అయిందని, జంతువుల లెక్కలు నిర్వహిస్తున్నారుకానీ ఓబీసీ లను కులగణన చేస్తాము అని పార్లమెంట్ లో తీర్మానం చేసి కూడా లెక్కచేయ్యకపోవడం బీసీ లను మరో సారి మోసం చేస్తున్నది బీజేపీ నరేంద్రమోడీ ప్రభుత్వం అని బీసీ పట్టికని పెట్టాలని డిమాండ్ చేస్తూ భారత్ బంధ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల రక్షణ కొరకు తెచ్చిన యుజిసి ఈక్విటీ చట్టం–2026ను కఠినముగా అమలు చేయాలని యూనివర్సిటీ లలో ఎస్సి, ఎస్టీ,తో పాటు ఓబీసీ ల పై కూడా కులం పేరు తో ర్యాగింగ్, అన్యాయ అత్యాచారాలు జరుగుతున్నాయి అని, యూజీసీ చట్టాన్ని పక్కద్బంది గా అమలు చెయ్యాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య విరుద్ధమైన ఈవిఎంల ద్వారా ఎన్నికలు నిర్వహిస్తూ ఈ దేశ మూలనివాసి బహుజనులను మోసం చేస్తున్నారని మండిపడ్డారు. 2011 కంటే ముందు నియమితులైన ఉపాధ్యాయులకు టెట్ పరీక్ష నుండి మినహాయింపు ఇవ్వాలని, ఆర్టీసీ కార్మికుల న్యాయమైన హక్కులను రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చెయ్యాలని న్యాయమైన హక్కులను ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, ఎండి హబీబ్, సత్తయ్య, పీర్ మమ్మద్, భారత్ ముఖి మోర్చా జిల్లా నాయకులు శంకర్, వీరేందర్ నాయక్, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు కృష్ణ, ఆర్టీసీ యూనియన్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎంపిటిసి రాజేందర్ రెడ్డి

పత్రికా విలేకరులు



బషీరాబాద్ ఏప్రిల్ 23 ప్రజా జ్యోతి : బషీరాబాద్ మండలం దామర్ చెడ్ గ్రామానికి చెందిన ఆశయం పత్రిక విలేఖరి శ్రీనివాస్ కుమార్తె వివాహం గురువారం డి ఎస్ ఆర్ రావులపల్లి ఫంక్షన్ హాల్లో ఘనంగా జరిగింది ఈ వివాహ వేడుకలో దామర్ చెడ్ మాజీ ఎంపిటిసి రాజేందర్ రెడ్డి. సీనియర్ అసిస్టెంట్ షేర్ఖాన్, సత్యం సార్, బషీరాబాద్ మండల రిపోర్టర్స్ రమేష్, హరిదాస్, శాంతు, నర్సింలు, మహదేవప్ప గోపాల్, నర్సింలు నూతన వధూవరులను ఆశీర్వదించారు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# భానుడు విజృంభన మన జాగ్రత్తలే మనకు రక్ష









నాగారం, ఏప్రిల్ 23,(ప్రజాజ్యోతి) : తెలంగాణా రాష్ట్రంలో భానుడి ప్రతాపం రోజు రోజుకు అధికంగా అవుతుంది తగు జాగ్రత్తలు తీసుకుంటేనే ఆరోగ్యానికి రక్షణ అని వైద్యులు తెలుపుతున్నారు. తొలి కోడి కూసే వేళకు అంతా చల్లచల్లగానే ఉంటున్నది. ఉదయం తొమ్మిది కాకముందే సూర్యడు నేత్తి మీదుంటున్నాడు . పదకొండు అయిందంటే చాలు భగ్గుమని మండిపోతున్నాడు. మబ్బులు పట్టినట్లు యాక్షన్ చేస్తున్నా మొత్తానికి ఎండలు ఝులక్ ఇసున్నాయి. పరిస్థితిని అంచనా వేసిన వాతావరణ శాఖ జాగ్రత్త సుమా అని హెచ్చరిస్తుంది. పోయిన సారి ఎండలకు రోడ్డుపై కోడి గుడ్డు కొట్టితే ఆమ్లెట్ అయ్యే ఎండలు ఉన్నాయి. కానీ ఈ సారి మాత్రం మండుతున్న ఎండలకు జనాలు జంకుతున్నారు.మునపటి కంటే రికార్డు స్థాయిలో ఈసారి ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ట్రాఫికల్ మేనేజ్మెంట్ సంస్థ చెప్తున్నది. అప్రమత్తంగా ఉండడం ఎండ వేడి తగులకుండా అపాయం జరుగకుండా ఉపాయంగా ఉండడమే మన కర్తవ్యం. మండే సూర్యుడి తాపం నుంచి ఎలా తప్పించుకోవాలో చెప్పేందుకే ఈ వ్యాసం . రోజురోజుకు బానుడు భగభగలతో ప్రజలను అల్లాడిస్తున్నాడు. అందుకే ఈ వేసవిలో భానుడి ప్రభావం నుంచి తప్పించుకోవడానికి ఎన్నో జాగ్రత్తలు అవసరం. శరీరం 32 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతను తట్టుకుంటుంది. ఎండలో తిరుగడం వల్ల 35 డిగ్రీల సెంటీ గ్రేడ్ కు చేరుకుంటే వడదెబ్బ సమస్య ఏర్పడుతుంది. 38 నుంచి 40 డిగ్రీల సెంటీ గ్రేడ్ కు చేరుకుంటే ప్రాణాంతకంగా మారుతుంది. అధిక ఉష్ణోగ్రతకు గురైన వ్యక్తి ఐదు రోజుల్లో మృతి చెందే ప్రమాదం ఉంది. సాధారణంగా ఐదేళ్లలోపు 60 ఏళ్ల పైబడ్డవారు త్వరగా వడదెబ్బకు గురవుతారు. గర్భిణీల శరీరంలో తేమశాతాన్ని కాపాడుకోకుటే వడదెబ్బ తగులుతుంది. రక్తకణాలు కుచించుకుపోతాయి. కిడ్నీలు, ఊపిరితిత్తులు, కాలేయం మీద పడుతుంది. వడదెబ్బ లక్షణాలు వడదెబ్బకు గురైన వారి శరీరంలో నీటిశాతం లోపించి బాడీ డిహైడ్రేట్ అవుతుంది. శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరుగుతుంది. దీని వల్ల గుండె, రక్తనాళాలు, కాలేయం, మూత్ర పిండాలు దెబ్బతింటాయి, ఒంట్లోని లవణాలు చెమట రూపంలో బయటకు వెల్లిపోవడంతో మనిషి నీరసించిపోతారు. జ్వరం, వాంతులు, విరేచనాలు, తల తిరుగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయి. అధిక ఉష్ణోగ్రత వల్ల పల్స్ పడిపోతుంది. మతి కోల్పోవడం, కోమాలోకి వెళ్లడం, మూత్రం పసుపు పచ్చగా రావడం లాంటి లక్షణాలు ఉంటాయి. చికిత్స వడదెబ్బకు గురైన వ్యక్తిని వెంటనే నీడలోకి తీసుకురావాలి. బట్టలను వదులు చేసి 25–30 డిగ్రీల ఉష్ణోగ్రతలో ఉన్న నీటితో శరీరాన్ని తడుపాలి. దీనివల్ల శరీరంపై ఉండే రక్తనాళాలు కుచించుకుపోకుండా ఉంటాయి. శరీర ఉష్ణోగ్రత తగ్గేలా చూడాలి... గజ్జలు, చంకలు, మెడపై ఐస్ ప్యాక్లు పెట్టాలి. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లి సకాలంలో చికిత్స అందించాలి.ఈ ఎండ కాలంలో పాటించాల్సిన జాగ్రత్తలు ప్రధానంగా మద్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండలో తిరుగక పోవడం ఉత్తమం ఏదైనా పనిమీద బయటకు వెళ్లాల్సి వస్తే తలకు ముఖానికి ఎండ తగులకుండా జాగ్రత్త పడాలి. టోపి, గొడుగు, తలపాగా ధరించాలి. ఇల్లు కార్యాలయాల్లో చల్లటి వాతావరణం ఉండేలా చూసుకోవాలి. ప్రతిరోజు 5 లీటర్లకు తక్కువ కాకుండా నీరు తాగాలి. నీరసంగా అనిపిస్తే ఓఆర్ఎస్, గ్లూకోజ్ కలిపిన నీటిని తీసుకోవాలి. ఆహారంలో ఎక్కువగా ద్రవ పదార్థాలు ఉండేలా చూసుకోవాలి. కారం మసాలాలకు వీలైనంత దూరంగా ఉండాలి. కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకోవాలి. వేపుడు పదార్థాలు కాఫీ, ఫాస్టుడ్ ఆల్కహాల్ తాగడం మానేయాలి, తగ్గించాలి.యోగా, నడకకు ప్రాధాన్యం ఇవ్వాలి... వదులుగా ఉండే కాటన్ దుస్తులనే ధరించాలి.

వృద్ధులు ఈ జాగ్రత్తలు పాటించండి 60 ఏళ్లు దాటిన వారు ఉదయం 8 గంటలలోపే నడక, వ్యాయామాన్ని పూర్తి చేసుకోవాలి. మదుమేహంతో బాధపడేవారు వీలైనంత త్వరగా అల్పాహారాన్ని తీసుకోవాలి. భోజనానికి మధ్యలో బార్లీ నీరు, పల్చని మజ్జిగ ఖర్జురాలు కాచిన నీటిని తాగితే మంచిది. సాయంత్రం పూట చెరుకు రసం, నిమ్మరసం, అల్లం రసం తాగాలి. 5 గంటల తర్వాతే బయటకు రావాలి. చిన్నారుల భద్రం వేసవిలో వచ్చే ఇన్ఫెక్షన్లు, ఎండాకాలంలో ఆటలమ్మ వచ్చే ప్రమాదం ఎక్కువ. చెమట ఎక్కువగా పోవడంతో శరీరం చల్లబడే ప్రక్రియ దెబ్బతిని వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుంది. ఆరేళ్లలోపు వారితో శరీర ఉష్ణోగ్రత పెరుగడం వల్ల ఫిట్స్ వస్తాయి. కలుషిత నీరు తాగవద్దు... కలుషి నీరు తాగడం వల్ల టైఫాయిడ్, హైపటైటిస్ నీరు తాగడం వల్ల కూడా వ్యాప్తిస్తాయి. డిహైడ్రేషన్ ఏ కామెర్లుకూడా వ్యాప్తిస్తాయి. డిహైడ్రేషన్ వల్ల మూత్రం ఆగిపోయి మూత్రపిండాలపై ప్రభావం చూపవచ్చు. వేసవిలో ఆహార పదార్థాలు త్వరగా చెడిపోతాయి. నిల్వచేసిన మాంసాహారం మంచిది కాదు. జాగ్రత్తలు పిల్లలకు మెత్తని పల్చని నూలు దుస్తులను వేయాలి. సబ్బుకు బదులుగా సున్ని పిండితో స్నానం చేయించాలి. చెస్,కార్యం లాంటి ఇండోర్ గేమ్స్ ఆడేలా చూడాలి. నీళ్లుద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకునేలా చూడాలి. బయటి ఆహారానికి దూరంగా ఉంచాలి. కూరల్లో మసాలాలు తగ్గించాలి. పండ్లు, కూరగాయాలు ఎక్కువగా తినిపించాలి. మూర్చ వ్యాధి, జ్వరం, చర్మ వ్యాధులు ఉన్నవారిని ఈతకు దూరంగా ఉంచాలి.ఎండలో ఈత కొట్టవద్దు.ఎండలో ఈత కొట్టడం వల్ల వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంటుంది. ఉదయం సాయంత్రం వేళల్లోనే ఈతకు వెళ్లాలి. చెవులు, కళ్లను సంరక్షించుకునేందుకు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. చెరువులు, బావుల్లో దాగుడు మూతలు అడుగు భాగానికి వెళ్లి మట్టి తేవడం వంటి ఆటలు ఆడకుండా చూడాలి. నీటిలో ఎవరు ఎక్కువ సేపు దాక్కుంటారోననే వందాలు కాయడం కూడా అనర్థాలకు దారి తీస్తుంది. కాలువల్లో ఈత కొట్టే వారు ప్రవాహానికి ఎదురీదడం మంచిది కాదు. కొబ్బరి నీళ్లు పండ్ల రసాలు తాగడం మంచిది. కొబ్బరి నీళ్లు, పండ్ల రసాలు తాగడం మంచిది. కాపీలు, టీలకు వీలైనంత దూరంగా ఉండాలి. తీసుకునే ఆహారంలో ఉప్పు, నీరు, పోషక విలువలు తగినంత ఉండేలా. చూసుకోవాలి. వేపుడు పదార్థాలు, పాస్ట్ ఫుడ్ కు దూరంగా ఉండాలి. తేలికగా జీర్ణమయ్యే ఆహారాన్ని కొంచెం కొంచెంగా తీసుకుంటే మంచింది. ఓఆర్ఎస్ ప్యాకెట్ను ఎప్పుడు వెంట ఉంచుకోవాలి. వేసవి ఎండకు శరీరం చెమటలు కక్కుతుంది. ఇలాంటి సమయంలో చెమటను బాగా పీల్చగలిగే, వదులు దుస్తులను ధరిస్తే ఎంతో హాయిగా ఉంటుంది, చెమట వల్ల వీటితో ఎలర్జీలు కలిగే ప్రమాదం ఉంటుంది కాబట్టి ఖద్దరుతో ఉన్న దుస్తులు ధరించడం వల్ల ఏ సమస్య ఉండదు.వదులుగా ఉండే దుస్తులు టోప్ పెట్టుకోవాలి. వేసవిలో గర్భిణులతో పాటు కడుపులోని బిడ్డ కూడా ఇబ్బంది పడాల్సి వస్తుంది. కాబట్టి వీలైనంత మేరకు వదులుగా ఉండే దుస్తులనే ధరించాలి. అవి కూడా మెత్తగా సౌకర్యవంతంగా ఉండేలా చూసుకోవాలి. నలుపు, ముదురు రంగు దుస్తులు త్వరగా వేడిని గ్రహిస్తాయి. కాబట్టి సమ్మర్లో వాటిని దూరం పెట్టాల్సిందే. నెత్తిపై టోపి పెట్టుకోవడం గొడుగును వెంట తీసుకెళ్లడం మంచిది. ద్రవాహారం ఎక్కువగా తీసుకోవాలి ఈకాలంలో ఆకలి మందగిస్తుంది. ఆహారంలో రసం, సాంబార్కు ప్రాధాన్యమివ్వాలి. వ్యాయామం చేసేవారు నీళ్లలో కాస్తంత ఉప్పు, నిమ్మరసం కలిపి తీసుకుంటే శరీరానికి కావాల్సిన శక్తి లభిస్తుంది. తాటి ముంజలు, కొబ్బరి బొండాలు చాలా మంచివి... వేసవిలో ఎదురయ్యే అన్ని రకాల జీర్ణ సమస్యలను తాటి ముంజలు దూరం చేస్తాయి. డిహైడ్రేషన్ వల్ల వచ్చే తలనొప్పిని తగ్గించడంలో కొబ్బరి నీళ్లు ఎఫెక్టివ్ పనిచేస్తాయి. శరీరంలోని బ్యాక్టీరియాను బయటకు వంపి, యూరినరీ ఇన్ఫెక్షన్లు రాకుండా తోడ్పడుతాయి. జీర్ణశక్తిని పెంచుతుంది. శరీరానికి కావాల్సిన ఫైబర్ ను అందిస్తుంది. కీరదోస జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. ఊపిరితిత్తులు, కాలేయంలోని వేడిని నిరోధించడంలో కీరదోస సమర్థవంతంగా పనిచేస్తుంది. సమ్మర్లో కలిగే చర్మవ్యాదులను తగ్గిస్తుంది. మెదడును ఉత్సాహపరిచి, తలపై ఉష్ణోగ్రతను నిరోధిస్తుంది. నీరు నినక్కచ్చిగా ఈ కాలంలో మంచీనీరే దివ్యౌషధం. ఎండా కాలంలో వేడి అధికమైనప్పుడు శరీరం నుంచి చెమట రూపంలో నీరు ఎక్కువగా బయటకు వెళ్లిపోతుంది. కాబట్టి వడదెబ్బ, ఎండ నుంచి ఉప శమనం కోసం డీహాడ్రేషన్ రాకుండా మంచీనీటినే ఎక్కువగా తీసుకోవాలి. వీటితో పాటు నిమ్మరసం, చెరుకు రసం, మజ్జిగ తాగడం వల్ల ఎండలతో కలిగే ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందొచ్చు.ఎండవేడికి చిన్న పిల్లలు త్వరగా నీరసించిపోతారు తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే చిన్నారులను రక్షించుకోవచ్చు అనే విషయాలను డాక్టర్ గంప దీరజ్ కుమార్ యం డి జనరల్ మెడీసీన్ మా నాగారం ప్రతినిదికి తెలుపుతూ పసి పిల్లలకు వేసవి గండం ఉండనే ఉంటుంది. తగిన ఏర్పాట్లు చేసుకుంటే సులభంగానే ఉంటుంది. ముఖ్యంగా ఈ సీజన్లో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. దీంతో డీహైడ్రేషన్ ప్రభావం పొంచి ఉంటుంది. ఎండాకాలంలో చిన్న పిల్లల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పుడే వేసవి ప్రభావం తీవ్రంగా మొదలైంది. చిన్న పిల్లలు వారి విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటేనే ఎండ నుంచి రక్షించుకోవచ్చును. ఫంగస్, చెమట వల్ల చర్మ ఇన్ఫెక్షన్ల తీవ్రత కూడా ఎక్కువగానే ఉంటుంది. నీటి కొరత కారణంగా, జల కాలుష్యం కూడా ఎక్కువే. అతిసార తదితర రుగ్మతలు పసిపిల్లలకు సమస్యలు సృష్టిస్తాయి. చికెన్ ఫ్యాక్స్ కూడా వేసవిలోనే ఎక్కువ. ఎండ అధికంగా ఉండే సమయంలో పిల్లల్ని బయటికి పంపకూడదు. పలుచని కాటన్ దుస్తులే వేయాలి. తరచూ ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్ల, పండ్ల రసాలు, తదితర పదార్తాలు ఇస్తూ ఉండాలి. కాచి చల్లార్చిన నీళ్లే ఉత్తమం, చర్మం మీద వేడి పొక్కులు వస్తే కాలమైన్ లాంటి లోషన్లు వాడాలి. జ్వర, నీరసం, వికారం లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య నిపుణులను సంప్రదించాలి.

**డాక్టర్ గంప దీరజ్ కుమార్, యండి జనరల్ మెడీసీన్**

## కొత్త అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

కరీంనగర్ బ్యూరో, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి )
కరీంనగర్ జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా డి. శ్రీనివాస్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు రేరాలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆయనను ఇటీవల కరీంనగర్



అడిషనల్ కలెక్టర్ గా నియమించింది.ఈ నేపథ్యంలో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాను ఆయన మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా జిల్లాలోని రెవెన్యూ పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలపై పలు అంశాలు చర్చించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కె. మహేశ్వర్‌తో పాటు పలువురు రెవెన్యూ అధికారులు, కలెక్టరేట్ ఉద్యోగులు శ్రీనివాస్ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుధాకర్, కరీంనగర్ అర్బన్ తహసిల్దార్ నరేందర్, రాజేష్, కాళీచరణ్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు, కూలీలకు ఓఆర్ఎస్ పంపిణీ

ముస్తాబాద్, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి ):
రాష్ట్రంలో ఎండ తీవ్రతలు అధికంగా ఉన్న నేపథ్యంలో వడ్ల కొనుగోలు కేంద్రంలో రైతులు మరియు హమాలీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను



పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా రైతులు, కూలీలు మాత్రమే కాకుండా ప్రజలందరూ ఆరోగ్య పరంగా జాగ్రత్తలు పాటించాలని, వేసవి కాలంలో తగినంత నీరు తీసుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిగురు నరేష్, ఉప సర్పంచ్ ఏనగందుల సుమన్, గ్రామపంచాయతీ కార్యదర్శి నవ్య , వార్డు సభ్యులు యాదగిరి గౌడ్, వేముల నరేందర్, వెంకట్ రెడ్డి, ప్రశాంత్, కనకలక్ష్మి, ఆశా వర్కర్లు చల్ల పద్మారెడ్డి, బెరుగు రాజు, బుచ్చెల్లి తిరుపతి, చల్ల రాములు, పోచంపల్లి నరసయ్య, మల్లేశం మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభం

### రైతులకు ఊరటనిచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్

ముస్తాబాద్, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి):
ముస్తాబాద్ మండలంలో రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నరసయ్య ఘనంగా ప్రారంభించారు. గురువారం రోజున రామ్‌రెడ్డి పల్లి, గోపాల్‌పల్లి, గూడూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తూ రైతులకు సరైన మద్దతు ధర లభించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని నేరుగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా, వేగవంతంగా జరిగేలా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ఫరూక్ , ఆర్ఐ రఘు , కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏళ్ల బాల్‌రెడ్డి , మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వెల్ముల రామ్‌రెడ్డి , డైరెక్టర్ క్యారం రాజు , మాజీ సెస్ డైరెక్టర్ విజయ రామారావు , ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు తాళ్ల విజయ్ రెడ్డి , ఏపిఎం దశరథం , ఆయా గ్రామాల సర్పంచులు, ఉపసర్పంచులు, సీసీలు శోభన్ బాబు, పద్మ , కొనుగోలు కేంద్ర నిర్వాహకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.
రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని అధికారులు, నిర్వాహకులకు సూచించారు.

## ఇల్లంతకుంట అయ్యప్ప గుడి అభివృద్ధికి విరాళం అందజేత

ఇల్లంతకుంట ఏప్రిల్ 23(ప్రజా జ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలకేంద్రంలోని అయ్యప్ప గుడి అభివృద్ధి కొరకై రహీంఖాన్ పెట్ గ్రామానికి చెందిన కముటం శ్యామ్ సుందర్ తన తల్లి తండ్రులు శ్యామల మల్లయ్య



జ్ఞాపకార్థం ఆలయ అభివృద్ధికి 50118 రూపాయలు విరాళంగా ఆలయ కమిటీకి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో అయ్యప్ప ఆలయ కమిటీ సభ్యులు ఎర్రోజు గోపాల్ చారి, ఈదుల రవీందర్ రెడ్డి రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు బొల్లం పరశురామ్, మండల ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి జంగిటి శ్రీనివాస్ లు పాల్గొన్నారు

## రహదారులపై ధాన్యం ఆరబెట్టొద్దు - ప్రాణ భద్రతే ప్రధానం

వీణవంక, ఏప్రిల్ 23(ప్రజాజ్యోతి )
వీణవంక– శంకరపట్నం –జమ్మికుంట మండలాల పలు గ్రామాల్లో రైతులు ప్రధాన రహదారులపై ధాన్యం, మక్కలను ఆరబెట్టడం పెరుగుతున్నట్లు అధికారుల దృష్టికి వచ్చింది. వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ఈ పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారుతూ, అనేక ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు.ఇలాంటి కొనుగోలు కేంద్రాల్లోనే సురక్షితంగా ఆరబెట్టుకోవాలని సూచించారు. ప్రజల ప్రాణాలను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, రహదారులపై పంటలు ఆరబెట్టడం వలన ఇతరుల ప్రాణాలకు ముప్పు కలుగుతుందని





ముఖ్యంగా లలితపూర్ నుంచి వీణవంక,జమ్మికుంటకి వెళ్లే ప్రధాన రహదారులపై ఈ పరిస్థితి ఎక్కువగా కనిపిస్తున్నదని వారు తెలిపారు.తెలంగాణ ప్రభుత్వ రహదారుల శాఖకు చెందిన అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి. కళ్యాణ్ మాట్లాడుతూ, రహదారి మధ్యలో మరియు ఇరువైపులా పంటలను ఆరబెట్టడం వలన చర్యలు చట్ట విరుద్ధమని స్పష్టం చేస్తూ, రహదారిని ఆక్రమించి పంటలు ఆరబెట్టడం వల్ల ప్రమాదం జరిగితే సంబంధిత రైతే చట్టపరంగా బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.
రైతులు తమ ధాన్యం, మక్కలను ఐకేపీ (ఐకేపీ ) పేర్కొన్నారు.వీణవంక మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రైతులకు అవగాహన కల్పించి, రహదారులపై ఎట్టి పరిస్థితుల్లోనూ పంటలు ఆరబెట్టకుండా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు.రహదారులు ప్రయాణికుల కోసం మాత్రమే అని,పంటల కోసం కాదు అని, ఒక్క నిర్లక్ష్యం ప్రాణాపాయానికి దారితీస్తుందన్నారు .మన భద్రత – మన చేతుల్లోనే ఉంది అని ఈ సందర్భంగా జి కళ్యాణ్ తెలిపారు.

## ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్

వేములవాడ,ఏప్రిల్,23:ప్రజాజ్యోతి.
వేములవాడ రూరల్ మండలం ఎదురుగట్ల గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని లబ్ధిదారులకుశుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారికి నూతన వస్త్రాలు అందజేశారు ఈ కార్యక్రమంలోఎదురగట్ల సర్పం చ్ కదారి సంధ్యతిరుపతి ఎదురుగట్ల మాజీ సర్పంచ్ సోయినేని కరుణాకర్ వట్టేముల సర్పంచ్ రంగు వెంకటేష్ మున్నూరు కాపు జిల్లా నాయకుడు సోయినేని రాజు పటేల్ గ్రామస్తులు కాంగ్రెస్ నాయకులు పాలుగోన్నారు



## గంభీరావుపేట మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం

### -కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులుహమీద్

గంభీరావుపేట ఏప్రిల్ 23 (ప్రజా జ్యోతి);
గంభీరావుపేట మండల కేంద్రంలో దోసెలగూడెం కాలనీకి చెందిన బరిగల దేవవ్వ ఇందిరమ్మ ఇంటిని పూర్తి నిర్మాణం చేసుకొని గృహప్రవేశం చేయడం జరిగింది, ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు హామీతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.
,ఈ సందర్భంగా హమీద్ మాట్లాడుతు , కాంగ్రెస్ పార్టీ నాయకులకుప్రజాప్రతినిధులకు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు, గ్రామ/పట్టణ ప్రజలకు అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. మనందరికీ ఎంతో పండుగ రోజు, ఎంతో సంతోషకరమైన రోజు. ఎంతో కాలంగా సొంతింటి కల కంటున్న నిరుపేదల కలను నిజం చేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇళ్ల' గృహ ప్రవేశ వేడుక మన గ్రామంలో జరుగుతుండటం చాలా గర్వకారణం.
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో, పేదల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేలా, ప్రతి పేద కుటుంబానికి ఒక శాశ్వత ఇంటిని అందించాలనే సంకల్పంతో ఈ పథకాన్ని ప్రజా పాలనలో అమలు చేస్తుందన్నారు.ఇందిరమ్మ ఇల్లు మంజూరైన వారు నాణ్యమైన ఇళ్లను నిర్మించుకున్నారు.
4 విడతల్లో బిల్లులు పనులు పూర్తయిన దశల వారీగా ప్రభుత్వం నిధులను నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిందన్నారు.ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను ప్రభుత్వం ఉచితంగా లబ్ధిదారులకు అందించిందని హమీద్ అన్నారు. ఎట్టి శుభకార్యానికి విచ్చేసిన కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం చేసుకుంటున్న వారు కాంగ్రెస్ పార్టీ



గురువారం ఇల్లు నిర్మించుకున్న వారు గృహప్రవేశం చేయడంలో ఒక కన్నుల పండుగగా ఆనందంతో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.,
అలాగే ఇల్లు లేని నిరుపేదలైన వారికి ఇళ్లను మంజూరు చేయడంలో సహకరించిన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గారికి, సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ గారికి జిల్లా ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి పేర్లు పేరుపేరునా కృతజ్ఞతలు ధన్యవాదములు తెలిపారు, నాయకులను శాలువాతో సత్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు,
ఇట్టి శుభకార్యాంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు లక్కం నాంపెల్లి, అక్కపల్లి బాలయ్య , వేశాల వెంకటి పార్టీ సోషల్ మీడియా శనిగరపు శంకర్, పార్టీ జిల్లా నాయకులు మల్యాల రాజ్వీర్, ఏఎంసి డైరెక్టర్ ఏడబోయిన ప్రభాకర్, పార్టీ సీనియర్ నాయకులు బంగ్లా రాజు గౌడ్ యువ నాయకులు దేశెట్టి శేఖర్ పెద్దవేని మల్లయ్య గంధ్యాడపు శంకర్ మరియు తదీతరులు పాల్గొన్నారు.

## కోనరావుపేటలో చల్మెడ పుట్టినరోజు వేడుకలు...

### కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్న బిఆర్ఎస్ నాయకులు...

కొనరావుపేట, ఏప్రిల్.23(ప్రజాజ్యోతి)
కోనరావుపేట మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు, పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ఆయన పార్టీ అభివృద్ధికి ప్రజాసేవకు చేసిన కృషిని కొనియాడారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎల్లప్పుడూ ముందుండే నాయకుడిగా ఆయనను ప్రశంసించారు. అనంతరం బిఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య, మాజీ ఎంపీపీ ఎదురుగట్ల చంద్రయ్య గౌడ్, సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి , సర్పంచ్ మల్లేశం,అగ్రహారం ఆంజనేయస్వామి




దేవస్థానం మాజీ డైరెక్టర్ సిద్ధంశెట్టి శ్రీనివాస్ గుప్తా, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిపేట పాఠశాలలో" ప్రపంచ పుస్తక దినోత్సవం"

ఎల్లారెడ్డిపేట ఏప్రిల్ 23( ప్రజా జ్యోతి )
ఎల్లారెడ్డిపేట మండలంలోని కేంద్రంలో ప్రభుత్వ పాఠశాల లో" ప్రపంచ పుస్తక దినోత్సవం వేడుకలు "ఘనంగా నిర్వహించారుమరియు పుస్తకాల ప్రాముఖ్యతను తెలియజేయడమే లక్ష్యంగా పాఠశాల యజమాని ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. పుస్తక ప్రదర్శన పాఠశాల ప్రధానంలో ఏర్పాటు చేసి పుస్తక ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది ఇందులో కథల పుస్తకాలు, విజ్ఞాన శ్లోకాలు ,ప్రముఖుల జీవిత చరిత్రలు, వైజ్ఞానిక గ్రంథాలను ప్రదర్శించారు. ప్రతి పుస్తకంలో మానవునికి మూడవ నేత్రంగా



అభిమానించారు. తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులచేత పుస్తక పఠన చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మనోహరాచారి తెలుగు , హిందీ పాఠ్య ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.



## హరిహర క్షేత్రంలో గురుపూజ మహోత్సవం

చొప్పదండి, ఏప్రిల్ 23 (ప్రజాజ్యోతి):
చొప్పదండి హరిహర క్షేత్రం లో ఈ నెల 26న పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధన, గురుపూజ మహోత్సవము జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం 8:15 గం.నుండి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి, రమ సత్యనారాయణ స్వామి, భక్తాంజనేయ స్వామి వార్లకు పంచామృతంతో అభిషేకము నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఉదయం 9:30 గం.నుండి పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గురుపూజ మహోత్సవము, ఉదయం 10:00 గం.నుండి హోమములు, మధ్యాహ్నం 1:15 గం.కు అన్న ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. భక్తులు అందరూ పాల్గొని స్వామి వార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

## ప్రజల సమస్యపై వెంటనే స్పందించిన సర్పంచ్...

### తెర్లుమద్ది లో డ్రైనేజీ సమస్యకు ముగింపు

ముస్తాబాద్, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి ):
ముస్తాబాద్ మండలం తెర్లుమద్ది గ్రామంలోని విశ్వ బ్రాహ్మణ వార్డులో ఎన్నాళ్లుగానో కొనసాగుతున్న డ్రైనేజీ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్ మరియు పాలకవర్గం గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్నట్టు ఈ చర్య ద్వారా స్పష్టమైంది.
కాలనీ వాసులు తమ సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకురాగానే



వెంటనే స్పందించిన పాలకవర్గం సభ్యులు, పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టారు. దాదాపు 150 మీటర్ల మేర ఉన్న డ్రైనేజీ సమస్యను సక్రమంగా పరిష్కరించి, కాలనీకి ఉపశమనం కలిగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బైతి దుర్గమ్మ, ఉప సర్పంచ్ మామిండ్ల కానుకవ్వ, కార్యదర్శి సౌజన్య, వార్డ్ సభ్యులు బద్ధ రాములు, కొమ్మెట రాజు, అంతడుపుల దేవయ్య, కొమ్మెట రాజలింగం, కొండం విష్ణు, గోక దివ్య–స్వామి పాల్గొన్నారు.
దీర్ఘకాలంగా ఇబ్బంది పెడుతున్న సమస్యను వేగంగా పరిష్కరించడంపై గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తూ, స్థానిక పాలకవర్గంపై విశ్వాసం మరింత పెరిగిందని పేర్కొన్నారు.

## గూడూరులో ఐకెపి సెంటర్ ప్రారంభం

ముస్తాబాద్, ఏప్రిల్ 23 ( ప్రజా జ్యోతి ):
ముస్తాబాద్ మండలంలోని గూడూరు గ్రామంలో ఐకెపి సెంటర్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముస్తాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ తలారి రాణి నరసయ్య హాజరయ్యారు. అలాగే కాంగ్రెస్ పార్టీ ముస్తాబాద్ మండల అధ్యక్షులు ఏల్ల బాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.
ఈ కార్యక్రమంలో గూడూరు సర్పంచ్ చీటీ సునీత వెంకట నర్సింగారావు , ముస్తాబాద్ ఎమ్మార్వో మరియు ఆర్ఐ , సిఏ పద్మ , ముస్తాబాద్ మేజర్ గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ తాళ్ల విజయ్ , మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ , గూడూరు గ్రామ శాఖ అధ్యక్షులు చాకలి



బాబు పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరు గ్రామ వార్డ్ సభ్యులు కాసులవాడ శీను, పుల్లూరి సంతోష్, వంగూరి లావణ్య, హమాలీ సంఘం అధ్యక్షులు పుల్లూరి కిషన్, గ్రామ రైతులు, యువ నాయకులు వంగూరి దిలీప్, కాసులవాడ శ్రీకాంత్, మహేష్, మధు, వెంకటేష్, నాంపల్లి వెంకటేష్ తదితరులు హాజరయ్యారు.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రైతులకు మద్దతుగా ఐకెపి సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని, రైతులు తమ పంటలను సులభంగా విక్రయించుకునేలా ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

## భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దీక్ష స్వీకార కార్యక్రమం

ఇల్లంతకుంట ఏప్రిల్ 23(ప్రజా జ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంత కుంట మండలంలోని రహీంఖాన్ పేట్ మోడల్ స్కూల్ లో గురువారం రోజున భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ దీక్ష స్వీకార కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ జి. గంగాధర్, స్కౌట్ మాస్టర్స్ ఠాగూర్ గైడ్ కెప్టెన్ జిష సమక్షంలో 16 మంది స్కౌట్స్ 16 మంది గైడ్స్ దీక్ష స్వీకారం చేయడం జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ స్కౌట్స్ అండ్ గైడ్స్ యొక్క



ముఖ్య ఉద్దేశం విద్యార్థినీ విద్యార్థులలో దేశభక్తి, క్రమశిక్షణ, పర్యావరణ పరిరక్షణ, సమాజ సేవ పెంపొందించుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గంగాధర్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## నాగారం అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం...

కొనరావుపేట, ఏప్రిల్.23(ప్రజాజ్యోతి)
కొనరావుపేట మండలం నాగారం గ్రామంలో ని అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు అంగన్వాడి టీచర్ తీగల అంజలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ అప్పాల నాగభూషణం, అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పిల్లల్లో అధిక స్క్రీన్ టైం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలను వివరించారు తల్లిదండ్రులు మరియు సమాజం కలిసి పిల్లల్లో ఆరోగ్యమైన డిజిటల్ అలవాట్లను పెంపొందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా భోజన సమయంలో మరియు నిద్రకు ముందు మొబైల్ వినియోగాన్ని నివారించాలని సూచించారు పిల్లల శారీరక మానసిక అభివృద్ధి కోసం తల్లితండ్రులు కథలు చెప్పడం పిల్లలతో మాటలాడటం వంటి చర్యలను ప్రోత్సహించాలని అలాగే చిన్నారుల ఆరోగ్యం పోషకాహారం పై అవగాహన కల్పించారు, అంగన్వాడి కేంద్రం ద్వారా అందిస్తున్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు, అనంతరం పోషణ పక్వాడ్ కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కీర్తన,వార్డు సభ్యులు ప్రైమరి ప్రధానోపాధ్యాయురాలు, ఆయామ్మ, తల్లులు తదితరులు పాల్గొన్నారు.



### మహిళల అక్రమ రవాణా నివారణ
# ప్రతి ఒక్కరి బాధ్యత: సీడీపీఓ మెహరున్నిసా బేగం

**- అవగాహనా పెంచుకోవడం ద్వారా సాధ్యం అవుతుంది - ప్రజ్వల కో-ఆర్డినేటర్ సురేష్ కుమార్**




**సత్తుపల్లి ఏప్రిల్23(ప్రజా జ్యోతి)** ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, మహిళా శిషు సంక్షేమ శాఖ సత్తుపల్లి , ఖమ్మం జిల్లా ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్స్ కి మానవ అక్రమ రవాణా పై రెండు రోజుల శిక్షణ ను స్థానిక రైతు వేదిక కొత్తూరు సత్తుపల్లి మండలం నందు నిర్వహించినారు. ఈ సందర్భంగా సీడీపీఓ మెహరున్నిసా బేగం శిక్షణ కార్యక్రమం ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించినారు. అనంతరం సిడిపిఓ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచం లోనే మూడవ అతి పెద్ద నేరంగా ఉంది, సమాజం లో అన్ని వర్గాల ప్రజలతో మంచి సంబంధాలను కలిగి ఉన్న అంగన్వాడీ టీచర్స్ అందరికి అవగాహనా కల్పించాలని, ముఖ్యంగా యుక్త వయసు బాలికలు ప్రేమ పెళ్లి, ఫోన్ మోజులో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. జీవితం పై ఎలాంటి అవగాహనా లేక వేరే ప్రాంతాలకు పారిపోవడం, చివరికి మోసపోయి వ్యభిచార గృహాలకు అమ్మబడుతున్నారు. అక్కడ ఎన్నో బాధలను అనుభవించి, వ్యాధులబారిన పడి చివరికి చనిపోతున్నారు. కాబట్టి వారికి ఈ సమస్యలపై అవగాహనా కల్పించాలి అని అన్నారు. ఏవైన ఆపద, సమస్యలు ఉన్నట్లు గ్రహిస్తే వెంటనే సంబంధిత అధికారులను గాని, టోల్ ఫ్రీ నంబర్స్ 100, 1098, 1930 లను సంప్రదించాలి అని సూచించారు.

**సురేష్ కుమార్ ప్రజ్వల కో-ఆర్డినేటర్**

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఆడపిల్లల మహిళల రక్షణ కొరకు స్థాపించబడింది. పద్మశ్రీ డాక్టర్. సునీత కృష్ణన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు 32,500 మంది అమ్మాయిలను చిన్న పిల్లలను కాపాడి పునరావాసం కల్పించడం జరిగింది . ఇందులో పిల్లలు, మహిళల సమస్యలను గుర్తించి సంబంధిత అధికారుల ద్వారా రిపోర్ట్ చేయడం, ఈ శిక్షణలో అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్, లైంగిక వ్యాపారం లో మోసపోతున్న అమ్మాయిల పరిస్థితులు ఎలా ఉన్నాయ్ లాంటి వాటిని లఘు చిత్రల ద్వారా, పవర్ పాయింట్ ప్రెసెంటేషన్, గ్రూప్ చర్చల ద్వారా నిర్వహించడం జరుగుతుందని,మనం అందరం అప్రమతంగా ఉండి సమాజాన్ని చైతన్యం చేస్తే,అక్రమ రవాణాను నిరోదించ వచ్చు అని అన్నారు. అదే విదంగా పాఠశాల, గ్రామ స్థాయిలో సమాజ జాగృతి సంఘాలను విద్యార్థి జాగృతి సంఘాలను ఏర్పాటు చేసి,రిపోర్ట్ చేయడం ద్వారా అక్రమ రవాణా నివారించవచ్చు అని అన్నారు. అక్రమ రవాణాకు లేదా సైబర్ ట్రాఫికింగ్ కి గురి అయినప్పుడు భయపడకుండా దగ్గర్లోని పోలీస్ స్టేషన్ లో గాని లేదా 100, 1930 టోల్ ఫ్రీ నంబర్స్ ను సంప్రదించాలి అని సూచించారు. ఈ కార్యక్రమం లో ప్రజ్వల అసిస్టెంట్ కోఆర్డినేటర్ భూపాల్ నారిమళ్ళ సూపర్ వైజర్ సుజాత, మహాలక్ష్మి, గంగాజాలం, రమాదేవి రజిని మరియు సత్తుపల్లి మండలం లోని అంగన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

### చింతకాని గ్రామ పంచాయతీ
# నందు 8వ పోషణ పక్వాడ కార్యక్రమం



**చింతకాని ఏప్రిల్ 23ప్రజా జ్యోతి ప్రతినిధి :** చింతకాని గ్రామ పంచాయతీ కార్యలయంలో 8వ పోషణ్ పక్వాడ కార్యక్రమం లో భాగంగా సామూహిక సీమంతాల వేడుక చింతకాని సర్పంచ్ కిలారు మనోహర్,అధ్యక్షతన ఘనంగా నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమం లో సర్పంచ్ మాట్లాడుతు పోషణ్ పఖ్వాడా అనేది గర్భిణీలు, బాలింతలు మరియు పిల్లలలో పోషకాహార లోపాన్ని అరికట్టడానికి, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ఏటా 15 రోజుల పాటు నిర్వహించే ప్రత్యేక పోషకాహార కార్యక్రమం. ఈ 8వ ఎడిషన్ (2026) ఏప్రిల్ 9 నుండి 23 వరకు, చిరుధాన్యాల వినియోగం, పరిశుభ్రత మరియు 1000 రోజుల పోషణపై దృష్టి సారిస్తూ అంగన్వాడీ కేంద్రాల ద్వారా దేశవ్యాప్తంగా జరుగుతోంది అని చెప్పడం జరిగింది.అధికారులు మాట్లాడుతు సీమంతం అనేది దక్షిణ భారతదేశంలోని ఒక సాంప్రదాయ వైదిక వేడుక మరియు శిశు జనన వేడుక. సాధారణంగా 7వ లేదా 9వ నెలలో గర్భిణీ స్త్రీలకు, ఆరోగ్యకరమైన ప్రసవం మరియు తల్లి, బిడ్డ ఇద్దరి క్షేమం కోసందీనిని నిర్వహిస్తారు . పుట్టబోయే బిడ్డకు ఆశీస్సులు అందించి, రక్షణ కల్పించడం కోసం గర్భిణీ స్రీలకు సీమాంతం చేస్తారని అదే విధంగా 20 సంవత్సరాల సర్వీస్ లో గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ఇలాంటి కార్యక్రమాలు చూడలేదు అని ఒక ఇంట్లో ఎలా చేస్తారో ఒక కనుల పండగ లాగా చేసారు అని చెప్పడం జరిగింది.ఈ కార్యక్రమంనకు చింతకాని ఎంపీడీఓ చుంచు శ్రీనివాస రావు, తహసీల్దార్ బాబ్జి ప్రసాద్ , చింతకాని ఆయుష్ డాక్టర్ శ్రీ దేవి ఐసిడియస్ ,సిడిపిఒ కమల ప్రియ ఐసిడియస్,సూపర్ వైజర్ విజయ లక్ష్మి ,ఎస్ఐ వీరేందర్ , అంగనవాడి టీచర్స్, ఆశా వర్కర్స్, వార్డు మెంబర్స్, గ్రామ పంచాయతీ సింబంది మరియు గ్రామ ప్రజలు పాల్గొనడం జరిగింది.

### నాగులవంచ బాలుర
# వసతి హాస్టల్లో సంక్షేమ వారోత్సవాలు



**చింతకాని ఏప్రిల్ 23ప్రజా జ్యోతి ప్రతినిధి** :షెడ్యూల్డ్ కులాల సమీకృత బాలుర వసతి గృహం నాగులవంచలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన "ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక "లో భాగంగా సంక్షేమ వారోత్సవాలు వసతి గృహ సంక్షేమాధికారి కొత్త వెంకటేశ్వరరావు వసతి గృహంలో ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర అధికారులు మరియు జిల్లా అధికారుల ఆదేశాల మేరకు వసతి గృహంలో డాక్టర్ బాబు జగ్జీవన్ రావ్ మరియు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతుల సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించినాము అదేవిధంగా సంక్షేమ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ప్లాస్టిక్ వల్ల అనర్థాలు అనే అంశంపై వ్యాసరచన పోటీ వక్తృత్వం, క్విజ్, చిత్రలేఖనం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఈరోజు తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి వారి సమక్షంలో విద్యార్థులకు ప్రైజులు, ప్రశంసా పాత్రలు అందించడమైనది అదేవిధంగా విద్యార్థులకు తల్లిదండ్రులు, గురువులు, పెద్దలపట్ల గౌరవం పెంపొందించుటకు అధికారుల ఆదేశాల మేరకు తల్లిదండ్రులకు " పాద పూజా కార్యక్రమం నిర్వహించడం మైనది ఈ సమావేశంలో వసతి గృహంలో ఆల్రౌండర్ గా నిలిచిన విద్యార్థి చిరంజీవి జి శేఖర్, ఎనిమిదవ తరగతి తల్లిదండ్రుల సమక్షంలో శాలువాతో సన్మానించనైనది అదేవిధంగా విద్యార్థులతో "ప్రతిజ్ఞ " చేయించనైనది ప్రభుత్వం కల్పిస్తున్న ఈ వసతి సౌకర్యాలను ఉపయోగించుకొని తల్లిదండ్రులకు, గురువులకు, పెద్దలను, సంక్షేమ అధికారుల ను గౌరవిస్తూ నిజాయితీ, క్రమశిక్షణ, వినయం, స్నేహభావంతో భవిష్యత్తులో ఉన్నతంగా ఎదుగుతానని సంక్షేమ అధికారి విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు ఈ కార్యక్రమంలో వసతి గృహ సంక్షేమ అధికారి కొత్త వెంకటేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు, ఏఎన్ఎంలు, వసతి గృహ సిబ్బంది వెంకటేశ్వర్లు, మహేందర్, జయసింహ, దిలీప్ పాల్గొన్నారు.

# పొంచి ఉన్న.. చల్లని ప్రమాదం?

**- అపరిశుభ్రనీటితో తయారైన ఐస్‌తోనే జ్యూస్ తయారీ?**

**- పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రెడీమేడ్ జ్యూస్ పాయింట్లు!**

**- నాణ్యతా ప్రమాణాలు హుష్ కాకి**

**- కొరవడిన ఫుడ్ సేఫ్టీ అధికారుల పర్యవేక్షణ?**






**ఇల్లందు, ప్రజాజ్యోతి 23, ప్రజాజ్యోతి:** వేసవికాలం వచ్చిందంటే చాలు చల్లని జ్యూస్ పాయింట్ల వద్ద ప్రజలు బారులు తిరుతారు. భానుడి ప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు చల్లగా ఉండే ఇష్టమైన జ్యూస్ ను తాగుతూ తాత్కాలికంగా సేద తిరుతుంటారు. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రజల అవసరాన్ని ఆసరాగా చేసుకుంటూ ఫ్రూట్ జ్యూస్ తయారీని ఇస్తానుసారంగా చేస్తూ నాణ్యతకు తిలోదకాలు ఇస్తున్నారు. వేసవి వచ్చిందంటే చాలు పట్టణంతో పాటు గ్రామాల్లో జ్యూస్ పాయింట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తూ ప్రజల ఆరోగ్యాన్ని జ్యూస్ రూపంలో క్షీణింపచేస్తూ ఇస్తానుసారంగా వ్యవహరిస్తున్నారనేది వాస్తవం. సహజంగా లభించే పండ్ల పేర్లతో ప్రచారం చేస్తూ వారి ఫ్లేవర్లతో తయారయ్యే ఫ్రూట్ జ్యూస్ లను తయారుచేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న వ్యవహారంపై "ప్రజాజ్యోతి" ప్రత్యేక కథనం. ముందుగా ఫ్రూట్ జ్యూస్ ను చల్లగా ఉండేందుకు వినియోగించే ఐస్ అపరిశుభ్ర నీటితో తయారు చేస్తున్నారు. సాధారణంగా తాగు నీటిని తాగే సమయంలో రూ.2 వెచ్చించి మనం మినరల్ వాటర్ నే తాగుతున్నాము. కానీ అపరిశుభ్ర నీటితో తయారైన ఐస్ ను ఉపయోగించి తయారుచేసిన జ్యూస్ ను తాగేస్తుండడంతో అనేక రోగాలు రావచ్చు. ఇక ఫ్రూట్ జ్యూస్ లు తియ్యగా, రుచిగా ఉండేందుకు వినియోగించే చాక్రీన్, ఎసెన్స్ వంటివి కాలం చెల్లినవి కావ డం, నాణ్యత లేకపోవడం విశేషం. అంతేకాదు ఫ్రూట్ సలాడ్ పేరుతో విక్రయిస్తున్న జ్యూస్ లలో వినియోగించే పండ్లు కాలం చెల్లినవే. జ్యూస్ మరింత టేస్ట్ గా ఉండేందుకు ఫ్రూట్ జ్యూస్ లకు సంబంధించిన ఫ్లేవర్స్ రూపంలోని ప్రమాదకర రసాయనాలను వినియోగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల కొన్ని ప్రముఖ శీతల పానీయాల తయారీల్లోనూ నాణ్యతా ప్రమాణాలను పాటించడం లేదనే విషయాన్ని ప్రచార మాధ్యమాల ద్వారా తెలుసు కున్న మనం సహజంగా తయారు చేస్తున్నారనుకుంటున్న జ్యూస్ లు చల్లగా ప్రజల ప్రాణాలకే ప్రమాదం ఏర్పడే అవకాశం లేకపోలేదు. ఇకపోతే ఈ తంతు మొత్తాన్ని అరికట్టాల్సిన సంబంధిత ఆహార భద్రతా అధికారులు వీటిపై కన్నేసిన పాపాన పోలేదనేది సత్యం. ఫ్రూట్ జ్యూస్ తయారీల పేరుతో ప్రజల ప్రాణాలను హరించే విధంగా తయారీదారుల వ్యవహారం 3 జ్యూస్ లు... 6 ఫ్రూట్ సలాడ్ లుగా కొనసాగుతుందనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదనే చెప్పొచ్చు. చిన్న పిల్లల నుండి పెద్ద వాళ్ళ వరకూ ఇష్టంగా తినే పుల్ల ఐస్ క్రీమ్ ల నుండి కప్పు ఐస్ క్రీమ్ ల తయారు సైతం ఈ అపరిశుభ్ర నీటితోనే తయారు చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఐస్ క్రీమ్ తయారికి వినియోగించే రసాయనాలు, ఎసెన్స్, చాక్రిన్ వంటి పదార్థాలలో నాణ్యతను పాటించడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐస్ క్రీమ్ తయారీ కేంద్రాల్లో వినియోగించే నీటిని, పదార్థాలను ఆహార భద్రత అధికారులు తనిఖీలు చేయడం లేదనేది తేటతెల్లమవుతుంది. ఇప్పటికైనా ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఐస్ క్రీమ్, ఫ్రూట్ జ్యూస్ తయారీలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. లేనిపక్షంలో ఇన్ ఫెక్షన్ తో ప్రజా ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశం లేకపోలేదు. ఇంత జరుగుతున్నా కానీ సంబందిత ఫుడ్ సేఫ్టీ అధికారులు జ్యూస్ స్టాల్స్ తో పాటు ఇష్టనుసారంగా నాణ్యత ప్రమాణాలు పాటించని రెస్టారెంట్ లపై తనిఖీలు చేయకపోవడం వెనుక మామూళ్లు అందుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మామూళ్ల మత్తును వదిలి ప్రజల ఆరోగ్యాల పట్ల శ్రద్ధ వహించి ఇలా ప్రజలను రోగాల పాలు చేసే జ్యూస్ స్టాల్స్, రెస్టారెంట్ లపై తనిఖీలు నిర్వహించి శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

### విగ్రహ ప్రతిష్టకి హాజరైన మాజీ
# జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్ రాజు



**చింతకాని ఏప్రిల్ 23ప్రజా జ్యోతి ప్రతినిధి** :మండల పరిధిలోని నేరడ గ్రామంలో సీతారామ చంద్ర స్వామి వేణుగోపాలస్వామి వెంకటేశ్వర్ల స్వామి వాళ్ళ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి ఖమ్మం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ లింగాల కమల్ రాజు, హాజరై పూజా కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు ఈ కార్యక్రమంలో చింతకాని మండలం మాజీ వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, మండల కార్యదర్శి వెంకట రామారావు, మాజీ మండల రైతు కన్వీనర్ పొనుగోటి రత్నాకర్, మండల యువజన విభాగం అధ్యక్షులు పిన్నెల్లి శ్రీనివాస్ మండల నాయకులు గడ్డం శ్రీను గారు ఆలస్యం శంకర్,చాట్ల సురేష్ ,ఆలస్యం మధు తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ ఒలింపియాడ్ పరీక్షలలో
# నారాయణ విద్యార్థుల అద్భుత ప్రతిభ




**సత్తుపల్లి ఏప్రిల్23(ప్రజా జ్యోతి)** పట్టణంలోని కాకర్లపల్లి రోడ్డులో గల నారాయణ విద్యార్థులు ఒలంపియాడ్‌లో విశేష ప్రతిభ కనబరిచి, దేశంలోనే తమ సత్తాను చాటిన ఘనత చోటు చేసుకుంది.హెచ్. ఝాన్సీ శ్రీ గ్రేడ్ 1 -- ఆల్ ఇండియా 1వ ర్యాంక్,టి. దీక్షిత ఆల్ ఇండియా 5వ ర్యాంక్ఆర్. యోగిత లక్ష్మి ఆల్ ఇండియా 3వ ర్యాంక్పి. శ్రీనిధి (8వ తరగతి) -- ఆల్ ఇండియా 4వ ర్యాంక్సి స్నాప్స్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఐ.ఎస్.ఎస్.ఓ,ఇంటెక్స్ పరీక్షలలో ఈ విద్యార్థులు క్యాంపస్ స్థాయిలోనే కాకుండా దేశవ్యాప్తంగా 1, 2, 3, 4 ర్యాంకులు సాధించి అద్భుత ప్రతిభను ప్రదర్శించారు.ఈ సందర్భంగా హైదరాబాదులోని రవీంద్రభారతి వేదికపై నిర్వహించిన కార్యక్రమంలో, సి స్నాప్స్ సంస్థ ప్రతినిధులు, తెలంగాణ నారాయణ విద్యాసంస్థల జి.ఎం గోపాల్ రెడ్డి చేత విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, గోల్డ్ మెడల్స్, బహుమతులు అందజేసి ఘనంగా సన్మానించారు.మొదటి స్థానం సాధించిన హెచ్. ఝాన్సీ శ్రీకి ల్యాప్‌టాప్‌ను బహుమతిగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ విద్యాసంస్థల ఖమ్మం జోన్‌కు చెందిన ఏజీఎం ప్రిన్సిపాల్, కోఆర్డినేటర్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ప్రజలకు నాణ్యమైన
# తినుబండారాలను అందించాలి: మట్టా, మువ్వా




**సత్తుపల్లి ఏప్రిల్23(ప్రజా జ్యోతి)** ప్రజలకు నాణ్యమైన స్వీట్స్, పుట్టినరోజు కేకులు, తినుబండారాలు అందించాలని సీనియర్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వ విజయ్ బాబులు అన్నారు. పట్టణంలోని పాత సెంటర్లో సునీల్ శెట్టి ,వందన దంపతులచే దర్శన్ పర్యవేక్షణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్.ఎల్.వి బెంగుళూర్ స్వీట్స్ , బేకరీనీ ప్రారంభించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పరిశుభ్రమైన ముడి సరుకులను ఉపయోగించి,రుచికరమైన తీపి పదార్థాలు, రొట్టెలను అనుభవజ్ఞులైన వంట మేస్త్రీలతో తయారు చేయించి, రుచికరంగా తయారు చేయించి సరసమైన ధరలకు ప్రజలకు అందించి,అందరి మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రెహానా కమల్, వైస్ చైర్పర్సన్ బొంతు సుమలత, చిన్నారులు మనస్విని, తనస్విని, బేతుపల్లి సర్పంచ్ దొడ్డా రాజేంద్రప్రసాద్, చల్లగుండ్ల కిట్టు, బాల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ షిర్డీసాయిబాబా మందిరాలలో ప్రత్యేక పూజలు

**- అభిషేకాలు, అన్నదానాలలో భారీగా పాల్గొన్న భక్తులు**




**అశ్వారావుపేట, ఏప్రిల్ 23 , ప్రజాజ్యోతి:** మండలం లోని షిర్డీ సాయిబాబా మందిరాలలో గురువారం పురష్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వినాయకపురం గ్రామంలో ఉన్న షిర్డీసాయిబాబా మందిరంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అశ్వారావుపేటలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో ఉన్న శ్రీ జ్ఞానసాయి మందిరంలో కొలువుదీరిన సాయినాథునికి మందిర అర్చకులు శుభం దీక్షిత్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటలకు బాబా మేలుకొలుపుతో ప్రారంభమైన పూజలు 5 గంటల 15 నిమిషాలకు కాకడహారతి 6 గంటలకు బాబాకు పంచామృత అభిషేకాలు నిర్వహించి పూలమాలలతో అలంకరించారు.ప్రత్యేకపూజలు, అష్టోత్తరం జరిపి భక్తులకు దర్శనానికి అనుమతించారు. మధ్యాహ్నహారతి అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమానికి భక్తులు భారీగా తరలివచ్చారు. రాత్రి 7 గంటలకు పల్లకి సేవచేసి, 8:30గంటలకు బాబాపవళింపు సేవను (శేజ్ హారతి) కొనసాగించారు. ఈ కార్యక్రమంలో శ్రీ షిర్డీసాయి సేవ సమితి సభ్యులు, పంబిహరిబాబు, మంగదొడ్డి మురళీకృష్ణ, ముళ్ళపూడి సూరిబాబు, శ్రీదేవి,రమాదేవి, లక్కిరెడ్డి కృష్ణారెడ్డి,గౌరీ, స్వప్న, పావని, తదితరులు పాల్గొన్నారు.

# ఐటీడీఏ పీవో రాహుల్‌కు ఘన సన్మానం



**భద్రాచలం, ఏప్రిల్ 23, ప్రజా జ్యోతి:** ఇటీవల "ఆదివాసి వికాస్ రత్న" బిరుదు అందుకున్న ఐటీడీఏ పీవో, అడిషనల్ ఏజెంట్ టు గవర్నమెంట్ రాహుల్‌ను భద్రాచలం బార్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సన్మానించారు. గిరిజన ఉత్పత్తులను ప్రజలకు చేరవేసే లక్ష్యంతో "భద్రగిరి మార్ట్"ను గవర్నర్ చేతుల మీదుగా ప్రారంభించి అందు బాటులోకి తీసుకువచ్చినందుకు రాహుల్‌ను ప్రత్యేకంగా అభినందించారు. గిరిజన అభివృద్ధికి ఆయన చేస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సున్నం రమేష్, కోశాధికారి రాము, సీనియర్ న్యాయవాదులు ప్రసాద్, మంత్రిప్రగడ గణపతి, పలివెల నరసింహారావు, పడిశిరి శ్రీనివాస్, శ్రీమన్నారాయణ, రవి, దానిసరి నరసింహమూర్తి, వలవల సురేష్ కుమార్, కొరసా నరేష్, ఉజ్జగిరి రవితేజ, రామ్మోహన్ రావు, దాట్ల సంధ్య, అంజలి తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మల నాగేశ్వర రావును కలిసిన సోయం బాపూరావు

### జొన్నల కొనుగోలు ప్రారంభిం చాలని వినతి

ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 23, (ప్రజా జ్యోతి) రాష్ట్ర వ్యవసాయ, మార్కెటిం గ్, సహకార శాఖ మంత్రి తు మ్మల నాగేశ్వరరావును మాజీ ఎంపీ, రాజ్ గోండ్ సేవా సమి తి రాష్ట్ర అధ్యక్షులు సోయం బాపూరావు గురువారం హైద రాబాద్‌లోని ఆయన నివాసం లో మర్యాదపూర్వకంగా కలి శారు. ఉమ్మడి



ఆదిలాబాద్ జిల్లాలోని రైతాంగ సమస్య లు, గిరిజన ప్రాంతాల అభివృ ద్ధిపై మంత్రితో సుదీర్ఘంగా చ ర్చించారు.ఈ సందర్భంగా సో యం బాపూరావు మాట్లాడు తూ రాష్ట్ర వ్యాప్తంగా జొన్నల కొనుగోలు ప్రక్రియను తక్షణమే ప్రారంభించి రైతులకు అండ గా నిలవాలని మంత్రిని కోరా రు. ముఖ్యంగా వెనుకబడిన బోథ్ నియోజకవర్గంలో ఆది వాసీల జనాభా అధికంగా ఉం దని, ఆ ప్రాంత అభివృద్ధికి ప్ర త్యేక నిధులు కేటాయించాల్సి న అవసరం ఉందని విన్నవిం చారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, అకాల వర్షాలు, ఇతర సమ స్యలతో నష్టపోయిన రైతుల ను ఆదుకోవాలని కోరారు.

సోయం బాపూరావు విజ్ఞప్తిపై మంత్రి తుమ్మల నాగేశ్వర రావు సానుకూలంగా స్పం దించారు. రైతులకు ఇబ్బంది కలగకుండా జొన్నల కొనుగో లుపై తగిన చర్యలు తీసుకుం టామని, గిరిజన ప్రాంతాల అ భివృద్ధికి నిధుల మంజూరుపై హామీ ఇచ్చారని బాపూరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డీసీసీబీ చైర్మన్ అడ్డి భో జారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వికారాబాద్‌లో జనగణన శిక్షణ

### డిజిటల్ విధానంతో సమర్థ నిర్వహణపై కలెక్టర్ దృష్టి

వికారాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 23(ప్రజా జ్యోతి): జనగణన–2027 తొలి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఎన్యుమరే




టర్లు, సూపర్వైజర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇండ్ల గణన, మ్యాపింగ్ వంటి పనులను ఖచ్చితత్వంతో చేపట్టాలని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. దేశంలో తొలిసారిగా జనగ ణనను పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహిస్తున్న నేపథ్యంలో, యాప్ ద్వారా కుటుంబ వివరాల నమోదు సక్రమంగా జరగాలని పేర్కొన్నారు. యాప్ నిర్వహణలో ఎలాంటి సాంకేతిక సమస్యలు వచ్చినా వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో జాగ్రత్తగా పనిచేసి, పొరపాట్లకు తావు లేకుండా ఇండ్ల గణన పూర్తి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ విక్రమ్ సింహ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ కార్మికులపై కక్షసాధింపు ధోరణి

హైదరాబాద్,ఏప్రిల్23(ప్రజాజ్యోతి): ఆర్టీసీ సంస్థను ప్రైవేట్ పరం చేసే దిశగా కుట్రలు చేస్తున్నదని మాజీమంత్రి శ్రీనివాస్‌యాదవ్ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదని నిలదీశారు. బీఆర్ఎస్ హయంలో ఆర్టీసీ కార్మికుల సమస్యలపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకొని వాటిని పరిష్కరించే దిశగా ఆ ఫైల్‌ను గవర్నర్ దగ్గరకు పంపించామని, తర్వాత ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయిందని తెలిపారు. ఆర్టీసీ కార్మికులకు టెంట్ సామాన్లు ఇవ్వరాదని వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణ పరిధిలో టెంట్ హౌస్ నిర్వాహకులను పోలీసులు నోటీసులు ఇవ్వడంపై డీజీపీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ వెళ్లిన రేవంత్ రెడ్డి ఎన్డీయే కూటమి నేతలతో బ్రేక్ ఫాస్ట్ చేస్తుంటే తెలంగాణలో నిజమైన కాంగ్రెస్ నాయకులకు సోయి లేదా అంటూ ప్రశ్నించారు. కాళేశ్వరం కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.మేధా పర్వతం లాంటి కేసీఆర్‌పై ఉమ్మేస్తే తిరిగి కాంగ్రెస్ నాయకుల పైనే పడిందని విమర్శించారు. కేసీఆర్ నాయకత్వంలో నీళ్లు , నిధులు, నియామకాల ట్యాగ్ లైన్ తో తెలంగాణ ఉద్యమాన్ని నడిపి తెలంగాణ సాధించిన నాయకుడు కేసీఆర్‌అని పేర్కొన్నారు. వచ్చిన తెలంగాణలో రైతులు సంతోషంగా ఉండాలని ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కాళేశ్వరం నిర్మించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో ఒక బ్యారేజ్ మేడిగడ్డ . కాళేశ్వరం అంటే 100 కంపోనెట్లని, అందులో మేడిగడ్డ బ్యారేజ్ ఒకటని అన్నారు. మేడిగడ్డలో రెండు పిల్లర్లు కుంగిపోతే రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఇద్దరు కలిసి లక్ష కోట్ల అవినీతి అంటూ తమ పై దుష్ప్రచారం చేశారని ఆరోపించారు. మేడిగడ్డలో కుంగిన రెండు పిల్లర్లను రిపేర్ చేస్తామని ఎల్అండ్‌టీ ముందుకు వస్తే బెదిరించారని తెలిపారు . మేడిగడ్డ కుంగినప్పుడు ఆగమేఘాల మీద వచ్చిన ఎన్డీఎస్ఏ , ఎస్ఎల్‌బీసీ కుంగి 8 మంది చనిపోతే ఎందుకు రాలేదని ప్రశ్నించారు.

# ఉధృతం అవుతున్న ఆర్టీసీ ఉద్యోగుల సమ్మె

- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్న ప్రయాణికులు
- బస్సులు కోసం బారులు తీరుతున్న జనం
- ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వివిధ పార్టీ ల నాయకుల డిమాండ్
- సమస్యలు వెంటనే పరిష్క రించాలి
- అదిలాబాదులో ఆర్టీసీ కార్మికు ల ఆందోళన

ఆదిలాబాద్ బ్యూరో, ఎప్రిల్ 23, (ప్రజా జ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ కార్మి కులు, ఉద్యోగులు ఎదుర్కొం టున్న సమస్యలను తక్షనమే పరిష్కరిం చాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ కార్మికులు చేస్తు న్న సమ్మె రెండవ రోజుకు చే రుకుంది దీంతో ప్రయాణికులు ప్రజలు అనేక ఇక్కట్లకు గుర వుతున్నారు. తమ సమస్య లు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని ఆర్టీసీ కార్మి కులు హెచ్చరించడంతో ప్రజ లు,ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు సౌక ర్యం కల్పించడంతో మహిళ లు పెద్ద ఎత్తున ఇతర ప్రాం తాలకు ప్రయాణం చేయడం కోసం బస్టాండ్ లకు పరుగు లు తీస్తూ బస్సులు లేకపోవ డం వల్ల వెనక్కి మల్లుతున్నా రు. బస్సుల కోసం ఉదయం నుండి సాయంత్రం వరకు బ స్టాండ్ లో నిరీక్షించి బస్సులు రాకపోవ దంతో నిరీక్షించి వెన క్కి వెళ్ళిపోతున్నారు. దీంతో ప్రజలు వివిధ సమస్యలను ఎ దుర్కొంటున్నారు. ఉచిత బ స్సు సౌకర్యానికి అలవాటు పడ్డ మహిళలు తీవ్ర ఆందోళ న వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించడంతో ఇక సాఫీగా ఉచితంగా ప్రయాణం చేసిన మహిళలు ప్రభుత్వం కు శాపనార్థాలు పెడుతు న్నారు.





ఇంతకాలం ఉచితంగా ప్రయాణం చేసిన మహిళలు సమ్మె కారణంగా బస్సులు లేకపోవ దంతో ప్ర భుత్వాన్ని దూషిస్తున్నారు. ఆర్టీసీ కార్మికులు తమ ఆందో ళనను మరింత ఉధృతం చేశా రు. గురువారం రెండవ రోజు కు చేరుకోవ దంతో ఆర్టీసీ కార్మి కులు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నిర్మల్, ఆసిఫాబాద్, మంచిర్యాల కేంద్రాలలో పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. బస్సు డిపోల ఎదుట పెద్ద ఎ త్తున ధర్నా నిర్వహించారు. దీంతోపాటు పట్టణంలో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించి ప్ర ధాన కూడలి అయిన కలెక్టర్ చౌక్ లో పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. రోడ్డుపై బైఠా యించి తమ సమస్యలు పరి ష్కరించాలని డిమాండ్ చేశా రు. సమస్యలు పరిష్కరించే వరకు తమ ఆందోళన కొన సాగిస్తామని, తాము ఒక్కరు కూడా వీధులకు హాజరయ్యే ప్రసక్తే లేదని, సమ్మెను యధా విధిగా కొనసాగిస్తూనే ఉంటా మని, ప్రభుత్వం భే శరతు గా దిగివచ్చి తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చే శారు. లేనట్లయితే సమ్మెను, ఆందోళనను మరింత ఉధృ తం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం తమ సమ్మెను వి చ్ఛిన్నం చేసేందుకు ఎన్ని కుట్ర లు పన్నినా తాము వెనుకడు గు వేసేది లేదని, సమస్యలు పరిష్కరించే వరకు పోరా డు తూ ఉంటామని హెచ్చరించా రు. వరంగల్ ల్లో ఓ ఆర్టీసీ డ్రై వర్ ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకోవడం, ఆత్మ హత్యాయ త్నానికి పాల్పడ డంతో ఆర్టీసీ కార్మికులు మ రింత ఆందోళన ఉధృతం చే శారు. ప్రభుత్వం వెంటనే త మ సమస్యలపై స్పందించాల ని కోరారు. ఆర్టీసీ కార్మికులు ఆత్మహత్యలను ప్రభుత్వం ప్రే రేపించవ ద్దని, తక్షణమే సమ స్యలు పరిష్కరించాలని డి



మాండ్ చేశారు. ఆర్టీసీ కార్మికు లు చేపడుతున్న సమ్మేవల్ల ఉ మ్మడి ఆదిలాబాద్ జిల్లాలో దాదాపు 600 బస్సులకు పైగా డిపోలకే పరి మితమయ్యా యి. ఎటు కదల లేకపోతు న్నాయి. అయినప్పటికీ ప్ర త్యామ్నాయ మార్గాలకు ప్ర భుత్వం, ఆర్టీసీ అధికారులు ప్రయ త్నిస్తున్నప్పటికీ అవి స త్ఫలితాలను ఇవ్వలేకపోతు న్నాయి. ప్రయాణికుల రద్దీ కా రణంగా ఆర్టీసీ అధికారులు పోలీసు బందోబస్తుతో ఒక్కొ క్కటి బస్సులను విడుదల చే స్తున్నారు. అయినప్పటికీ ఆ బస్సులలో టికెట్లు ఎవరు కూ డా తీసుకోకుండా పురుషులు సైతం ఉచితంగా ప్రయాణిస్తు న్నారు. దీంతో టాప్ పై ఎక్కి గేటు పై వేలాడుతూ ప్రయాణి స్తున్నారు. ప్రయాణికులకు తగ్గట్టుగా బస్సులు లేకపోవ డం వల్ల ప్రజలు, మహిళలు అనేక ఇక్కట్లకు గురవుతు న్నారు.

# రైతులకు సకాలంలో చెల్లింపులు చేయాలి

### జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 23, (ప్రజా జ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేసి, సకాలంలో చెల్లింపులు జరిగేలా





చర్యలు తీసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఆదేశించారు. గురువారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరులో ములుకనూరు సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రానికి ఎన్ని గ్రామాల నుండి ధాన్యం వస్తోంది, టోకెన్ వ్యవస్థ అమలు ఎలా జరుగుతోంది, ధాన్యం నాణ్యతను ఎలా పరీక్షిస్తున్నారు వంటి అంశాలను కలెక్టర్ అధికారులు, నిర్వాహకులను అడిగి తెలుసు కున్నారు. కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచిం చారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి రైతుల వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, చెల్లింపులు త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాల వద్ద టార్పాలిన్లు, ప్యాడీ క్లీనర్లు వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం అదే ప్రాంగణంలో ఉన్న కాటన్ జిన్నింగ్ మిల్, ములుకనూరు రైస్ మిల్‌ను జిల్లా కలెక్టర్ పరిశీ లించారు. సంబంధిత కార్యకలాపాలను సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కలెక్టర్‌కు వివరించారు. అనంతరం ములుకనూరు సహకార గ్రామీణ పరపతి సంఘాన్ని సందర్శించి, అక్కడి కార్యకలాపాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన పొందారు. సహకార సంఘం అందిస్తున్న సేవలు సంతృప్తికరంగా ఉన్నాయని కలెక్టర్ అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి, ములుకనూరు సహకార సంఘం చైర్మన్ అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి, సర్పంచ్ ప్రమోద్ రెడ్డి, జిల్లా సహకార అధికారి సంజీవరెడ్డి, డీసీఎస్‌వో వాజిద్ అలీ, సివిల్ సప్లై కార్పొరేషన్ జిల్లా మేనేజర్ మహేందర్, ఏడీఏ ఆదిరెడ్డి, తహసీల్దార్ రాజేష్, ఎంపీడీవో వీరేశం, ఏవో పద్మ, ఇతర అధికారులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

### ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు

# కారిడార్

మొదటిపేజీ తరువాయి..

నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం నిత్యం యాక్సిడెంట్స్ జరిగే ఈ ప్రాంతంలో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని సంకల్పించిందని మంత్రి అన్నారు. సుమారు 941 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టే ఈ ప్రాజెక్ట్ లో రాష్ట్ర వాటాగా 200కోట్లు ఇచ్చేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సుముఖత వ్యక్తం చేశారని తెలిపారు. నాగపూర్ తర్వాత ఇండియాలో చేపట్టే రెండో పెద్ద ప్రాజెక్ట్ అన్నారు. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఎల్బీనగర్,హయత్ నగర్ ప్రాంతాల్లోని 54 కాలనీల్లో నివసించే సుమారు 20లక్షల మంది ప్రజలకు పెద్ద ఉపశమనం లభిస్తుందని,హైదరాబాద్ – విజయవాడ దారిలో రాకపోకలు సాగించే లక్షల మంది 15నిమిషాల్లోపే సిటీ క్రాస్ చేస్తారని అన్నారు. ఎన్‌హెచ్ 65 రూట్ లో ఎల్బీనగర్ నుండి హయత్ నగర్ వరకు విపరీతమైన రద్దీ ఏర్పడి,రోడ్ క్రాస్ చేసేటప్పుడు నిత్యం యాక్సిడెంట్స్ జరుగుతున్నాయని మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పూర్తయితే సమీప కాలనీల్లో నివసించే ప్రజలు కింద సర్వీస్ రోడ్డు ద్వారా సులువుగా రోడ్డు దాటవచ్చు అని, ట్రాఫిక్ ఇబ్బందులు కూడా తొలగిపోతాయని చెప్పారు. దీనికి వీలైనంత త్వరగా సాంక్షన్స్ చేసుకొని,టెండర్ పక్రియ పూర్తి చేసేలా కృషి చేయాలని అధికారులకు సూచించారు. డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ పనులు వార్షిక ప్రణాళికలో ఇప్పటికే పొందుపర్చామని కృష్ణ ప్రసాద్ తెలిపారు. కింద సర్వీస్ రోడ్డు, మధ్యలో జాతీయ రహదారి,పైన మెట్రో రైలు నిర్మాణం నేపథ్యంలో సాంకేతికంగా పిల్లర్ ఫౌండేషన్,స్ట్రక్చర్స్, మెట్రో స్టేషన్స్ వంటి అంశాలపై చర్చించారు. పూర్తి నాణ్యతతో బలమైన పిల్లర్లు, రెగ్యులర్ ఎలివేటెడ్ కారిడార్ కంటే పటిష్టంగా,వెడల్పుగా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పిల్లర్లు నిర్మించాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ నేపథ్యంలో ఒకే వర్క్ ఏజెన్సీ నిర్మాణ పనులు చేపడితే సమన్వయలోపం లాంటి ఇబ్బంది లేకుండా..త్వరగా పూర్తి చేసేందుకు వీలుగా ఉంటుందనే అభిప్రాయం మంత్రి వ్యక్తం చేశారు.



నిర్మాణ పనులు మానిటరింగ్ చేయడానికి వీలుగా ఉంటుందనీ,పనులు కూడా సమాంతరంగా జరుగుతాయని మంత్రితో అధికారులు తమ అభిప్రాయాలను చెప్పారు. మంత్రి సూచన మేరకు అందుకు అనుగుణంగా చీఫ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఆనంద్ మోహన్ ప్రాజెక్ట్ కన్సెంట్ ఇచ్చేందుకు అంగీకరించారు. కన్స్టలెన్సీని పిలిచి డీటెయిల్డ్ ఎస్టిమేట్స్ తయారు చేయాలని నిర్ణయించారు. అధికారులు తమ స్థాయిలో ఉన్న పనులు త్వరగా పూర్తి చేస్తే.. వచ్చే వారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని కలిసి డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ పనులు వెంటనే ప్రారంభించేలా విజ్ఞప్తి చేస్తానని చెప్పారు.

# ఉత్తరప్రదేశ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

మొదటిపేజీ తరువాయి..

వివరాల మేరకు లసోడా ప్రాంతం వైపు వెళుతున్న ఓ ట్రక్కు బ్రేకులు ఫెయిల్ అవ్వడంతో అది అదుపుతప్పి ముందువెళుతున్న కారును, కంటైనర్‌ను ఢీకొట్టింది. ఈ క్రమంలో కంటైనర్ దానిముందు ప్రయాణికులతో వెళుతున్న ఓ బొలేరును ఢీకొట్టడంతో మంటలు చెలరేగాయి. దీంతో బొలేరోలోని 11 మంది ప్రయాణికులు మంటల్లో చిక్కుకొని సజీవదహనం అయ్యారు. ఈ ప్రమాదానికి కారణమైన ట్రక్కు డ్రైవర్ కూడా తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక దళాలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను అదుపులోకి తీసుకొచ్చి.. డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మృతుల వివరాలు తెలుసుకునేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయని, ఈ ఘటనపై పూర్తిస్థాయి దర్యాప్తును కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలకు ఆటంకం కలగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

# హైదరాబాద్‌లో ఒక్కసారిగా మారిన వాతావరణ

మొదటిపేజీ తరువాయి..

మేఘావృతం అయ్యింది. ఆకాశం మేఘావృతమై ఉరుములతో పలుచోట్ల చిరుజల్లుల కురిసాయి. ఈ క్రమంలోనే వాతావరణ శాఖ కీలక ప్రకటన చేసింది. హైదరాబాద్, కామారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, వికారాబాద్, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. నగరంలో గంటకు 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని, ఉరుములతో కూడిన వర్షాలు కురవొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. తెలంగాణలో ద్రోణి, క్యూములోనింబస్ మేఘాల ప్రభావం నెలకొందని వాతావరణశాఖ వెల్లడించింది. శుక్రవారం నిజామాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. అదేవిధంగా రాష్ట్రంలో రానున్న మూడు రోజుల్లో గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఒకటి నుంచి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నది.



Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967